ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 45 సంచిక : 4 అభివృద్ధి మాసపత్రిక ఫిబ్రవరి 2017 ₹ 22

## స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ


నగదు సంస్కరణలు
అరుణ్ జైట్లీ

నగదు సహితం నుండి నగదు రహితం దిశగా...
ప్రవాకర్ సాహు, అమోఘ్ అరోరా

నగదు రహితానికి సైబర్ భద్రత
బి. యం. మహత్రే

నగదురహిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ
సమీరా సౌరభ్

విశిష్ట వ్యాసం
ఎన్నికల్లో నల్లధనం ప్రభావానికి కళ్ళెం - పెద్ద నోట్ల రద్దు
ఎస్. వై. ఖురేషి


ప్రత్యేక వ్యాసం
స్వల్ప నగదు, అంతర్జాతీయ అనుభవాలు - మన స్థితిగతులు
డా॥ అర్పిత ముఖర్జీ, తను ఎమ్ గోయల్




## ప్రపంచ పుస్తక ప్రదర్శన 2017లో ప్రచురణల విభాగం.

మన యోజన పత్రికను ప్రచురిస్తున్న భారత ప్రచురణల విభాగం జనవరి 05 నుండి 15 వరకు న్యూఢిల్లీ, ప్రగతి మైదాన్‌లో జరిగిన ప్రపంచ పుస్తక ప్రదర్శనలో మళ్ళీ తన విశిష్టతను చాటుకుంది. ఇప్పటికే మన ప్రచురణల విభాగం జాతి సంస్కృతి, కళలు, సంప్రదాయాల మీద అనేక అమూల్యమైన గ్రంథాలను ప్రచురించి, పలువురి మన్ననలను పొందింది.




మన సంస్కృతి, విజ్ఞాన వైవిధ్యతలను తన గ్రంథాల ద్వారా ప్రచురణల విభాగం శాశ్వతం చేసింది. జాతిపిత మహాత్మా గాంధీ రచనల సంకలనాన్ని 100 సంపుటాల్లో ఇంగ్లీష్, హిందీ భాషలలో ముద్రించి, ఆయన ప్రతి అక్షరాన్నీ భావితరాలకు అందించ గలిగింది.

“ఇండియా”, “నవ భారత నిర్మాతలు”, వంటి ముద్రణల ద్వారా మన జాతి గర్వించదగిన ప్రముఖుల జీవితాలను అక్షరబద్ధం చేసింది. ఈ వరుసలో ఇటీవల రాష్ట్రపతి భవన్ గురించి, న్యాయస్థానాల గురించి వెలువరించిన ఉత్తమ గ్రంథాలు పలువురి ప్రశంసలను అందుకుంటున్నాయి. అనేక పుస్తకాలను ఈ విభాగం ఈ-పుస్తకాలుగా కూడా అందుబాటులోకి తెచ్చింది.



ప్రపంచ పుస్తక ప్రదర్శనలో కేంద్ర సమాచార శాఖ కార్యదర్శి **శ్రీ అజయ్ మిత్తల్,** ప్రచురణల విభాగం ఏ.డి.జి. **డా॥ సాధన రౌత్.**

పిల్లల పుస్తకాలు, చరిత్ర, సంస్కృతి, వంటి వివిధ అంశాలపై మొత్తం 14 పుస్తకాలను ఈ ప్రదర్శనలో ఆవిష్కరించింది. దేశం మొత్తాన్నీ, నగదురహితం అనే ఝుంఝూమారుతం కుదిపేస్తున్నా ప్రస్తుత తరుణంలో డెబిట్/క్రెడిట్ కార్డులు, భారత్ కొశ్ వెబ్ సైట్ ద్వారా లావాదేవీలతో అమ్మకాలను చేసి, రూ. 17 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది.

■

ఫిబ్రవరి 2017 సంపుటి : 45 సంచిక : 4

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు: దీపికా కచ్చల్

వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి

సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్) : వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in

e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. నగదు సంస్కరణలు 5
– అరుణ్ జైట్లీ

2. నగదు సహితం నుండి నగదు రహితం దిశగా... 7
– ప్రొఫెసర్ ప్రవాకర్ సాహు, అమోఘ్ అరోరా

3. నగదు రహితానికి సైబర్ భద్రత 12
– ప్రొఫెసెర్ బి. యం. మహత్రే

4. నగదురహిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ 15
– సమీరా సౌరభ్

5. నగదు నియంత్రణ ద్వారా నల్లధనం, అవినీతిపై యుద్ధం – డి.ఎస్. మాలిక్ 20

6. స్వల్ప నగదు, అంతర్జాతీయ అనుభవాలు - మన స్థితిగతులు 22
– డా॥ అర్పిత ముఖర్జీ, తను ఎమ్ గోయల్

7. స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ– నల్లధనంపై ప్రభావం 26
– టిమ్సీ జైపురియా,

8. విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ 28

9. దర్పణం 31

10. ఎన్నికల్లో నల్లధనం ప్రభావానికి కళ్ళెం - పెద్ద నోట్ల రద్దు – ఎస్. వై. ఖురేషి 33

11. డిజిటల్ బాటలో గ్రామీణ ఆర్థిక రంగం 37
– సందీప్ దాస్

12. స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ – భారత్‌లో చెల్లింపులు 41
– జి. రఘురాజ్

13. నగదు రహితమే సుగమ్యం 44
– డా॥ సురభి లక్ష్మీ శారద

14. నగదు లావాదేవీల వల్ల కలిగే దుష్ప్రభావాలు 47
– ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

15. ఇండియాలో నగదు రహిత వ్యవస్థ 50
– ఎన్. వెంకటేశ్వర్లు

16. స్వల్ప నగదుతో జీవన సౌలభ్యం... 52
– జీడిగుంట నాగేశ్వరరావు

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

### యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.

యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.

యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.


ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం

### నగదు (ర)హితం



గత నవంబర్ 08వ తేదీన రాత్రి ప్రధానమంత్రి పెద్దనోట్ల రద్దును ప్రకటించినపుడు యావత్ దేశం కూడా ఆశ్చర్యంతో కూడిన అపనమ్మకంతో విస్తుపోయింది. “నల్లధనం, అవినీతి”లను అరికట్టే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏరోజుకారోజు ద్రవ్యోల్బణం, వస్తు, సేవల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ప్రజలచేతుల్లో నుండి వంద, యాభైల నోట్లు దాదాపు కనుమరుగు అయిన పరిస్థితి దాపురించింది. ఇక పది రూపాయల నోట్లనైతే, కేవలం గుళ్ళో దేవుని హుండిలో వేయడానికి లేదా ముష్టివానికి ఇవ్వడానికి మాత్రమే వున్నాయనే వ్యంగ్య భావన అలుముకోసాగింది. గతంలో కూడా మనదేశంలో ఇలా నోట్లరద్దు 1946లో ఒక సారి, 1978లో మరోసారి జరిగింది. అయితే, ఈ రెండు సందర్భాలలో కూడా మన ఆర్థిక వ్యవస్థ అంత పటిష్టంగా లేదు. రద్దు చేసిన నోట్లు కూడా సమాజంలోని పెద్ద వారి వద్ద మాత్రమే వుండేవి! కనుక సామాన్యుడికి అంత బాధ కలుగలేదు. కానీ, నేటి నోట్లరద్దు మాత్రం మొత్తం సమాజంపై తన ప్రభావాన్ని చూపింది. ఎందుకంటే, ఈ రద్దు చేసిన నోట్లే అత్యధికంగా చలామణీలో వున్నాయి కనుక. ప్రజలచేతిలో తమ స్వంత సంపాదనైనాకూడ చిల్లిగవ్వ లేకుండాపోయింది. రోజువారీ అవసరాలైన, పాలు, బ్రెడ్డు, గుడ్డు వంటివి కొనడం కూడా బ్రహ్మాండమయింది. పిల్లల ఫీజులెలా కట్టాలి? పనివాళ్ళకు జీతాలెలా ఇవ్వాలి వంటి విషయాలు ప్రజలకు మహాసమస్యలై కూర్చున్నాయి. దీనికితోడు, బ్యాంకులలోనూ, ఏటిఎంలలోనూ తక్కువగా వున్న నగదునిల్వలు సమస్యను మరింత జటిలం చేశాయి. అదేసమయంలో, బ్యాంకులవద్ద రద్దయిన నోట్లను జమచేసేందుకు/మార్చుకునేందుకు రోజూ తిరునాళ్ళలాంటి పరిస్థితి! దొరుకుతున్న రెండువేల వంటి చిన్నమొత్తాన్నయినా తీసుకోవడానికైతే, దొమ్మీలాంటి పరిస్థితే! ఇంత క్లిష్ట సమయంలో కూడా ఈ చర్యమొత్తం కేవలం అవినీతిని, ఉగ్రవాదానికి ఆర్థిక మద్దతును అరికట్టడానికేనన్న విషయం సామాన్యుడికి పెద్ద ఊరటగా వున్నది. ప్రధానమంత్రి తన ప్రసంగంలోనైతే, ఈ చర్య, అవినీతికి, నల్లధనానికి, నకిలీనోట్ల సమస్యకు వ్యతిరేకంగా సగటు మనిషిని బలోపేతంచేయడానికే అని చేసిన ప్రకటన జనామోదంపొందింది. నల్లధనము, సమాంతర ఆర్థిక వ్యవస్థలు సృష్టించిన సమస్యలకు సగటు మానవుడు ఎంతో చికాకుపడ్డాడు. ఈ నల్లధనం మద్దతుతో ఉగ్రవాదం చెలరేగిపోవడం సామాన్యుడి జీవితాన్ని అతలాకుతలం చేసింది. ఎలాగైనా వీటిని అరికట్టాలని కృతనిశ్చయుడయ్యాడు.

ఈ నోట్లరద్దు వెనుక ప్రభుత్వ మరో లక్ష్యమేమంటే, నగదురహిత ఆర్థికవ్యవస్థను ఏర్పాటుచేయడం! నగదురహిత లావాదేవీలు పూర్తి పారదర్శకంగా జరుగుతాయి. అంటే, ప్రతి లావాదేవీనీ కూడా ఎవరు ఎవరికి చేశారో అద్దంలోలాగా కనపడుతుంది. దీనితో ఉగ్రవాదులకూ, సంఘవ్యతిరేకులకూ జరిగిన చెల్లింపులను సులభంగా పసికట్టవచ్చు. అదేసమయంలో, చలామణీలో ఉన్న అధికారిక నగదు మొత్తాలు ఎంత మొత్తంలో ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుంది కనుక, దాని చలామణీని, అవసరానికి పేదలకు ఎంత మొత్తం రుణాలను ఇవ్వవచ్చు, ఎంతమొత్తాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చు వంటి విషయాలు కళ్ళ ముందుంటాయి. అత్యధిక జనాభా నిరక్షరాస్యులైన మన లాంటి దేశంలో, గ్రామీణప్రాంతాలలో సరైన మౌలిక సదుపాయాలు లేని భారత్ వంటి దేశంలో, డిజిటల్ లావాదేవీల ద్వారా పూర్తి నగదు రహిత ఆర్థికవ్యవస్థను సృష్టించడం సాధ్యంకాదు. కనుక మన మొదటి లక్ష్యం, తక్కువనగదు ఆర్థికవ్యవస్థను సృష్టించడం. అంటే, నియంత్రించగలిగిన లావాదేవీలను డిజిటల్ మార్గానికి మళ్ళించడం. ఇలా ఎక్కువగా డిజిటల్ లావాదేవీలను చేసినవారికి కొన్ని ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. అయితే, ఈ డిజిటల్ లావాదేవీలలో కూడా ఒక ప్రమాదం లేకపోలేదు. అదే, సైబర్ నేరాలు. డిజిటల్ కార్యకలాపాలవల్ల పెద్ద మొత్తంలో నగదును తీసుకువెళ్లడం వల్ల వచ్చే ప్రమాదాలను నివారించగలిగినప్పటికీ, సైబర్ ప్రమాదాలు/నేరాలు మాత్రం పొంచి ఉన్నాయి. అదేసమయంలో ఇలాంటి సైబర్ నేరాలను ఎలా అరికట్టాలో కూడా మనకు స్పష్టంగా తెలుస్తుంది. చాలామటుకు ఇలాంటి నేరాలు మనం ఉపయోగిస్తున్న సాంకేతికత వల్ల మాత్రం కాక, మన నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయనేది సుస్పష్టం. కనుక, మన సైబర్ విధానాలను మరింత పటిష్టపరిచి, ప్రజలలో అవగాహనను పెంచితే సమస్య పరిష్కారం అవుతుంది. ఈ డిజిటలీకరణను అనేక దేశాలలో మొదలెట్టినప్పటికీ, అవి కొంతమేరకే విజయవంతమయ్యాయి. అత్యధికంగా విజయవంతమైనది కేవలం స్వీడన్‌లోనే! మనదేశంలో ఎంతమేర విజయవంతమవుతుందనేది మన నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజలలో ఏమేరకు మనం అవగాహనను కలిగించగలమనే విషయంపైనే ఆధారపడి ఉంటుంది. ఇందుకోసం మనకున్న చట్టాలను మనం నిబద్ధతతో పాటించగలిగితే, ప్రపంచ డిజిటల్ ఆర్థికవ్యవస్థలో ప్రధాన పాత్ర వహించవచ్చు. ■

ఆర్థిక ప్రగతి

# నగదు సంస్కరణలు



**దేశంలోని 126 కోట్ల జనాభాలో 3.7 కోట్ల మంది మాత్రమే 2015-16లో ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారు. వీరిలో 99 లక్షల మంది రూ.2.5 లక్షలకన్నా తక్కువ ఆదాయం ప్రకటించడం వల్ల పన్ను చెల్లించే అవసరం లేకుండాపోయింది. మరో 1.95 కోట్ల మంది రూ.5 లక్షలకన్నా తక్కువ ఆదాయం ప్రకటించగా 52 లక్షల మంది రూ.5-10 లక్షల మధ్య ఆదాయం ప్రకటించారు. ఇక రూ.10 లక్షలకన్నా ఎక్కువ ఆదాయం ప్రకటించినవారి సంఖ్య కేవలం 24 లక్షలే.**

"పెద్ద నోట్ల చలామణీని రద్దు చేస్తున్నట్టు ప్రధానమంత్రి ప్రకటించి రెండు నెలలు గడిచాయి. తదనుగుణంగా ఆ నోట్ల ఉపసంహరణ పూర్తయింది. ఒక దేశ స్థూల దేశీయోత్పత్తి (GDP)లో 12.2 శాతంగా ఉన్న ద్రవ్యం (కరెన్సీ) నుంచి 86 శాతాన్ని ద్రవ్య విపణినుంచి తొలగించి, కొత్త నోట్లతో పూరించాలన్న నిర్ణయం అమలువల్ల అనేక ముఖ్య పరిణామాలు చోటుచేసు కోవడం అనివార్యం. ఇప్పుడిక నోట్ల పూరణ ప్రక్రియ ముందుకు సాగినందున ఈ నిర్ణయం వెనుక హేతుబద్ధత, దాని అమలు-అనంతర ప్రభావాలపై విశ్లేషణకు ఇదే తగిన సమయం:-

### 1. నల్లధనం వ్యతిరేక చర్యలు:

ప్రచ్ఛన్న ఆర్థిక వ్యవస్థకు, నల్లధనానికి మేం వ్యతిరేకమని ప్రస్తుత ప్రభుత్వం పాలనావగ్గాలు చేపట్టిన తొలిరోజునుంచే స్పష్టం చేస్తూ వస్తోంది. ఈ దిశగా సుప్రీం కోర్టు ఆదేశానుసారం నల్లధనంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) నియమించడమే అది తీసుకున్న తొలి నిర్ణయం. మూలంలోనే క్షయం, లాభాల తరలింపు వ్యవహారాలకు సంబంధించిన సమాచార మార్పిడికి అంతర్గత సహకారాన్ని వేగవంతం చేయాలని బ్రిస్‌బేన్‌లో జి-20 దేశాల కూటమి సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి ప్రతిపాదించారు. ఈ దిశగా అమెరికాతో ఒప్పందంతో ముందడుగు పడింది. స్విట్జర్లాండ్‌తోనూ ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా అది 2019 నుంచి అమలులోకి రానుంది. ఆ మేరకు తమతమ దేశాల్లో భారత, స్విస్ పౌరులకుగల ఆస్తుల వివరాలను రెండు ప్రభుత్వాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటాయి. ఇక మారిషస్‌తో ద్వంద్వ పన్ను తప్పింపు ఒప్పందం 1996 నుంచే అమలులో ఉండగా, కొన్ని మార్పులు చేర్పులపై పున: సంప్రదింపులు కొనసాగు తున్నాయి. ఈ ఒప్పందంవల్ల సమాచార ఆదానప్రదానానికి ప్రోత్సాహం లభించింది. అదేవిధంగా సైప్రస్, సింగపూర్‌లతోనూగల ఒప్పందాలపై పున:సంప్రదింపులు సాగుతున్నాయి. భారత దేశానికి వెలుపలగల అక్రమ ఆస్తులపై 60 శాతం పన్ను, పదేళ్ల జైలుశిక్ష విధించే నల్లధన వ్యతిరేక చట్టంవల్ల పన్ను ఎగవేత గురించి వెల్లడించే పరిస్థితి ఏర్పడింది. తదనుగుణంగా 2016లో 45 శాతం పన్నుతో ప్రకటించిన ఆదాయ వెల్లడి పథకం (IDS) విజయవంతమైంది. రెండు లక్షల రూపాయలకుపైగా నగదు

**అరుణ్ జైట్లీ,** కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖమంత్రి, న్యూ ఢిల్లీ.

లావాదేవీలకు పాన్‌కార్డు వివరాల సమర్పణ నిబంధన విధించినందువల్ల నల్లధనంతో ఖర్చులకు అడ్డుకట్ట పడింది. అప్పుడెప్పుడో 1988లో బినామీ చట్టం రూపొందించినా దాన్ని అమలుచేసిన జాడలేదు. ఇప్పుడు దాన్ని సవరించి మళ్లీ అమలులోకి తెచ్చాం. ఈ సంవత్సరం నుంచి ప్రవేశపెట్టదలచిన వస్తుసేవల పన్ను (GST) చట్టం పరోక్ష పన్నుల పాలన మెరుగుకు దోహద పడుతుంది. అంతేగాక సమర్థ చట్టంగనుక పన్నుల ఎగవేతను అరికడుతుంది. పెద్దనోట్ల రద్దు ఈ దిశగా ఒక పెద్ద ముందడుగనే చెప్పాలి.

### 2. సరికొత్త సంప్రదాయం:

దేశంలోని 126 కోట్ల జనాభాలో 3.7 కోట్ల మంది మాత్రమే 2015-16లో ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారు. వీరిలో 99 లక్షల మంది రూ.2.5 లక్షలకన్నా తక్కువ ఆదాయం ప్రకటించడం వల్ల పన్ను చెల్లించే అవసరం లేకుండాపోయింది. మరో 1.95 కోట్ల మంది రూ.5 లక్షలకన్నా తక్కువ ఆదాయం ప్రకటించగా 52 లక్షల మంది రూ.5-10 లక్షల మధ్య ఆదాయం ప్రకటించారు. ఇక రూ.10 లక్షలకన్నా ఎక్కువ ఆదాయం ప్రకటించినవారి సంఖ్య కేవలం 24 లక్షలే. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విషయంలో చట్టాలకు కట్టుబడని సమాజంగా భారతదేశం కునారిల్లుతున్నదని చెప్పడానికి ఇంతకన్నా మెరుగైన రుజువేమీ ఉండదు. పన్ను చట్టాలకు పౌరులు కట్టుబడని కారణంగా పేదరిక నిర్మూలన, జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి తదితరాలకు అవసరమైనన్ని నిధులు లేక రాజీపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏడు దశాబ్దాలుగా పాక్షికంగా నగదు, పాక్షికంగా చెక్కుల రూపంలో లావాదేవీలు సాగించడం భారత సంప్రదాయంగా ఉండేది. 'పక్కా', 'చిత్తు' ఖాతాలు వ్యాపార భాషలో భాగంగా ఉండేవి. పన్ను ఎగవేతను అనైతికం లేదా నీతిమాలిన చర్యగా పరిగణించేవారు. అదో సంప్రదాయ జీవన విధానం... అయితే, ప్రధానమంత్రి నిర్ణయంలో ఆంతర్యం "సరికొత్త సంప్రదాయం" సృష్టించడమే. దేశ పౌరులు ఖర్చుచేసే విధానంలో మార్పు తేవడమే దాని ఉద్దేశం. సహజంగానే ఇది కష్టకారకం. ఆ మాటకొస్తే సంస్కరణలన్నీ కష్టకారకాలే. తలకిందులుగా ఉన్న ప్రస్తుత స్థితిలో అవి మార్పు తెస్తాయి. ఆ మేరకు పెద్దనోట్ల రద్దు కూడా నిజాయితీకి అత్యున్నత స్థానమిచ్చి, నిజాయితీ లేమిని శిక్షిస్తుంది.

### 3. నగదువల్ల ప్రతికూల పరిణామాలు:

దేశంలో కాగితపు డబ్బుకు ఓ పేరుగానీ, చరిత్రగానీ లేవు. అది చేతిలో ఉన్నవాడే దాని యజమాని... దానిపై వచ్చే వడ్డీ శూన్యం (అంటే అదొక సున్నా వడ్డీతో కూడిన అజ్ఞాత యజమాన్య పత్రమన్న మాట). ఇక నేరాలన్నవి నగదు లేదా నగదురహితంగా కూడా చోటుచేసుకోవచ్చు. అయితే, నల్లధనం పోగుపడిన అజ్ఞాత (సమాంతర) ఆర్థిక వ్యవస్థ సదరు అధిక నగదును ఓ మారకపు మాధ్యమంగా పరిగణిస్తుంది. ఫలితంగా పన్ను చెల్లింపు అంశాలకు కట్టుబడక పేద, దుర్బలవర్గాలకు వ్యతిరేకంగా ఎగవేతదారుకు అనుకూలంగా అక్రమ సంపదను సృష్టిస్తుంది. వాస్తవ కాగితపు ద్రవ్యంద్వారా నగదు రూపేణా కొండలా పోగుపడిన సంపదలో అధికశాతం పన్ను ఎగవేత స్వర్గధామాల్లాంటి దేశాలకు హవాలా మార్గంలో తరలిపోతుంది. జాడ పసిగట్టడానికి వీల్లేని చెల్లింపులకు ఈ నగదు అవకాశం కల్పిస్తుంది. లంచాలు, అవినీతి, నకిలీ నోట్లు, ఉగ్రవాదం తదితరాలకు నగదు మాధ్యమంగానే నిధులందు తుంటాయి. అందుకే నైతిక, ప్రగతిశీల సమాజాలు మితిమీరిన నగదు వినియోగానికి బదులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలవైపు స్థిరంగా పయనిస్తున్నాయి. కాగితపు ద్రవ్యం అనేక చిక్కులకు తలుపులు తెరుస్తుంది. పన్ను ఎగవేతదారుల నుంచి మరింత పన్ను వసూలు చేయగలిగే ప్రభుత్వాలు ప్రతి ఒక్కరినుంచీ తక్కువ పన్ను వసూలు చేయగల మెరుగైన స్థితిలో ఉంటాయి. నగదు తగ్గింపువల్ల నేరాలు, ఉగ్రవాదం నిర్మూలన సాధ్యం కాకపోవచ్చు. కానీ, వాటిని బలంగా దెబ్బకొట్టగలమనడంలో సందేహం లేదు. ప్రభుత్వాలు కాగితపు ద్రవ్య పరిమాణాన్ని తగ్గించేందుకు స్వయంగా చురుకైన చర్యలు తీసుకోనిపక్షంలో గుట్టలుగా పోగుపడిన నగదు దానంతట అదే అదృశ్యమయ్యే పరిస్థితి మాత్రం ఉండదు.

### 4. నిర్ణయ తీవ్రత:

పెద్దనోట్ల రద్దు, కొత్త కరెన్సీతో భర్తీపై ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం అత్యంత ధైర్యసాహసాలతో కూడినది. ఈ నిర్ణయం అమలు కూడా ఎంతో కష్టంతో కూడు కున్నదే. ఇది స్వల్పకాలిక అసౌకర్యానికి, విమర్శలకు దారితీయవచ్చు. కొత్త నోట్ల భర్తీ సమయంలో నగదుకు కొరతవల్ల ఆర్థిక కార్యాచరణ మందగించి, ఆర్థిక వ్యవస్థపై తాత్కాలిక ప్రభావం పడుతుంది. ఈ నిర్ణయం వెనుక ఉన్నతస్థాయిలో గోప్యతసహా తగిన పరిమాణంలో కాగితపు ద్రవ్య ముద్రణ, దాన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, బ్యాంక్‌మిత్ర, ఏటీఎంల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంది. మరో వాస్తవమేమిటంటే రద్దయిన పెద్దనోట్లు భారీ పరిమాణంలో బ్యాంకులలో జమ అయినా అదంతా చట్టబద్ధ నగదు కాజాలదు. బ్యాంకులలో జమ చేసినంతమాత్రాన నల్లధనం రంగు మారిపోబోదు. మరోవైపు అది అజ్ఞాత రూపం కోల్పోయి, దాని యజమాని ఎవరన్నది కూడా తేలుతుంది. దాంతో పన్ను వసూళ్ల శాఖ ఈ డబ్బుపై పన్ను విధించే వీలు కలుగుతుంది. ఏదిఏమైనా ఆదాయపు పన్ను చట్టాన్ని

*తరువాయి 14వ పేజీలో...*

# నగదు సహితం నుండి నగదు రహితం దిశగా...



**సమీప భవిష్యత్తులో అన్ని లావాదేవీలూ స్మార్ట్‌ఫోన్‌తో సాధ్యం కావడమేగాక ఏటీఎంల నుంచి నగదు తీసుకునేందుకు కార్డుతో నిమిత్తం లేకుండా మొబైల్ ఫోన్ సంకేతం సరిపోయే పరిస్థితి రానుంది. దీంతో చివరకు క్రెడిట్/డెబిట్ కార్డులు కూడా నిరుపయోగం కాగలవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్రెజిల్, చైనాలలో 40 శాతం ప్రజలు నగదురహిత చెల్లింపు ఉపకరణాలను వినియోగిస్తుండగా, మన జనాభాలో కేవలం 10 శాతం మాత్రమే ఈ విధానాలను అనుసరిస్తున్నారని అంచనా.**

కేంద్ర ప్రభుత్వం 2016 నవంబరు 8వ తేదీన రూ.500, రూ. 1000 నోట్ల చలామణీని రద్దుచేసింది. మొత్తం చలామణీలో ఉన్న బ్యాంకు నోట్ల విలువలో ఈ రెండు రకాల నోట్లు 85 శాతంగా ఉన్నాయి. నోట్ల రద్దు ఫలితంగా నగదుకు కొరత ఏర్పడటంతో ప్రభుత్వం ఎలక్ట్రానిక్ చెల్లింపులు, బదిలీలవైపు మళ్లక తప్పలేదు. ఉగ్రవాదానికి నిధుల ప్రవాహాన్ని నిరోధించడం, నల్లధనం నిర్మూలనే పెద్ద నోట్ల రద్దు ఆంతర్యమని ప్రభుత్వం వివరణ ఇచ్చినా దీనివల్ల నగదురహిత ఆర్థిక వ్యవస్థ దిశగా భారీ పరివర్తన అవశ్యమైన పరిస్థితి తలెత్తింది. వాస్తవం ఇదేనని తేలుస్తూ ఆకాశవాణిలో 2016 నవంబరు 27నాటి తన 'మన్‌కీ బాత్' ప్రసంగం సందర్భంగా "నగదురహిత సమాజమే మన స్వప్నం" అని ప్రధానమంత్రి ప్రకటించారు. కానీ, 100 శాతం నగదురహిత సమాజం అసాధ్యమే అయినా, మనం స్వల్ప నగదు సమాజంతో మొదలుపెట్టి అటుపైన నగదురహిత సమాజం దిశగా సాగడం సుదూర గమ్యమేమీ కాబోదు. నోట్ల రద్దుకు అర్థం మారినప్పటికీ, ప్రభుత్వం మాత్రం నగదురహిత ఆర్థిక వ్యవస్థకు ఎప్పటినుంచో బీజాలు వేస్తోంది... ముందుగా 2014లో జన్‌ధన్ యోజనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత 2016 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా 22 కోట్ల కొత్త బ్యాంకు ఖాతాలు ప్రారంభమయ్యాయి. కాగా, కార్డులద్వారా, డిజిటల్ మార్గాల్లో చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన మార్గదర్శకాలను 2016 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. అనధికారిక నగదు లావాదేవీల వ్యవస్థ నుంచి అధికారిక ఆర్థిక చెల్లింపుల వ్యవస్థవైపు భారీ పరివర్తనతో దేశంలో చెల్లింపులు–పరిష్కార విధానానికి ఉత్తేజం లభిస్తుంది. ఆర్థిక వ్యవస్థ నుంచి నల్లధనం, అవినీతిని పారదోలాలంటే ప్రధానంగా నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి ఎలక్ట్రానిక్ బదిలీ విధానానికి మళ్లటమే అత్యుత్తమ మార్గం. అయితే, ఇందుకోసం సార్వజనీన బ్యాంకింగ్ సేవల అందుబాటు, నదుపాయాలు కూడా అవసరం. నగదుకు బదులుగా క్రెడిట్/డెబిట్ కార్డులు, ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిధుల బదిలీ లేదా ఆన్‌లైన్ (పరోక్ష) కొనుగోళ్లద్వారా నగదురహిత ఆర్థిక వ్యవస్థ నడుస్తుంది. ఈ వ్యవస్థ దిశగా ఆలోచన వాస్తవానికి కాగితపు నగదునుంచి డిజిటల్ నగదువైపు ఒక

**ప్రొఫెసర్ ప్రవాకర్ సాహు,** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ (IEG), న్యూ ఢిల్లీ. E-mail: pravakarfirst@gmail.com
**అమోఘ్ అరోరా,** పరిశోధక విద్యార్థి: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ (IEG), న్యూ ఢిల్లీ E-mail: amogh.arora04@yahoo.com

విప్లవంగా అభివర్ణించవచ్చు. సాధారణంగా నల్లధనం చలామణీ నిరోధం, ధన ప్రవాహంలో పారదర్శకత కోసం ఈ విధానాన్ని అనుసరిస్తారు.

బిల్లుల చెల్లింపు, పండ్లు కొనడం, బస్సు లేదా ట్యాక్సీ ప్రయాణం తదితర లావాదేవీలన్నీ కార్డులద్వారా లేదా డిజిటల్ మార్గంలో నిర్వహించాల్సి ఉంటుంది. మన చేతిలోని సంప్రదాయ నగదుసహిత వాలెట్ (పర్సు)లాగా ఈ-వ్యాలెట్ వాడకానికి భౌతిక రూపంలోని నగదు అవసరం లేదు. ఈ-వ్యాలెట్లు వారివారి బ్యాంకు ఖాతాలతో సంధానమై ఉంటాయిగనుక చెల్లింపులన్నీ వాటినుంచే నేరుగా చేయబడతాయి. ఇవేకాకుండా ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇటీవలే ప్రారంభించిన ఏకీకృత చెల్లింపు సమన్వయ వ్యవస్థ (UPI) కూడా నగదురహితం దిశగా ఇతరత్రా అందుబాటులో ఉన్న విధానాలు. వీటిలో ప్రస్తుతం అధికశాతం ప్రజలు విస్తృతంగా వినియోగిస్తున్నది ఈ-వ్యాలెట్ విధానమే. సమీప భవిష్యత్తులో అన్ని లావాదేవీలూ స్మార్ట్‌ఫోన్‌తో సాధ్యం కావడమేగాక ఏటీఎంల నుంచి నగదు తీసుకునేందుకు కార్డుతో నిమిత్తం లేకుండా మొబైల్ ఫోన్ సంకేతం సరిపోయే పరిస్థితి రానుంది. దీంతో చివరకు క్రెడిట్/డెబిట్ కార్డులు కూడా నిరుపయోగం కాగలవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 2. నగదురహిత ఆర్థిక వ్యవస్థతో ప్రయోజనాలు

ప్రపంచంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థలలో భారత ఆర్థిక వ్యవస్థ కూడా ఒకటి. అయితే, నల్లధనంతోపాటు అవినీతి, ఉగ్రవాదం, అక్రమ సంపద వంటి సమస్యలు మన ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్నాయి. నల్లధనం, అవినీతి కబంధ హస్తాలను తెగగొట్టడానికి ఆర్థిక వ్యవహారాల తనిఖీ (Audit), చట్టాల అమలు సంస్థలు వంటి వివిధ మార్గాలున్నాయి. అయితే, నగదురహిత ఆర్థిక వ్యవస్థలలో అధికశాతం లావాదేవీలు అధికారిక విధానంలో అంతర్భాగంగా ఉంటాయి. అంతేగాక వాటి జాడను సులభంగా పసిగట్టే వీలుంటుంది కాబట్టి ఈ ఉపాయం మరింత ప్రభావవంతమైనదే. భారతదేశంలో నగదుతో నిమిత్తంలేని చెల్లింపు పద్ధతులను పాటించేవారు అత్యల్పం. బ్రెజిల్, చైనాలలో 40 శాతం ప్రజలు నగదురహిత చెల్లింపు ఉపకరణాలను వినియోగిస్తుండగా, మన జనాభాలో కేవలం 10 శాతం మాత్రమే ఈ విధానాలను అనుసరిస్తున్నారని అంచనా. ఇక 2014 సం॥ని ప్రాతిపదికగా తీసుకుంటే భారత్‌లో బ్యాంకులకు వెలుపల చలామణీలో ఉన్న ధనం స్థూల దేశీయోత్పత్తిలో 11.1శాతం అధికంగా ఉంది. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలున్న రష్యా, మెక్సికో, బ్రెజిల్‌లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఈ గణాంకాలను పరిశీలించాక- అనుసరణలో లేని నగదురహిత వినియోగ విపణి పునాదిని బలోపేతం చేసుకోగల పరిధి పుష్కలమని తెలుస్తోంది. అయితే, ఆర్థిక సార్వజనీనత సాధాన లక్ష్యం నేపథ్యంలో సౌలభ్యం, విశ్వసనీయత, భద్రత, అందుబాటుకు ఆస్కారంగల చెల్లింపు పద్ధతులను ప్రవేశపెట్టడంద్వారా నగదురహిత వినియోగదారుల పరిధిని పెంచాల్సి ఉంటుంది. ఈ జాగ్రత్తలు తీసుకోని పక్షంలో బ్యాంకింగ్ సేవలతో సంధానంలేనివారు రుణాలు, బీమావంటి ఇతర ఆర్థిక సేవలకు దూరమయ్యే సమస్య తలెత్తవచ్చు. ఏదేమైనా బ్యాంకుల డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమేగాక లావాదేవీలకు రక్షణ కల్పించడం మనముందున్న పెద్ద సవాలు.

### నగదురహిత సమాజంవల్ల ప్రయోజనాలు

- **సులభ చెల్లింపు పద్ధతి:**

ప్రతి లావాదేవీని అత్యంత సులభంగా నిర్వహించగలిగే వెసులుబాటువల్ల నగదురహితం దిశగా పయనానికి కచ్చితంగా ప్రోత్సాహం లభిస్తుంది. నగదురహిత ఆర్థిక వ్యవస్థతో ప్రతిఒక్కరికీ (అల్పాదాయ వర్గాలుసహా) అపార ప్రయోజనాలు లభిస్తాయి. నగదుతో వ్యాపారం లేదా లావాదేవీల నిర్వహణకయ్యే వ్యయంకన్నా ఈ విధానంలో ఖర్చు తగ్గుతుంది.

- **ముప్పు స్వల్పం:**

సముచిత సైబర్ భద్రత కల్పిస్తున్నందున భారీగా నగదు వెంటనుకుపోవడంవల్ల కలిగే ప్రమాదంకన్నా ఆన్‌లైన్ చెల్లింపులకు ముప్పు స్వల్పం.

- **నోట్ల ముద్రణ ఖర్చు ఆదా:**

కొత్త కాగితపు నోట్ల ముద్రణ, నలిగిన-మాసిన-చిరిగిన నోట్ల మార్పిడి ఖర్చుతో కూడిన వ్యవహారాలు. రిజర్వుబ్యాంకు 2015లో కాగితపు నోట్ల ముద్రణకు వెచ్చించిన సొమ్ము రూ.2700 కోట్లు. నగదురహిత ఆర్థిక వ్యవస్థకు మళ్లడంవల్ల ఈ ఖర్చు తగ్గిపోతుంది.

- **నేరాల తగ్గుదల:**

మాదకద్రవ్య దొంగ రవాణా, మహిళల అక్రమ రవాణా ఉగ్రవాదానికి ఆర్థికతోడ్పాటు, అక్రమ ద్రవ్య చలామణీ వంటి భారీ నగదుతో కూడిన అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నగదురహిత ఆర్థిక వ్యవస్థ అడ్డుకట్ట వేస్తుంది.

- **బ్యాంకింగ్ రంగానికి మేలు:**

బ్యాంకింగ్ రంగానికి ఎంతో మేలు కలుగుతుంది. డిజిటల్ చెల్లింపులు-బదిలీలకు జనం అలవాటుపడిన తర్వాత భారీగా నగదు ఉంచుకునే అవసరం, పోగేసుకోవడం తగ్గుతాయి. దీనివల్ల బ్యాంకింగ్ రంగంలో నగదు

మరింతగా అందుబాటులో ఉండి, తద్వారా మరింత పొదుపునకు వీలు కలుగుతుంది.

- **పారదర్శకత, పర్యవేక్షణ:**

  లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వానికి పర్యవేక్షణ సులువవుతుంది. దీంతో పన్నుల ఎగవేత దుర్లభమై రాబడి వసూళ్లు పెరుగుతాయి.

దేశవ్యాప్తంగా గడచిన రెండు నెలల్లో డిజిటల్ లావాదేవీల సంఖ్య పెరిగింది. చిన్న దుకాణాల నుంచి వీధి వర్తకులదాకా కార్డులద్వారా నగదు చెల్లింపు-బదిలీలకు యంత్రాలు (Swipe Machine) ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఎలక్ట్రానిక్ లావాదేవీల పరిమాణం, తదనుగుణంగా చెల్లింపుల వేగం పెరగడం ఆర్థిక వ్యవస్థకు శుభవార్తే. మొబైల్ వ్యాలెట్ల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో ఇక దేశవాసులు పెద్ద సంఖ్యలో వాటివైపు మళ్లడం ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో తమ సంస్థను ఆమోదించే వర్తకుల సంఖ్య త్వరలోనే 10లక్షలు దాటగలదని, 2017నాటికి తమద్వారా చెల్లింపుల పరిమాణం 1000 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.68వేల కోట్లకుపైగా) చేరుతుందని 'మొబి క్విక్' ఈ-వ్యాలెట్ సంస్థ ఆశాభావం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. నగదురహిత ఆర్థిక వ్యవస్థ లేదా ఎలక్ట్రానిక్ చెల్లింపులవైపు మన పయనంవల్ల పన్నుల ఎగవేత తగ్గడమేగాక ఆర్థిక వ్యవస్థ పనితీరులో పారదర్శకత పెరిగి నల్లధనంపై అదుపు సులభసాధ్యం కాగలదు. అంతిమంగా నగదు పట్టుకుపోవలసిన ముప్పు తగ్గుతుంది. రుణపరపతి అందుబాటు, ఆర్థిక సార్వజనీనత మరింత ప్రణాళికబద్ధం కాగలవు. రాబడుల ప్రవాహంలో పెరుగుదలతోపాటు పారదర్శకత ఫలితంగా అభివృద్ధి ప్రక్రియలలో ప్రభుత్వ వ్యయం పెరిగే అవకాశమూ ఉంటుంది. అయితే, నగదురహిత ఆర్థిక వ్యవస్థ దిశగా పయనంలో రెండోవైపు చూసినప్పుడు భారత్‌వంటి వర్ధమాన దేశంలో పేదలు నగదురహిత లావాదేవీలు నిర్వహించడమన్నది ఆచరణసాధ్యం కాదు. సంప్రదాయ సమాజం, బ్యాంకింగ్‌కు దూరంగా ఉన్న సమూహాలపై నోట్లరద్దు ప్రభావం తీవ్రస్థాయిలోనే పడింది. ఈ వర్గాలు నగదురహిత సమాజంవైపు మళ్లాలంటే మరింత దీర్ఘకాలం అవసరమే. డిజిటల్ లావాదేవీల విధానానికి అలవాటుపడటం తొలుత కష్టతరంగానే అనిపించినా పారదర్శక ఆర్థిక వ్యవస్థవైపు తొలి అడుగుపడుతుందన్న భరోసా లభిస్తుంది. నగదు అంతమన్నది కలలో భావనగా కనిపించినా కచ్చితంగా ఇప్పటికే అది అంతర్థానంవైపు కదులుతోంది.

### 3. నగదురహిత ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ ప్రోత్సాహం

పెద్దనోట్లను రద్దుచేసిన వెంటనే ఏర్పడే నగదు కొరత ఫలితంగా బ్యాంకులు, ఏటీఎంల ముందు జనం బారులుతీరి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంది. ఆ మేరకు డిజిటల్ పద్ధతులవైపు మళ్లేవిధంగా వారిని ప్రోత్సహించి, శ్రద్ధచూపేలా కృషిచేసింది.

* లక్కీ గ్రాహక్, డిజిధన్ వ్యాపార్ యోజన: వినియోగదారుల కోసం 'లక్కీ గ్రాహక్ యోజన' (అదృష్ట వినియోగదారు పథకం), వ్యాపారుల కోసం 'డిజిధన్ వ్యాపార్ యోజన' (డిజిటల్ వ్యాపారి పథకం)లను ప్రవేశపెట్టింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా 2016 డిసెంబరు 25న ఈ రెండు లాటరీ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇలాంటి ప్రోత్సాహక పథకాలతో డిజిటల్ ఇండియా ఉద్యమం దేశ ఆర్థిక వెన్నెముకను కచ్చితంగా బలోపేతం చేస్తుంది. ఈ లాటరీ ద్వారా అదృష్ట విజేతలను ఎంపిక చేసేందుకు రూపే కార్డులు, అవ్యవస్థీకృత ప్రత్యామ్నాయ సేవాధార దత్తాంశం (USSD), ఏకీకృత చెల్లింపు సమన్వయ వ్యవస్థ (UPI), ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (AEPS) వంటివాటితో చేసిన లావాదేవీలను అర్హతలుగా నిర్ణయించింది.
* విత్తీయ సాక్షరతా అభియాన్: నగదురహిత లావాదేవీ పద్ధతులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించేందుకు 'విత్తీయ సాక్షరతా అభియాన్' (ఆర్థిక అవగాహన కార్యక్రమం)ను ప్రారంభించింది. డిజిటల్ ప్రపంచంవైపు నడిచేలా జనసామాన్యంలో అవగాహన కల్పించడమే ఈ ప్రచార కార్యక్రమ లక్ష్యం. ఈ మేరకు నిధుల బదిలీకోసం డిజిటల్ ఆధారిత నగదురహిత ఆర్థిక పద్ధతులను అనుసరించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అలాగే స్వీకరణ, చెల్లింపులను నగదురూపేణా నిర్వహించరాదని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలకు సూచించింది. ఆయా సంస్థల ప్రాంగణాలను నగదురహితంగా (దుకాణాలు, క్యాంటీన్, ఇతర సేవలు) తీర్చిదిద్దాలని కోరింది. అనేక విద్యా సంస్థలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది దీన్నొక సవాలుగా తీసుకుని ప్రభుత్వ సంకల్పాన్ని విజయవంతం చేసేందుకు నడుం బిగించారు. దీంతోపాటు సదరు మంత్రిత్వ శాఖ రూపొందించి ప్రారంభించిన వెబ్‌పేజీలో అనేకమంది నమోదు చేసుకున్నారు. దీనిద్వారా వారు తెలియజేసిన అభిప్రాయాలు,ఇచ్చిన సమాచారాన్నిబట్టి ప్రజల ఉత్సాహాన్ని అర్థం చేసుకోవచ్చు.

* **నగదు కోసం భారత సమన్వయ వ్యవస్థ (BHIM):** సులభ ఆన్‌లైన్ లావాదేవీల కోసం 2016 డిసెంబరు 30న ప్రధానమంత్రి కొత్త ఈ-వ్యాలెట్ యాప్ 'నగదు కోసం భారత సమన్వయ వ్యవస్థ' (భీమ్)ను ఆవిష్కరించారు. ఇది ఆధార్ ఆధారిత మొబైల్ చెల్లింపు మార్గం కావడంవల్ల ప్రజలు నేరుగా తమ బ్యాంకు ఖాతాలనుంచే చెల్లింపులు చేయవచ్చు. బ్యాంకు ఖాతాకు వారివారి ఫోన్ నంబరు సంధానమై ఉంటుంది గనుక ఒక్క బటన్ నొక్కడంద్వారా నగదు చెల్లింపు/బదిలీ పూర్తయిపోతుంది. దీన్ని యుపీఐ సదుపాయంగల అన్ని బ్యాంకుల ఖాతాలతో సమన్వయం చేయాల్సి ఉన్నందున ప్రస్తుతానికి ఒక్క బ్యాంకు ఖాతాను మాత్రమే భీమ్‌లో చేర్చుకునే అవకాశం ఉంటుంది. రెండు వేర్వేరు బ్యాంకులలో ఖాతా ఉన్న వ్యక్తి మరోదాన్ని వినియోగించుకోవాలంటే ఇంకొక యాప్ అవసరమవుతుంది.
* **రూపే:** 'రూపే' అన్నది అంతర్జాతీయ కార్డులు వీసా లేదా మాస్టర్ కార్డు తరహాలో భారత క్రెడిట్/డెబిట్ కార్డు. 'భారత జాతీయ చెల్లింపుల సంస్థ' (NPCI) జన్‌ధన్ యోజన కింద రూపే కార్డును జారీచేసింది. లక్షరూపాయల ప్రమాద బీమా హామీతో ప్రతి ఖాతాదారుకూ బ్యాంకులు ఈ కార్డును అందజేస్తాయి. ఏటీఎంలు, ప్రత్యక్ష, పరోక్ష అమ్మకపు స్థానాల (POS, Online)లో ఈ కార్డు పనిచేస్తుంది. ప్రపంచంలోని ఇలాంటి చెల్లింపు ప్రవేశ వ్యవస్థలలో ఇది ఏడోది కావడం గమనార్హం. కోట్లాది ప్రజలకు రూపే డెబిట్ కార్డు ఉన్నందువల్ల అల్పాదాయ వర్గాలను నగదురహిత ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయడానికి ఇదో మార్గంగా ఉపయోగపడుతుంది. అయితే, రూపే కార్డుల ప్రాథమిక లక్ష్యం ఆర్థిక సార్వజనీనతే కావడం వల్ల ఇది ద్రవ్యోపకరణంగా ప్రపంచస్థాయిని అందుకోవాలంటే అందుకు అనువైన డెబిట్/క్రెడిట్ కార్డు విధానాలను, ప్రమాణాలను అందుకోవాల్సి ఉంటుంది.
* **ఆధార్ చెల్లింపు యాప్:** 'ఆధార్ చెల్లింపు యాప్'ను కూడా ప్రభుత్వం 2016 డిసెంబరు 25న ప్రారంభించింది. ఇది ఆధార్‌ను పౌరుల బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేస్తుంది. ఇది జీవసంబంధ సమాచార గ్రహణ యంత్రంతో అంచే బయోమెట్రిక్ విధానంలో సంధించబడి ఉంటుంది. ఖాతాదారు తన విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)ను నమోదుచేసి, తన లావాదేవీ కోసం బ్యాంకును ఎంచుకోవలసి ఉంటుంది. ఫోన్‌తో పనిలేకుండానే ఈ యాప్‌ను వాడుకో గలగడం వినియోగించుకోగలగడం దీని ప్రత్యేకత.

## 4. అంతర్జాతీయ అనుభవం: స్వీడన్ ఉదాహరణ

ప్రపంచంలోని ఐదు అతిపెద్ద నగదురహిత ఆర్థిక వ్యవస్థలలో స్వీడన్ కూడా ఒకటి. డిజిటల్ మౌలిక సదుపాయాలద్వారా మొబైల్ లేదా ప్లాస్టిక్ చెల్లింపులను సుగమం చేసే ప్రభావవంతమైన విధానాలను ఇప్పటికే అనుసరిస్తోంది. నగదురహిత ఆర్థిక వ్యవస్థవైపు పరుగుపందెంలో ఇప్పటికే ప్రథమ స్థానంలో ఉండటమేగాక 2020నాటికల్లా ఈ లక్ష్యాన్ని 100 శాతం అందుకోగలమని ప్రకటించిన తొలి దేశం స్వీడన్. ఆనాటికి చర్చిలుసహా బ్యాంకులు, బస్సులు, వీధి వర్తకంలోనూ ప్లాస్టిక్ లేదా వాస్తవిక చెల్లింపులు ఆగుతాయని పేర్కొంది. నిరుడు (2016) తమ దేశంలో నగదు లావాదేవీల విలువ కేవలం 2 శాతమేనని, 2020నాటికి ఇది 0.5 శాతానికి తగ్గుతుందని స్వీడన్ కేంద్ర బ్యాంకు (Riksbank) ప్రకటించింది. ఆ దేశంలోని 1600 బ్యాంకు శాఖలకుగాను 900 శాఖలు తమవద్ద నగదు ఉంచుకోవడంగానీ, డిపాజిట్లను స్వీకరించడంగానీ చేయడం లేదు. అలాగే అనేకచోట్ల.. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఏటీఎంలనేవే లేవు. స్వీడన్ కరెన్సీ 'క్రోనా' చలామణీ 2009లో 106 బిలియన్లుండగా 2016నాటికి 80 బిలియన్లకు పడిపోయింది. నగదుసహితం నుంచి నగదురహిత విధానంవైపు మారడంలో సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యపాత్ర పోషిస్తుంది. స్వీడన్‌లో ఇప్పుడు 'స్విష్' (అనేక ప్రధాన స్వీడిష్, డ్యానిష్ బ్యాంకుల సమ్మేళనంతో రూపొంది ఆరు దేశీయ బ్యాంకులు వినియోగిస్తున్న యాప్)కు విశేష ప్రజాదరణ ఉంది. దీని వాడకందారులు తాము రెస్టారెంట్‌లో ఉన్నా, క్యాబ్‌లో వెళ్లాలన్నా, చిల్లర దుకాణానికి వెళ్లినా, ఒక బ్యాంకునుంచి మరో బ్యాంకుతో లావాదేవీలు జరపాల్సి వచ్చినా ఈ యాప్‌తో వెసులుబాటు లభిస్తుంది. ఈ యాప్ వినియోగదారుల సంఖ్య నెలకు 1.2 లక్షల మేర పెరుగుతోంది. ఒక్క 2014 డిసెంబరులోనే 1.69 బిలియన్ క్రోనార్లు స్విష్ యాప్‌ద్వారా బదిలీ అయ్యాయని, 2017నాటికి వాడకందారుల సంఖ్య 30 లక్షలకు పెరగగలదని కంపెనీ అంచనావేసింది.

స్వీడన్‌తో పోలిస్తే భారత్‌లో జన పునాదిసహా ఇతర కోణాలరీత్యా భారీ వ్యత్యాసాలున్నాయి. అవేమిటంటే... 2015 డిసెంబరు 31నాటి అంచనాల మేరకు స్వీడన్ జనాభా 98.5 లక్షలు కాగా, 100 శాతం అక్షరాస్యులే. అదే సమయంలో భారత జనాభా 126 కోట్లుగా ఉంటే అక్షరాస్యత

కేవలం 75 శాతమే. అంటే స్వీడన్ మొత్తం జనాభాతో పోలిస్తే మన దేశంలో నిరక్షరాస్యుల సంఖ్య 30 రెట్లు అధికం. ఇక ప్రపంచ సగటు ప్రకారం స్వీడన్ తలసరి ఆదాయం 435 శాతమైతే భారత్‌లో 14 శాతమే. మన దేశంలో 68 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తుండగా స్వీడన్‌లో 85.5 శాతం పట్టణవాసులే. కాబట్టి స్వీడన్ అనుభవాల కోణంలో భారత్ గురించి అంచనాలు వేయడం కష్టం. కానీ, భారత్ ఇప్పుడు భీమ్ యాప్‌తో ముందడుగు వేసింది. భారత జనాభాలో అధికశాతానికి తగిన సాంకేతిక పరిజ్ఞానం లేనందున దీన్ని అందిపుచ్చుకోవడానికి కొంత సమయం అవసరమవుతుంది. ఈ పరిస్థితులలో నగదురహిత లావాదేవీలను సులభం, సురక్షితం చేసేందుకు రిజర్వుబ్యాంకు, ఇతర వాణిజ్య బ్యాంకులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలి. ఇక దేశంలో 'వాస్తవ సమయ స్థూల పరిష్కార వ్యవస్థ' (RTGS), జాతీయ ఎలక్ట్రానిక్ నిధి బదిలీ (NEFT) విధానాలను అన్నివర్గాలవారూ విరివిగా అనుసరిస్తున్నారు. ఆ మేరకు 2013 నుంచి 2016 మధ్య ఈ సదుపాయాల వినియోగదారుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. అలాగే మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు కూడా దాదాపు ఏడు రెట్లు పెరిగాయి. ఏటీఎంలు, ప్రత్యక్ష విక్రయ ప్రాంతాల్లో కార్డు లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. బ్యాంకులు నగదురహిత చెల్లింపు పద్ధతిని విస్తృతంగా అనుసరిస్తూ లావాదేవీలను వేగవంతం చేశాయి. సామర్థ్యాన్ని పెంచుకుంటూ, బ్యాంకు ఖాతాలద్వారా తమపై పడుతున్న ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల (వంటగ్యాస్ సబ్సిడీ, ఉపాధి హామీ చెల్లింపులు వగైరా) భారాన్ని తట్టుకుంటూ ముందుకెళ్తున్నాయి. అయినప్పటికీ ఎలక్ట్రానిక్ చెల్లింపులు 5 శాతానికన్నా తక్కువగా ఉన్న నేపథ్యంలో దేశం ఇంకా నగదు చోదితంగానే ఉన్నది.

## 5. నగదురహిత ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదురయ్యే సవాళ్లు

పెద్దనోట్ల రద్దు నిర్ణయం ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని నగదు వినియోగం తగ్గించేలా ప్రోత్సహించినా, ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి అనేక సవాళ్లు విసిరింది. డిజిటల్ విధానంలోకి మారాలన్నదానిపై అందరిదీ ఏకాభిప్రాయమే. కానీ, సముచిత మౌలిక సదుపాయాలు లేకుండా ఈ లక్ష్యం సాధించగలమా? గ్రామీణ ప్రాంతాలలో స్టేట్‌బ్యాంకుసహా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఏటీఎంలు 20.8 శాతం ఉండగా ప్రైవేటు బ్యాంకుల ఏటీఎంలు 8.5 శాతమే ఉన్నాయి. గ్రామాలలో ఏటీఎంలను కనుగొనడం కష్టమే. ఇక ఈ వ్యాలెట్, మొబైల్ చెల్లింపు వ్యవస్థల కోసం స్మార్ట్‌ఫోన్‌తో పాటు ఇంటర్నెట్ కనెక్షన్ తప్పనిసరి. కానీ, జనాభాలో నాలుగు శాతానికన్నా తక్కువ మందికి మాత్రమే స్మార్ట్‌ఫోన్లు ఉండగా, వేగవంతం విశ్వసనీయమైన ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవడం ఖర్చుతో కూడుకున్నదే. అలాగే ప్రభుత్వ వైఫై లభ్యత (Hotspot) కష్టం. అంతేగాక మొబైల్ చార్జింగ్ సదుపాయం అతి తక్కువ లేదా అసలు ఉండకపోవడంతో పాటు సైబర్ భద్రత అత్యంత ఆందోళనకరం. చిన్నచిన్న దుకాణాల్లో కార్డు ఉపయోగిద్దామంటే అక్కడ సైబర్ ముప్పు ఉండదన్న భరోసా ఏమిటన్నది ప్రశ్న. ఒక్కసారి కార్డుకు నకిలీ తయారై కష్టార్జితం కోల్పోయేవారు తిరిగి కోలుకోవాలంటే ఏళ్లు పడుతుంది.

ఏటీఎంలవద్ద దాదాపు 30 లక్షల డెబిట్ కార్డుల వివరాలను సైబర్ దొంగలు అపహరించారని, ఖాతాదారులు తమ పిన్ నంబర్లను మార్చుకోవాలని 2016 అక్టోబరులో హెచ్చరికలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితి నడుమ నెల గడిచేలోగా పెద్దనోట్ల రద్దుతో కార్డు లావాదేవీలు ఆకస్మికంగా వేగమందుకున్నాయి. ఒక్కసారిగా పైనపడిన ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆయా నెట్‌వర్క్‌లు మొరాయించి, జనం గంటల పాటు బ్యాంకులు, ఏటీఎంల ముందు బారులు తీరాల్సి వచ్చింది. మరోవైపు అవినీతిపై పోరాటానికే నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పదేపదే వాదిస్తూ వచ్చింది. కాగా, ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థలో రాజకీయ పార్టీలకు నిధులివ్వడం అన్నది ఓ భారీ అవినీతికి మూలం. వాస్తవానికి ఉన్నతస్థాయిలో అవినీతి కార్యకలాపాలు నగదుతో ముడిపడి ఉండవు. కాబట్టి రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకత తీసుకురాకపోతే అవినీతిపై పోరాటానికి చేసే ఏ ప్రయత్నమైనా విజయవంతమయ్యే మాట అటుంచి, దానికి అర్థమే ఉండదు. గ్రామీణులను చైతన్యం చేయడంతోపాటు మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంసహా ఈ లోపాలను అధిగమించగల విధానాలపై ప్రభుత్వం చాలా సమయం వెచ్చించాల్సి ఉంటుంది. రాత్రికిరాత్రి భారతదేశం నగదురహితం కాబోదు; ముందుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి... ఆ తర్వాత వాటిని అధిగమించే మార్గాలను యోచించాలి.

## 6. ఉపసంహారం

దేశంలో 100 శాతం నగదురహిత సమాజం అసాధ్యమే అయినా, మనం స్వల్ప నగదు సమాజంతో మొదలుపెట్టి అటుపైన అధికశాతం నగదురహిత సమాజంగా మారవచ్చు. ఈ దశకు చేరడం కూడా అపూర్వ ప్రగతిశీల పరిణామమే. మారుమూల సంప్రదాయ రంగాలలో ప్రత్యేకించి కొన్ని విలక్షణ లావాదేవీలలో నగదు కీలక పాత్ర పోషించడం నిజమే అయినా వాటినీ యాంత్రికీకరణ చేయవచ్చు.

*తరువాయి 14వ పేజీలో...*

# నగదు రహితానికి సైబర్ భద్రత




**హ్యాకర్ల నుంచి బ్యాంకు ఖాతాలపై దాడులు జరగకుండా ఫైర్ వాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వినియోగ దారులు క్లిష్టమైన పదబంధాలతో పాస్ వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో తరచూ పాస్‌వర్డ్‌లను మార్చడం ద్వారా మరింత రక్షణ ఏర్పడుతుంది. ఆన్‌లైన్ భద్రతలో అత్యంత కీలకమైనది వినియోగ దారుడి పాస్‌వర్డ్ అనే సంగతి గుర్తుంచు కోవాలి. ఈ పాస్‌వర్డ్‌ను ఎవరితోనూ పంచుకోకూడదు. తరచూ మార్చుతూ క్లిష్టమైన పదబంధాలను పాస్‌వర్డులుగా ఎంచుకోవాలి.**

సాంకేతిక పరిజ్ఞానం ఆధునిక యుగంలో పెను మార్పులకు దోహదం చేసింది. ముఖ్యంగా ఈ మార్పు పలు సంచలనాలు సృష్టించడటమే కాకుండా జీవన విధానంలో కూడా పలు మార్పులు తెచ్చింది. ముఖ్యంగా సైబర్ విప్లవం ప్రపంచ గతిని మార్చివేసింది. ప్రపంచంలో ఎక్కడ నుంచి అయినా పనులు చేసుకునే వీలు కలిగింది. సాంకేతిక విజ్ఞానం వల్లనే ముఖ్యంగా వ్యాపార నిర్వహణ కూడా చాలా సులుభతరం అయ్యింది. అయితే ఇక్కడ మరో ముఖ్య అంశం. సైబర్ ప్రపంచం విస్తరణ, ఉపయోగాలతో పాటు దాని భద్రతపై తలెత్తుతున్న సవాళ్లను కూడా గమనించాల్సి ఉంది. ముఖ్యంగా వ్యాపార, ఆర్థిక లావాదేవీల్లో సైబర్ సేవలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఉదాహరణకు ఇటీవలి కాలంలో ఒక సినిమా చూడాలన్నా కూడా క్యూలైన్లు మానేసి డిజిటల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే వీలు కలిగింది. అయితే ఈ తరహా ఆన్‌లైన్ చెల్లింపుల విధానానికి తొలుత 2001లో హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా అంకురార్పణ జరిగింది. హైదరాబాద్‌లోని మంచినీటి బిల్లుల చెల్లింపులన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం హైదరాబాద్ వాటర్ బోర్డు, ఆంధ్రాబ్యాంకు, ఐడీఆర్‌బీటీ, సీఎంసీ లాంటి సంస్థలు చేతులు కలిపాయి. ఆంధ్రాబ్యాంకు వారు జారీ చేసిన ఈ-చెక్ ద్వారా చెల్లింపుల వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే ఈ తరహా చెల్లింపుల కోసం వినియోగదారుల భరోసా కోసం పలు భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ చెల్లింపుల వేదికపై కావాల్సినవి ప్రధానంగా అధీకృత వ్యవస్థ, జవాబుదారీ లావాదేవీ, అవిచ్ఛిన్నత వీటి ఆధారంగా సైబర్ చెల్లింపుల వ్యవస్థను నిర్మించాల్సి ఉంటుంది.

సైబర్ భద్రత అనేది ఒక నమ్మకమైన పునాదిపై నిర్మించాల్సిన వ్యవస్థ. అలాగే సురక్షితమైన వ్యవస్థగా రూపొందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సైబర్ భద్రతను వివిధ పేర్లతో పిలుస్తారు. అందులో ప్రధానమైనవి. ఐటీ సెక్యూరిటీ, డిజిటల్ సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ, సిస్టం సెక్యూరిటీ, ఇంటర్నెట్ సెక్యూరిటీగా నిపుణులు పిలుస్తుంటారు. ముఖ్యంగా వినియోగదారుడి భద్రత, నమ్మకం చూరగొనడం సైబర్ భద్రత ప్రధాన ఉద్దేశ్యం. వినియోగదారుడి పేరు, ఖాతా వివరాలు, బ్యాంకు బ్యాలెన్స్ వివరాలు,

**ప్రొఫెసర్ బి. యం. మహత్రే,** సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ & రిసెర్చ్ ఇన్ బ్యాంకింగ్.
E-mail: bmmehtre@idrbt.ac.in

అలాగే లావాదేవీల విషయంలో గోప్యత అవసరం, మూడో శక్తి ఈ వ్యవస్థలో ప్రవేశించకుండా బలమైన వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇతరులతో వినియోగదారుల వివరాలు పంచుకోకుండా రక్షణాత్మక చర్యలు సైతం చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే వినియోగదారుల వివరాలు కేవలం బ్యాంకు అధికారులు మాత్రమే చూసే విధంగా ఉండాల్సిన అవసరం ఉంది. సమాచార చౌర్యం జరగకుండా అన్నితరహాల్లో భద్రత చేపట్టాల్సిన అవసరం ఉంది. వినియోగ దారుడికి భద్రతపై పూర్తి విశ్వాసం కలిగించేలా సైబర్ భద్రత చేపట్టాలి. లావాదేవీల సందర్భంగా రెండంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా లావాదేవీలపై తరచూ వినియోగదారుడికి ఈ–మెయిళ్ల ద్వారా కానీ ఎస్సెమ్మెస్‌ల ద్వారా కానీ సమాచారం చేరవేయాల్సిన అవసరం ఉంది. ఇలా చేయడం ద్వారా కూడా సమాచారం చేరవేయడం ద్వారా వినియోగదారుడికి బ్యాంకు మధ్య పారదర్శకత నెలకొనే అవకాశం ఉంది. గోప్యతతో పాటు సమాచార చౌర్యం అరికట్టేందుకు పలు రక్షణాత్మక వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. ముఖ్యంగా సంక్లిష్ట గణాంక ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా రక్షణాత్మక వ్యవస్థలో ఇతరులు ప్రవేశించకుండా నిరోధించే అవకాశం ఉ ంది. అలాగే వినియోగదారుడు ఎప్పుడు ఏ సమయంలో కావాలంటే అప్పుడు సమాచారం పొందే వీలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇది కూడా సైబర్ భద్రతలో అత్యంత కీలకమైన అంశమే.

సైబర్ వ్యవస్థలో అత్యంత కీలకమైనది, ఇంటర్నెట్ రక్షణాత్మక వ్యవస్థ, సాధారణంగా అంతర్గతంగా ఏర్పాటు చేసే ఇంట్రానెట్ వ్యవస్థలో మూడో శక్తి ప్రత్యామ్నాయ దాడులను అరికట్టడం సులభం. అయితే ఇంటర్నెట్ వ్యవస్థలో ప్రపంచంలోని చాలా కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాలు కనెక్ట్ అయిఉంటాయి. ఇంటర్నెట్ ద్వారా ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలపై హ్యాకింగ్ తరహా దాడులు జరిగి ఆర్థిక మోసాలు ఆస్కారం ఉంది. దీనిని అరికట్టేందుకు అటు వినియోగ దారులు బ్యాంకు ఇరువురూ తమ తమ రక్షణాత్మక వ్యవస్థల పట్ల చాలా జాగరూకత వహించాల్సిన బాధ్యత ఉంది. ముఖ్యంగా హ్యాకర్ల నుంచి బ్యాంకు ఖాతాలపై దాడులు జరగకుండా ఫైర్ వాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వినియోగ దారులు క్లిష్టమైన పదబంధాలతో పాస్ వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో తరచూ పాస్‌వర్డ్‌లను మార్చడం ద్వారా మరింత రక్షణ ఏర్పడుతుంది.

నేడు రకరకాల మొబైల్ వాలెట్లు, అలాగే ఆన్‌లైన్ అకౌంట్లు ఏర్పడుతున్న దరిమిలా ఇలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ భద్రతలో అత్యంత కీలకమైనది వినియోగ దారుడి పాస్‌వర్డ్ అనే సంగతి గుర్తుంచు కోవాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ భద్రతలో పాస్‌వర్డ్ అనేది ఒక తాళం చెవిలాంటిది. ఈ పాస్‌వర్డ్‌ను ఎవరితోనూ పంచుకో కూడదు. చాలా గోప్యత పాటించాల్సి ఉంటుంది. తరచూ మార్చుతూ క్లిష్టమైన పదబంధాలను పాస్‌వర్డులుగా ఎంచుకోవాల్సి ఉంది. ఒకవేళ పాస్‌వర్డ్ ఎవరికైన తెలిసిపోతే వెంటనే మార్చుకోవడమో, లేదా బ్యాంకు వారిని సంప్రదించి అకౌంట్‌ను స్తంభింప చేయడమో చేయాల్సి ఉంటుంది. అలాగే మనం వాడుతున్న కంప్యూటర్‌లో సైతం వైరస్‌ల అటాక్‌లు జరగకుండా యాంటీ వైరస్ లాంటి సాఫ్ట్‌వేర్‌లు వాడాల్సిన అవసరం ఉంది. సైబర్ చౌర్యం, అలాగే హ్యాకర్ల నుంచి వచ్చే ఫిషింగ్ మెసేజ్‌లు, ఈ–మెయిళ్ల పట్ల జాగరూకత వహించాలి. ముఖ్యంగా లాటరీ తగిలింది అనే పేరిట వచ్చే మెసేజీలను వెంటనే డిలీట్ చేయడం అలాగే పోలీసు శాఖ వారి సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయడం వంటివి చేయాలి. నెట్‌వర్క్‌కు సంబంధించిన రక్షణాత్మక వ్యవస్థను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఎప్పటికప్పుడు నూతనంగా వచ్చే సవాళ్లను స్వీకరిస్తూ, సైబర్ సెక్యూరిటీని మరింత కఠినతరంగానూ, వినియోగదారుడికి సులభగ్రాహ్యంగానూ రూపొందించాల్సిన అవసరం ఉంది. సైబర్ భద్రత కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు అందుకు తగిన సిబ్బందిని కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

నేడు ప్రపంచమంతా సైబర్ కుగ్రామంగా మారిపోతోంది. ఇలాంటి చారిత్రక సందర్భంలో పలు సవాళ్లు కూడా ఎదురవడం సహజం. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్లాల్సి ఉంది. నేడు సైబర్ భద్రత వ్యవస్థ కూడా నూతన అవకాశాలను కల్పించింది. ఈ రంగంలో కూడా అటు ఉద్యోగిత పెరిగింది. యువతకు అవకాశాలు కలుగుతున్నాయి. యువ ఇంజనీర్లు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని సైబర్ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడమే కాకుండా శాస్త్రసాంకేతికతను కొత్త పుంతలు తొక్కించాల్సిన అవసరం ఉంది. నేటి ప్రపంచం ఈ దిశగా కదలాల్సిన అవసరం ఉంది.

**పాస్‌వర్డ్ ఏర్పాటుకు కొన్ని సూచనలు**

- పాస్‌వర్డులో సుమారు 8 నుంచి10 కేరక్టర్లు ఉండాలి. ఇందులో ఆల్ఫబెట్లు, నెంబర్లు ఇతర సంజ్ఞలు వాడాలి.
- కీబోర్డులోని అప్పర్ కేస్, లోయర్ కేస్

అక్షరాలను వాడాలి

- సంక్లిష్ట పదబంధాలను పాస్‌వర్డులుగా ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది.
- పాస్‌వర్డులను తరచూ మార్చాలి.
- ఎట్టిపరిస్థితుల్లోనూ పేర్లను, పుట్టిన తేదీలను, సులభమైన పదాలను పాస్‌వర్డులను పెట్టుకోకూడదు.
- సులభంగా ఉండే పదాలను వాడకండి

**సెక్యూరిటీ సూచనలు**

- లావ్‌టావ్‌లు, డెస్క్‌టావ్, మొబైల్ సెక్యూరిటీ ఫీచర్లను అవ్‌డేట్ చేసుకోవాలి
- సిస్టం పాస్‌వర్డు ఎంపిక
- అధీకృత వెబ్‌సైట్లు మాత్రమే చూడాలి
- కంప్యూటర్‌ను టర్నాఫ్ చేయాలి
- యూఎస్‌బీ ద్వారా కూడా సెక్యూరిటీ ఫీచర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.
- సోషల్ మీడియాపై దృష్టిసారించాలి
- ఆన్‌లైన్ బ్యాంకింగ్ పై కూడా జాగ్రత్త వహించాలి.

**నెట్‌వర్కింగ్ అడ్మిన్‌లకు సలహాలు, సూచనలు :**

- పై స్థాయి నుంచి ఒక రక్షణాత్మక పాలసీని అమలు చేయాలి.
- ప్రతి ఉద్యోగికి ఆ రక్షణాత్మక వ్యవస్థపై అవగాహన ఉండాలి.
- ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలి.
- సమాచారం బ్యాకప్‌లు నిర్వహించాలి.
- అడ్మిన్ రక్షణాత్మక వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలి.
- ఐ.ఆర్.డీ.బీ.టీ. రూపొందించిన మార్గదర్శకాలను పాటించాలి.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్యాష్‌లెస్ ఎకానమీపై విరివిగా చర్చనడుస్తోంది. ఈ దరిమిలా సైబర్ సెక్యూరిటీ కూడా అంతే కీలకమని ప్రతీ ఒక్కరూ గుర్తించాల్సిన సందర్భంగా ఆసన్నమైంది. ■

*6వ పేజీ తరువాయి...*

## స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ

నవరించినందువల్ల సదరు డబ్బు స్వచ్ఛందంగా ప్రకటించినదైనా, పట్టుబడినదైనా దానిపైన భిన్న శాతాలలో హెచ్చు పన్నుతోపాటు జరిమానా కూడా విధించవచ్చు.

**5. నేటి పరిస్థితి:**


కష్టం, అసౌకర్యం కలిగించిన పరిస్థితి మెల్లిగా కనుమరుగవుతోంది. ఆర్థిక కార్యాచరణ మళ్లీ పుంజుకుంటోంది. వృద్ధికి ఊతమిచ్చే విధంగా రుణాలిచ్చేందుకు బ్యాంకులవద్ద సమృద్ధిగా నగదు నిల్వలున్నాయన్నది వాస్తవం. ఈ సొమ్ముకు బ్యాంకులు తక్కువ వడ్డీ ఇస్తాయిగనుక రుణాలపై వడ్డీశాతం కూడా తగ్గే వీలుంది. ఈ పరిణామాలు ఇప్పటికే మనకు కళ్లకు కడుతున్నాయి. విడి ద్రవ్యంగా విపణిలో చలామణీ అయిన లక్షల కోట్ల రూపాయలు ఇప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రవేశించాయి. ఈ సొమ్ము తన అజ్ఞాత స్వరూపాన్ని కోల్పోవడమేగాక దీనిపై పన్ను విధించాక మిగిలే సొమ్మును దాని యజమానులకు మరింత ప్రయోజనకరమైన పనుల కోసం వినియోగించేందుకు వీలవుతుంది. తత్ఫలితంగా బ్యాంకింగ్ లావాదేవీలతోపాటు ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరగక తప్పదు. మధ్య–దీర్ఘకాలికంగా స్థూల దేశీయోత్పత్తి మరింత స్వచ్ఛతను, వృద్ధిని సాధిస్తుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రవేశించే, అధికారిక లావాదేవీలలో వాడే సొమ్ము ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధింపు స్థాయి పెంపునకు అవకాశమిస్తుంది. కేంద్ర, రాష్ట్రాలు మళ్లీ నిలదొక్కుకుంటాయి. ఆర్థిక వ్యవస్థ కూడా నగదుతోపాటు డిజిటల్ లావాదేవీలతో పరిపుష్టమవుతుంది". ■

*11వ పేజీ తరువాయి...*

## నగదుసహిత ఆర్థికం నుంచి స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ దిశగా...

సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న దృష్ట్యా అత్యంత సంప్రదాయ కొనుగోలుదారుల బ్యాంకు ఖాతాలనుంచి సొమ్ము చెల్లించగలిగేలా యాప్‌లను రూపొందించడం సాధ్యమే. అంతేగాక చలామణీలో ఉన్న నగదు పరిమాణం తగ్గితే, అధికశాతం లావాదేవీలు డిజిటల్ రూపంలోకి మారి జనం తక్కువ సొమ్మును దగ్గరుంచుకుంటారు. ఆ విధంగా ఇంట్లో ఉంచుకున్న సొమ్ముకు వడ్డీ నష్టపోయే పరిస్థితి కూడా తప్పుతుంది. దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థను అదుపులో పెట్టడానికి ఆర్థిక లావాదేవీల డిజటలీకరణ కూడా ఓ ప్రభావవంతమైన మార్గం. ఇది ఖాతాల నిర్వహణను సులభతరం చేసి, పన్ను పునాదిని పెంచుతుంది. భౌతిక రూపంలో సొమ్ము తీసుకెళ్లే అవసరాన్ని గణనీయంగా తగ్గించి, దొంగల భయాన్ని కూడా తొలగిస్తుంది. దొంగనోట్ల చలామణీ అంతం కావడమేగాక అక్రమ ద్రవ్య చలామణీ కూడా తగ్గిపోతుంది. డిజిటల్ సదుపాయాలవైపు మళ్లడం, ఆర్థిక లావాదేవీలను పసిగట్టడం వంటివీ వ్యయంతో కూడుకున్నవే. సమాచార సాంకేతిక పరిజ్ఞాన మౌలిక సదుపాయాలు భారీ ఎత్తున అవసరం. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు దాటినా ఈ విషయంలో భారత్ ఇంకా వెనుకబడి ఉందనే చెప్పాలి. ఏదేమైనా సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, అధికారిక బ్యాంకింగ్ రంగ ఆర్థిక సార్వజనీనత, అవగాహన కల్పన ప్రచారం, సముచిత సమస్యా పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై ఎంత శ్రద్ధగా దృష్టి సారిస్తామనేదానిపైనే నగదురహిత ఆర్థిక వ్యవస్థ దిశగా పయనం ఆధారపడి ఉంటుందన్నది వాస్తవం. ■

# నగదురహిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ



**దేశజనాభాలో రెండింట మూడు వంతులు అంటే సుమారు 870 మిలియన్ల (లేదా 87 కోట్ల) మంది గ్రామీణప్రాంతాల్లోనే ఉండడం వల్ల వీరందరినీ నగదు రహిత కార్యకలాపాల వైపు మళ్ళించడమన్నది ఈ దశాబ్దంలోనే బృహత్తరమైన సవాలుగా చెప్పుకోవచ్చు. అయితే, 2020 నాటికి ఇంటర్నెట్ వినియోగదారుల్లో సుమారు 50 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటారన్న అంచనా ఆశాజనకంగా కనిపిస్తోంది. ఇంటర్నెట్ వినియోగిస్తున్న వారి సంఖ్య 2015 నాటికి 120 మిలియన్లు కాగా ఇది 2020 నాటికి 315 మిలియన్లకు పెరుగుతుందని అంచనా.**

నగదురహిత కార్యాకలాపాలను ప్రోత్సహించడం ద్వారా పారదర్శక పద్ధతిలో పాలనా వ్యవహారాలన్నింటిని కొనసాగించడంపై ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో పాలకులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. అయితే, ఇప్పటికీ అన్ని దేశాల్లోనూ నగదు లావాదేవీలే ఎక్కువగా జరుగుతుండడం విశేషం. ఆర్థిక లావాదేవీలన్నింటినీ నగదురహితంగా నిర్వహించడం వల్ల ఎక్కడో ఒకచోట వాటికి సంబంధించిన నమోదు జరగడంతో అనేక లాభాలున్నాయి. దీనివల్ల కలిగే తొలి ప్రయోజనం తనకు రావలసిన పన్నుల మొత్తాన్ని ప్రభుత్వం రాబట్టు కోగలగడం కాగా, రెండోది అక్రమ వ్యవహారాలకు అడ్డుకట్ట పడడంవల్ల ఆర్థిక సహకారం అందే అవకాశం లేకపోవడం వల్ల నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి సమాజంలో శాంతిభద్రతలు నెలకొంటాయి. భారత దేశంలో విస్తృతమైన అసంఘటిత రంగాన్ని మరింత బాగా అర్థం చేసుకునేందుకు ఉపయోగపడడం మూడో ప్రయోజనం కాగా, చివరిది, అన్నింటికంటే ముఖ్యమైనది ప్రభుత్వ పథకాలను నీరుగారేలా చేస్తున్న అక్రమార్కుల ఆటకట్టించేందుకు నగదు రహిత లావాదేవీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నది నిర్వివాదం. నగదు రహిత కార్యకలాపాలతోపాటు అన్ని డిజిటల్ వ్యవహారాల్లోనూ దానికి సంబంధించిన ఏదో ఒకగుర్తు నమోదై ఉండి పోతుంది. ఫలితంగా పారదర్శకంగా వ్యవహారాలు నిర్వహించాలనుకునేవారు తప్పక నగదురహిత కార్యకలాపాల వైపే మొగ్గుతుంటారు. కాగితం అవసరం లేకుండానే బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు జరిగే నగదు బదిలీల వల్ల ఆర్థిక కార్యకలాపాలు పూర్తిపారదర్శకంగా ఉంటాయి. అంకెలను అనుసరించడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. డిజిటల్ వ్యవస్థను వినియోగించుకోవడంవల్ల ముఖ్యంగా పౌరసరఫరాల విభాగంలో అక్రమాలను నివారించవచ్చు. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారి కోసం పౌరసరఫరాల విభాగం వారు అందజేస్తున్న రాయితీలు పొందుతున్నవారిలో 27% మంది మాత్రమే అర్హులని ప్రణాళిక సంఘం 2009లో చేపట్టిన సర్వే వెల్లడించింది. ఆర్థిక రంగంలో అన్ని వ్యవహారాలను సంఖ్యాబద్ధం చేయడమే నగదు రహిత విధానాన్ని అమలు చేయడానికి సరైన మార్గం. నగదు బదిలీకి ఎలక్ట్రానిక్

**సమీరా సౌరభ్,** డైరెక్టర్ (ప్లాన్ & పాలసీ), కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, న్యూ ఢిల్లీ.
E-mail: sameera.saurabh@gamil.com

పరికరాలను వినియోగించడం, అందుకు తగిన ప్రాథమిక వనరులను సమకూర్చు కోవడం, వాటిని తగిన విధంగా అభివృద్ధి చేయడం, వాటి వినియోగంపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పెద్దనోట్ల రద్దు వ్యవహారం కూడా నగదురహిత సమాజానికి దారితీసే అంశంగానే భావించవలసి ఉంది. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్నదేశాల్లో భారత దేశం ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నది. భారత దేశ జనాభాలో సుమారు 68.84 శాతం వ్యవసాయా ధారితమైన గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుండగా ఇందులో వ్యవసాయ రంగంపై ఆధారపడిన 80 శాతం జనాభా వాటా స్థూల జాతీయోత్పత్తి 20 శాతం మాత్రమే ఉన్నట్టు అంచనా. దేశజనాభాలో రెండింట మూడు వంతులు అంటే సుమారు 870 మిలియన్ల (లేదా 87 కోట్ల) మంది గ్రామీణప్రాంతాల్లోనే ఉండడం వల్ల వీరందరినీ నగదు రహిత కార్యకలాపాల వైపు మళ్ళించడమన్నది ఈ దశాబ్దంలోనే బృహత్తరమైన సవాలుగా చెప్పుకోవచ్చు. అయితే 2020 నాటికి ఇంటర్నెట్ వినియోగదారుల్లో సుమారు 50 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటారన్న అంచనా ఆశాజనకంగా కనిపిస్తోంది. ఇంటర్నెట్ వినియోగిస్తున్న వారి సంఖ్య 2015 నాటికి 120 మిలియన్లు కాగా ఇది 2020 నాటికి 315 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. **ప్రస్తుతం 18 నుంచి 50 ఏళ్ల వయసుగల వారిలో 30 శాతం మంది ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగించుకో గలుగుతున్నారు.** అయితే గ్రామీణ ప్రాంతాల్లోనే నగదురహిత కార్యక్రమాల అభివృద్ధికి విస్తృతావకాశా లున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని 93 శాతం మంది ఇప్పటివరకు ఒక్కసారికూడా డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించపోవడం వల్ల అక్కడే అభివృద్ధి అవకాశాలు మెరుగుగా ఉంటాయి. పేద ప్రజల కోసం "శూన్య నిల్వ ఖాతాలు'' తెరిచే అవకాశం ఉండాలని ప్రభుత్వం ఆశించినప్పటికీ వాటిపై రుణాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనం నామమాత్రమే కావడం బ్యాంకులను నిరాశ పరచింది. అంతే గాకుండా రుణాల పంపిణీకి తగినన్ని బ్యాంకు శాఖలు లేకపోవడం వల్ల కొత్త శాఖల ఏర్పాటును వేగవంతం చేయవలసి వచ్చింది. 2001 నాటికి భారత దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో లక్షమందికి 5.3 శాఖలు పనిచేస్తుండగా ఇప్పుడు సుమారు 7.8 కి పెరిగినట్టు రిజర్వు బ్యాంకు నివేదిక వెల్లడిస్తోంది.

**పరోక్ష ప్రయోజనాలు :**

భారత దేశంలో నగదురహిత కార్యకలాపాల వల్ల విలక్షణమైన మూడు ముఖ్యమైన పరోక్ష ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఇవి (ఎ) ఆర్థికపరిధిని నిర్ధారించడం, (బి) ఆర్థికాంశాలను నమోదు చేయడం, (సి) ఇద్దరికంటే ఎక్కువ మందికి సంబంధించిన కార్యకలాపాలను సమ్మిళితం చేయడం వల్ల వాటి నిర్వహణ ఖర్చు తగ్గే అవకాశం ఉండటం.

చివర పేర్కొన్న అంశం అన్ని ఆర్థిక వ్యవస్థల విషయంలో సాధారణంగా కనిపించేదే అయినప్పటికీ మొదటి రెండు అంశాలు ప్రత్యేకంగా భారత దేశానికే వర్తిస్తాయి. **భారత దేశంలో సగం జనాభా ఆర్థికాంశాల లెక్కల పరిధిలోకి రావడం లేదని 2009లో గంగోపాధ్యాయ నివేదిక పేర్కొంది.** లక్షమందికి 7.8 బ్యాంకు శాఖలు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నప్పటికీ వీటిలో కనీసం మూడు బ్యాంకులు వంద చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి ఒకటిగా ఉంటున్నా యన్నది వాస్తవం. గ్రామీణుల్లో 45 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 28శాతం మంది, మొత్తం మీద గృహస్థులలో 38శాతం మంది తమకు మరో దిక్కు లేకపోవడం వల్ల ఉన్న బ్యాంకు సేవలనే వినియోగించు కోవలసి వస్తోందని వాపోతున్నారు. దేశంలోని ప్రతి ఇల్లు, ప్రతి కుటుంబం దేశ ఆర్థిక గణన పరిధిలోకి రావాలంటే వారికి బ్యాంకు అందుబాటులో ఉండడంతో లేక వారికి బ్యాంకు ఖాతా ఉంటేనో సరిపోదు. దేశంలోని కార్మికులలో 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉండగా వారికి బ్యాంకు అందుబాటులో ఉంటే చాలన్నది అర్థరహితం. వారి రోజువారీ వేతనాలతో పోలిస్తే బ్యాంకు ఏర్పాటువల్ల మరింత ప్రయోజనం చేకూరాల్సిఉంటుంది.

ఉపాధికల్పనకు ప్రాథమిక రంగమైన వ్యవసాయంలో నగదు చెల్లింపులు కీలకం కావడంవల్ల నగదు రహిత కార్యకలాపాలను విస్తరించేందుకు వ్యవసాయరంగంలోనే కీలకమైన చర్యలు చేపట్టాల్సిఉంది. ఇందువల్ల వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్నవారంతా ఆర్థిక గణన పరిధిలోకి రాగలుగుతారు. డెబిట్ / క్రెడిట్ కార్డుల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేవారికోసం సర్వీస్ చార్జీలతో సహా ఇతర పన్నులను ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. ప్రభుత్వం కొన్నేళ్లుగా వ్యవసాయ కార్మికులకు ఈచెల్లింపులు, నగదురహిత చెల్లింపులు, ప్లాస్టిక్ కార్డుల ద్వారా కార్యకలాపాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించింది. వాస్తవానికి ఇదే భవిష్యత్తులో భారత దేశపు ఆర్థిక ముఖచిత్రమవుతుంది. అయితే పూర్తిగా నగదు చెల్లింపులపైనే ఆధారపడిన గ్రామీణ ప్రాంతాలు ఒక్కసారిగా పూర్తిగా నగదురహిత కార్యకలాపాలకు సిద్ధం కాగలవా అన్నది ప్రశ్నార్థకంగానే ఉండిపోయింది. రద్దయిన కార్డులు, పునరుద్ధరణకు వచ్చిన కార్డులు కాకుండా 2016 జులై నాటికి 697.2 మిలియన్ల డెబిట్ కార్డులు, 25.9 మిలియన్ల

క్రెడిట్ కార్డులు జారీ అయినట్టు రిజర్వు బ్యాంకు లెక్కలు చెబుతున్నాయి. అయితే కార్డుల సంఖ్యను బట్టి మనుషులను లెక్కించలేం ఎందుకంటె పట్టణప్రాంతాల్లో చాలామంది రెండుకంటే ఎక్కువ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ అలవాటు విస్తరిస్తున్నది. ఈ కార్డులను ముఖ్యంగా మూడు ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. ఎటిఎంల నుంచి సొమ్ము తీసుకునేందుకు, ఆన్‌లైన్ చెల్లింపులకు, ఏదైనా దుకాణాలు, హోటళ్లు, ఇంధన సరఫరా కేంద్రాల వద్ద కొనుగోళ్లు చేసినప్పుడు వీటిని వాడుతున్నారు. అయితే **భారతదేశంలో 26శాతం భూభాగంలోనే ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండగా 200 మిల్లియన్ల (20 కోట్ల మంది) మాత్రమే సాంకేతిక చెల్లింపు సేవలను వినియోగించుకుంటున్నారు. అలాగే దేశంలోని మొత్తం ఎటిఎంల సంఖ్యలో 18 శాతం మాత్రమే గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి.** చాలా రాష్ట్రాల్లో గ్రామీణులు, మహిళలే ఆర్థిక గణన పరిధిలోకి రాలేకపోతున్నారని ఇటీవల రిజర్వ్ బ్యాంక్ పరిశీలనలో వెల్లడైంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సహకారంతో గూగుల్ ఇండియా నిర్వహించిన సర్వే ప్రకారం ఇప్పటికీ భారత దేశంలో 75 శాతం ఆర్థిక కార్యకలాపాలు నగదు రూపంలోనే జరుగుతుండగా అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో నగదు వ్యవహారాలు 20 నుంచి 25 శాతంలోపే నగదు రూపంలో ఉంటున్నాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత మొబైల్, ఈ-వ్యాలెట్ కంపెనీల ద్వారా జరిగిన వ్యాపారం నాలుగు రెట్లు పెరిగింది.

దేశంలో చాలావరకు చిల్లర వ్యాపారమే జరుగుతుండగా అందుకు తగినన్ని పాయింట్ అఫ్ సేల్స్ (పిఓఎస్) యంత్రాలు అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ కోట్లాదిమందికి బ్యాంకు ఖాతాలు లేకపోవడం, పాయింట్ అఫ్ సేల్ యంత్రాలు అందుబాటులోకి రాకపోవడం, ఇంటర్నెట్ లేదా ఇతర చెల్లింపు సేవలకు తగిన వసతులు అందుబాటులోకి రాకపోవడం వల్ల వాటిని అర్థం చేసుకుని వినియోగించే సామర్థ్యం కొరవడుతోంది. అందువల్ల చిన్నపట్టణాల్లోను, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున పోస్ యంత్రాలు అందించే సాంకేతిక చెల్లింపులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది. గత జులై నాటికి ఎటిఎంల వద్ద, పోస్ యంత్రాల సహాయంతోను డెబిట్ కార్డులను వినియోగించుకునీ, 881మిలియన్ డిజిటల్ చెల్లింపులు జరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 92 శాతం ఎటిఎంల ద్వారా నగదు తీసుకున్న కార్యకలాపాలేనని తేలడంతో భారత దేశంలో నగదు తీసుకోవడానికే కార్డులు వినియోగపడుతున్నట్టు స్పష్టమవుతోంది. డిజిటల్ ఇండియా పథకంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించలేకపోవడం కూడా నగదురహిత కార్యకలాపాల నిర్వహణకు పెద్ద ఆటంకంగా పరిణమించింది. పోస్ యంత్రాలు పనిచేయాలంటే గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు మరింత విస్తరించవలసి ఉంటుంది. కార్డు ఆధారిత సేవల వినియోగంపై బ్యాంకులు కొంత సొమ్ము వసూలు చేస్తుండడం కూడా నగదు రహిత చెల్లింపులకు ఆటంకంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండడం, ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల సాధారణమైన సాంకేతిక కార్యకలాపాల నిర్వహణ కష్టతరంగా ఉంది.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో నగదురహిత కార్యకలాపాలకు ఎదురవుతున్న సవాళ్లు:

దేశంలో నగదు సరఫరా హెచ్చుగా ఉండడం వల్ల నగదు కార్యకలాపాలు ఎక్కువగా ఉంటున్నాయి. స్థూల జాతీయ ఉత్పత్తిలో 13 శాతం నగదు వ్యవహారాలే కావడం చెప్పుకోదగ్గ అంశం.

### ఆర్థిక వ్యవహారాల్లో నగదు కార్యకలాపాల ఆధిక్యత:

ఆర్థిక కార్యకలాపాల్లో దాదాపు 95 శాతం నగదు రూపంలోనే ఉంటున్నాయి. ప్రాథమిక రంగంగా ఉన్న వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమల్లో వేళ్లూనుకున్న అసంఘటిత కార్మిక వ్యవస్థలో చాలామందికి సాంకేతిక అక్షరాస్యత లేకపోవడం వల్ల నగదు కార్యకలాపాలకు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది.

### నగదు తీసుకోవడానికే తప్ప ఇతర చెల్లింపులకు ఏటీఎంలను వినియోగించడం లేదు:

**సుమారు 21 కోట్ల మేరకు ఉన్న రూపే కార్డులతో సహా అన్ని కార్డుల్లో 92 శాతం వరకు కేవలం ఎటిఎంల నుంచి నగదు తీసుకోవడానికే వినియోగపడుతున్నాయి.** అధిక సంఖ్యలో కార్డులు పట్టణ ప్రాంతాల్లోనే ఉండడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వాటి వినియోగం తక్కువగా ఉన్నట్టు తేలింది.

### పోస్ యంత్రాలు అందుబాటులో లేకపోవడం :

ఆర్బీఐ లెక్కల ప్రకారం 2016 జులై నాటికి దేశంలోని అన్ని ప్రాంతాల్లో కలిపి వివిధ బ్యాంకుల నుంచి నెలకొల్పిన పోస్ యంత్రాల సంఖ్యా కేవలం 1.44 మిలియన్లు మాత్రమే కాగా వీటిలో చాలావరకు నగరాలూ, పెద్ద పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యాయి.

### మొబైల్ ఇంటర్నెట్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించకపోవడం :

నగదు రహితమైన సాంకేతిక చెల్లింపులు జరగాలంటే గ్రామీణ

ప్రాంతాలకు మొబైల్ ఇంటర్నెట్ సేవలను మరింత విస్తరించవలసి ఉంటుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్షన్ చాలా బలహీనంగా ఉంది. అంతేగాకుండా అక్షరాస్యత తక్కువగా ఉండడం వల్ల కూడా గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ మనీ వినియోగాన్ని విస్తరించడానికి ఆటంకంగా నిలుస్తోంది. అయితే ఈ అవరోధాన్ని అధిగమించేందుకు నరేంద్ర మోడీ ఇటీవలే "భారత్ ఇంటర్ఫేస్ ఫర్ మనీ" (BHIM) పేరుతో ఇంటర్నెట్ అవసరం లేని వినూత్నమైన ఒక USSD మొబైల్ అప్లికేషన్ ను ప్రారంభించారు

ప్రైవేట్ బ్యాంకులు ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాలకు కూడా క్రమంగా విస్తరిస్తున్నట్టు 2014 ఆర్థిక సంవత్సర నివేదిక వెల్లడిస్తోంది. వీటి కొత్త శాఖల్లో సగటున 50 నుంచి 65 శాతం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల వైపే వరుగులు తీస్తున్నాయి. ప్రైవేట్ రుణదాతల్లో పెద్ద బ్యాంకులైన ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, హెచ్ డీఎఫ్ సీ, ఎస్ బ్యాంకులు గత ఐదేళ్లలో ఇప్పటివరకు బ్యాంకింగ్ సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాల్లోనే నెలకొల్పాయి. అలాగే 2013 నుంచి 2016 మధ్య మూడేళ్ళ కాలవరిమితిలో ఇప్పటివరకు బ్యాంకింగ్ సౌకర్యంలేని గ్రామీణ ప్రాంతాలలో (టయర్-ఫైవ్ అండ్ సిక్స్) కొత్త శాఖలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రిజర్వు బ్యాంకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు తమ శాఖల్లో కనీసం 25 శాతం వరకు కొత్త శాఖలను ఇప్పటివరకు బ్యాంకింగ్ సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. అంతేకాకుండా కొత్తశాఖలలో 25 శాతం కంటే ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పే బ్యాంకులకు అదనపు రుణం మంజూరుచేస్తామని కేంద్రీయ బ్యాంకు ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతాల్లో తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ బ్యాంకులు కూడా ముందుకొస్తున్నాయి.

### గ్రామీణ ప్రాంతాల్లో వివిధ బ్యాంకుల శాఖల విస్తరణ

తున్నాయని 2014 ఆర్థిక సంవత్సర నివేదిక స్పష్టం చేస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా ఏర్పాటు చేసిన 1053 శాఖల్లో 57 శాతం చిన్నపట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో శాఖలు ఏర్పాటు చేయడంతో అద్దెల భారం

| | ఐసీఐసీఐ బ్యాంకు | హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంకు | యాక్సిస్ బ్యాంకు |
|---|---|---|---|
| **మొత్తం బ్యాంకు శాఖలు** | **3753** | **3062** | **2402** |
| బ్యాంకింగ్ సౌకర్యం లేని ప్రాంతాల్లో నెలకొల్పిన శాఖలు | 448 | 318 | 438 |
| శాఖల శాతం | 11.9 | 10.4 | 18.2 |
| 2014లోమొత్తంశాఖలు | 653 | 341 | 455 |
| బ్యాంకులు లేని ప్రాంతాల్లో 2014లో ప్రారంభించినవి | 317 | 230 | 298 |
| మొత్తం శాఖల శాతం | 48.5 | 67.4 | 65.5 |
| గ్రామీణ శాఖల సంఖ్య | 841 | 674 | 576 |
| బ్యాంకులు లేని ప్రాంతాల్లో ప్రారంభించిన శాఖల శాతం | 53.3 | 47.2 | 76 |

ప్రస్తుతం బ్యాంకుల శాఖల విస్తరణ వేగం చిన్నపట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నది. అంతేగాకుండా అన్నిశాఖల్లోనూ ఒకే కౌంటర్ వద్ద అన్ని సేవలు లభించేలా చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరించడం వల్ల మొబైల్ వ్యాన్‌పై ఉండే "బ్రాంచ్ ఆన్ వీల్స్'' ద్వారా కొన్ని గ్రామాల సముదాయాలకు బ్యాంకింగ్ సేవలను విస్తరించే అవకాశం కలగడంతో మరింత మంది ఆర్థిక గణన పరిధిలోకి రాగలుగుతున్నారు. ఒక బ్యాంకు శాఖ నిర్వహణకు టయర్ వన్ నగరాల్లో సగటు వ్యయం తొమ్మిది లక్షల రూపాయలు కాగా గ్రామీణ శాఖల నిర్వహణ భారం నాలుగు లక్షల రూపాయలకు పైనే ఉంటోంది. ఇక గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే క్రమంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు వెనుకబడు తక్కువైనప్పటికీ సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ వ్యయాలు అధికంగా ఉంటున్నాయి. అయితినప్పటికీ అన్ని బ్యాంకులు తమ కొత్త శాఖల్లో 25 శాతం శాఖలను ఇప్పటివరకు బ్యాంకింగ్ సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాల్లోనే నెలకొల్పాలని ఆదేశించడం వల్ల అన్ని బ్యాంకులు ఇపుడు గ్రామీణ ప్రాంతాలలో తమ శాఖలు ఏర్పాటు చేసుకుంటున్నాయి.

### భవిష్యత్ - గమ్యం

చెలామణిలో ఉన్న నగదులో పెద్ద నోట్ల రూపంలో ఉన్న 86 శాతం సొమ్ము విలువ రద్దవడంతో ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా 130 కోట్ల మంది ప్రజలు తమ వద్దనున్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో జమ చేసేందుకు తాత్కాలికంగా అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ప్రత్యక్ష పరోక్ష పన్నుల పరిధిలోకి రాని

వ్యవసాయరంగంలో చెక్కుల రూపంలో చెల్లించే అవకాశం లేకపోగా నగదు లావాదేవీలే ఎక్కువకావడంవల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వాస్తవ ఇబ్బందులను, నష్టాలను ఇప్పటికిప్పుడే అంచనావేయడం అత్యంత కఠినమైన సమస్యగానే మారింది. ఉదాహరణకు, వ్యవసాయదారులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినప్పటికీ 1988లో తొలిసారి వారికి కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయగా ప్రస్తుత ప్రభుత్వం వీటిని మరింత విస్తృత పరచింది. కానీ దీనివల్ల దళారులు లబ్ది పొందుతూ రైతులు, కూలీలకు కొద్దిసొమ్ము ముట్టజెప్పి తక్కినదంతా తమ జేబుల్లో కుక్కుకుంటున్నారు. జనధన్ ఆధార్ మొబైల్ (జేఏఎం) ద్వారా నగదు రహిత కార్యకలాపాల నిర్వహణ విస్తృతమవుతున్నది. దేశవ్యాప్తంగా 2009లో ప్రారంభించిన ఆధార్ కార్డుల పంపిణీ ప్రాజెక్ట్ ఏడేళ్లలో పూర్తికావలసి ఉండగా ఇప్పటికే 88 శాతం మంది ప్రజలు (అంటే సుమారు 107 కోట్లమంది) తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. దీంతో ప్రభుత్వం కల్పించే రాయితీల తాలూకు సొమ్మును నేరుగా వినియోగదారుడికి అందజేసే కార్యక్రమం ఊపందుకోవడం వల్ల ప్రజలకు డిజిటల్ కార్యకలాపాలపై అవగాహన కలుగుతోంది.

## నగదురహిత ఆర్థికవ్యవస్థకు నేరుగా ప్రభుత్వ కృషి :

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొనేందుకు పలు కీలకమైన అవకాశాలను సమన్వయ పరచే అనేక వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని కీలకమైన శాఖల్లో నిర్దేశిత పరిమితికి మించిన చెల్లింపులను కచ్చితంగా నగదురహితంగానే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం ద్వారా నగదురహిత కార్యకలాపాల విస్తరణకు బాటవేసింది. ఉదాహరణకు పాస్ పోర్ట్ కు సంబంధించిన చెల్లింపులను ఆన్ లైన్ లోగాని లేదా బ్యాంక్ డ్రాఫ్టుల రూపంలో కానీ చెల్లించాలన్న ఆదేశం ద్వారా ఆ శాఖలో నగదురహిత కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఆదాయపన్ను, అమ్మకం పన్ను, ఎక్సయిజ్ సుంకాల చెల్లింపు వగైరా అనేక చెల్లింపులు నగదురహితంగానే జరగుతున్నాయి. దీనికి తోడు గృహస్థులు తమ ఇళ్లలో పనిచేసే అసంఘటిత కార్మికులకు నగదు రహిత చెల్లింపులు చేస్తే వాటిపై ఒకే నుంచి రెండు శాతం వరకు పన్నురాయితీ కల్పించడంవల్ల నగదురహిత కార్యకలాపాలు జోరందుకున్నాయి. దీనివల్ల గృహస్థులకు పన్నురాయితీ లభించడమే గాకుండ అసంఘటిత రంగంలో ఉన్న అనేకమంది కార్మికులు ఆర్థిక గణన పరిధిలోకి వచ్చే అవకాశం లభిస్తుంది. అంతేగాక ప్రభుత్వ రాయితీలతోబాటు ప్రభుత్వమే నేరుగా చెల్లింపులు చేయవలసివచ్చినప్పుడు కూడా ఆ సొమ్మును నగదురహితంగా చేస్తున్నది.

## నగదురహిత కార్యక్రమాల విస్తరణలో ప్రభుత్వ పాత్ర :

కొన్ని అంశాల్లో నగదు రహిత కార్యకలాపాల విస్తరణ వల్ల రెండు వర్గాలవారికీ ఆమోదయోగ్యం కానంత హెచ్చు సొమ్ము ఖర్చవుతుంటే అలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. కానీ ఖర్చు తగ్గించినా నగదురహిత కార్యక్రం సాఫీగా సాగుతుందా లేదా అనే అంశాన్ని లోతుగా పరిశీలించవలసిఉంటుంది. ఈ సందర్భంగా నగదు రహిత కార్యకలాపాల విస్తరణలో లభ్యత, సౌలభ్యత, ఆమోదయోగ్యత, భరించగలిగే శక్తి, అవగాహన అనే అయిదు అంశాలకు ప్రాధాన్యత లభిస్తుంది.

నగదురహిత కార్యకలాపాల విస్తరణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీలు, ఇతర సంస్థల ద్వారా నగదురహిత లేదా బ్యాంకింగ్ కార్యకలాపాల అవసరం, అవకాశాలు, లాభాలపై ప్రజలలో అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అందరిలోనూ ఆర్థిక అంశాలపై తగిన అవగాహన కల్పించేందుకు ప్రజావేదికలు ఏర్పాటు చేసి డిజిటల్ అక్షరాస్యత పెంచేందుకు ప్రయత్నిస్తోంది. నగదురహిత చెల్లింపుల కోసం బ్యాంకుల ద్వారా చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. సంక్షేమ పథకాలన్నింటికీ చెల్లింపులు బ్యాంకుల ద్వారా మాత్రమే జరిగేలా చూడాలి. నగదురహిత కార్యకలాపాల విస్తరణకు కూడా బలీయమైన బ్యాంకింగ్ వ్యవస్థే పునాది అన్న సత్యాన్ని గుర్తించాలి. మనముందు చక్కటి మార్గం ఉన్నది. నగదురహిత, ఎలక్ట్రానిక్ చెల్లింపులను విస్తృత స్థాయిలో అమలు పరిచేందుకు తాత్కాలిక, మధ్యంతర, దీర్ఘకాలిక లక్ష్యాలతో దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యతకు విస్తృత ప్రచారం జరుగుతున్నది. నిర్ణీత లక్ష్యాలతో సాగుతున్న ఈ ప్రచారం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రతిఒక్కరిలోను సొంత ఖాతాలకు సంబంధించిన అన్ని ఆర్థిక వ్యవహారాల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందన్న విశ్వాసం బలపడుతున్నది. ■

**మనవి**

**కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తమ సూచనలను mygov.in వెబ్‌సైట్ ద్వారా పంపవచ్చు లేదా 1800 117 800 (టోల్ ఫ్రీ) నెంబరుకు తెలియచేయవచ్చు.**

# నగదు నియంత్రణ ద్వారా నల్లధనం, అవినీతిపై యుద్ధం




**డిజిటల్ లావాదేవీల భవిష్యత్తు ఆశాజనకంగా ఉన్నది. జమలు, చెల్లింపులకోసం పి.ఓ.ఎస్. యంత్రాలను వాడుతున్నారు. వీటిపై కస్టమ్స్ ఛార్జీలేమీ లేవు. కేంద్రం వీటిని ఎక్సైజు డ్యూటి నుండి కూడ మినహాయించింది. అదే సమయంలో ఇలాంటి యంత్రాల తయారీకి, దేశీయ ఉత్పత్తి దారులకు అవసరమైన అన్ని ఉపకరణాలపై అన్నిరకాల సుంకాలను మినహాయించారు. మార్చి 31, 2017 వరకు ఈ మినహాయింపులు వర్తిస్తాయి.**

నల్లధనం, అవినీతి, నకిలీ కరెన్సీ, ఉగ్రవాదం వంటి అనేక సామాజిక రుగ్మతలకు ఒకే మందుగా నవంబర్ 08, 2016న మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ. 500/-, 1000/-ల నోట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ఆయుధాల అక్రమ రవాణా, ఉగ్రవాదానికి చేయూత, మాదకద్రవ్యాల వ్యాపారం వంటి సామాజిక రుగ్మతలకెన్నింటికో చెంప పెట్టులాంటిది. నూతన ఐదు వందల రూపాయల నోట్లు, రెండు వేల రూపాయల నోట్ల ముద్రణకు, భారతీయ రిజర్వు బ్యాంకు వారి సూచనను కూడ ఆమోదించింది. ఇతర చిన్ననోట్లపై ఎలాంటి ప్రభావం లేదు. అదేవిధంగా, నగదు రహిత లావాదేవీలపై కూడ ఎటువంటి ఆంక్షలు లేవు. నిజాయతీగా డబ్బు సంపాదించు కున్నవారికి ఈ నిర్ణయంవల్ల ఎటువంటి సమస్యా ఉండదని కూడ ప్రధాని తన ప్రసంగంలో చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల సామాన్యుడికీ, నిజాయితీ పరుడికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని, అవినీతిపైన, నకిలీ నోట్లపైన, నల్లధనంపైన చేసేపోరాటంలో సామాన్యుడికి మద్దతిస్తానని కూడ మోదీ చెప్పారు. ఈ స్థితిలో సామాన్యుడి కెదురవుతున్న సమస్యలవట్ల పూర్తి అవగాహనతో ఆయన అనేక పరిష్కార చర్యలను కూడ ప్రకటించారు. బ్యాంకుల వద్ద, ఏటిఎమ్‌ల వద్ద కొండవీటి చాంతాడంతటి క్యూలను తప్పించడానికి తీసుకున్నచర్యలలో, వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు, తమ నల్లధనాన్ని తెలుపుచేసుకోడానికి అమాయక పేదలను ఎరలుగా చేసుకుంటున్న వారిపై ప్రత్యేక చర్యలు, వంటివి వీటిలో కొన్ని. అలాగే, వ్యవసాయ దారులకు వారి అవసరాలకు తగినట్లు ప్రత్యేక ఏర్పాట్లతో అదనపు మొత్తాలను డ్రా చేసుకునే వెసులుబాటు, చిన్న వ్యాపారస్తులకు, కరెంటు ఖాతాల ద్వారా రూ. 50,000/- ల వరకూ డ్రా చేసుకునే వెసులుబాటు వంటివి కూడ ఈకోవకే చెందుతాయి. అంతేకాదు, ప్రధాని తన ప్రసంగంలో, చలామణీలో ఉన్న నగదుకు నల్లధనం లేదా దొంగనోట్లు చేరితే అది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఎలా నష్టం చేస్తుందో కూడ విశద పరిచారు. అయితే, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ఇది మొదటిది కాదు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, మే, 2014లో నల్లధనంపై ప్రత్యేక దర్యాప్తు

**డి.ఎస్. మాలిక్,** అదనపు డైరెక్టర్ జనరల్, పత్రికా సమాచార కార్యలయం (పి.ఐ.బి.), న్యూ ఢిల్లీ.
E-mail: dprfinance@gmail.com

బృందాన్ని (ఎస్.ఐ.టి.)ను ఏర్పాటు చేసింది. 2015లో విదేశీ బ్యాంకుల్లోని ఖాతాల వివరాలను రాబట్టేందుకు గత రెండున్నర సంవత్సరాలలో, అవినీతి, నల్లధనాలపై ప్రధాని పోరు అందరికీ తెలిసినదే! ఆగష్టు, 2016లో బినామి లావాదేవీలను అరికట్టడానికి ప్రత్యేక ఆదేశాలను జారీ చేశారు. అదేకాలంలో, నల్లధన స్వచ్ఛంధ వెల్లడి పథకాన్ని కూడ ప్రకటించారు. ఈపథకం కింద, రూ. 67వేల కోట్ల నగదు వెల్లడయింది. అన్నిచర్యల సత్ఫలితాలు ఇంతవరకూ రూ. 1.25 లక్షలకోట్ల నల్ల ధనాన్ని బహిరంగపరచాయి. అనేక అంతర్జాతీయ వేదికలపై కూడ ప్రధాని ఈ నల్లధనం ఏ ఆర్థికవ్యవస్థకైనా ఎంత హానిచేస్తుందో పదే పదే వివరించారు. ప్రస్తుతం మన దేశం అనేక అంతర్జాతీయ వాణిజ్య సంస్థలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. అనేక అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు మన ఆర్థిక వ్యవస్థపై తమ దృక్పధాన్ని ఆశావహంగా మార్చుకున్నాయి. వీటికితోడు, మన "భారత్‌లో తయారీ", అంకుర సంస్థలకు ప్రోత్సాహం వంటి చర్యలు మనదేశంలో పెట్టుబడులకూ, స్వయం ఉపాధి కార్యక్రమాలకూ ఊపు నిచ్చాయి. ఒకవైపు నల్ల ధనంపై యుద్ధం కొనసాగిస్తూనే, పునర్నగదీకరణకు, అంటే డిజిటల్ చెల్లింపులు, ఈ-బ్యాంకింగ్‌లకు ప్రత్యేక ప్రోత్సాహాన్నిచ్చింది.

ఈ చొరవను ఆధారంగా చేసుకుని, ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులకు అనేక నూతన విధానాలను, ప్రోత్సాహాలను ప్రకటించింది. ఐదువేల రూపాయలకు మించిన ప్రభుత్వ చెల్లింపులన్నింటినీ విధిగా డిజిటల్ విధానంలోనే చెల్లించాలని నిర్దేశించింది. అలాగే ఉద్యోగుల వేతనాలు, ఇతర చెల్లింపులను విధిగా ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నది. బ్యాంకుల సేవల విస్తరణ కారణంగా నేడు దాదాపు ఉద్యోగులందరూ డెబిట్/క్రెడిట్ కార్డులను కలిగి ఉన్నారు. కనుక, ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ, ఈ అవగాహనను పెంపొందించ డానికి కృషి చేయాలి. ఆర్థికవ్యవస్థ విస్తరిస్తున్నకొలదీ, నగదు ప్రమేయం క్రమంగా తగ్గాలనేది కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అభిప్రాయం. ఈ సూత్రానికనుగుణంగా ఇప్పటికే అనేక బ్యాంకులు తమతమ డిజిటల్ పథకాల ప్రకటనలను మొదలె ట్టాయి. లావాదేవీల ఫీజును డిసెంబర్ 31, 2016 వరకు రద్దుచేశాయి. ఎన్.ఈ.ఎఫ్.టి, మొబైల్ వాలెట్, ప్రీ పెయిడ్ కార్డులు, క్యు.ఆర్. కోడ్‌లు, యు.పి.ఐ వంటి ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ మార్గాలను ప్రారంభించాయి. కేవలం పట్టణ ప్రాంతాలలోనే కాక, గ్రామీణ ప్రాంతాలలో కూడ తమ ఈ ఆధునిక సేవలను విస్తరించడం ప్రారంభించాయి. దీనికి మద్దతుగా వివిధ బ్యాంకుల ప్రకటనలు నిలుస్తాయి. ఈ విధంగా తీసుకుంటున్న చర్యలన్నింటి ఫలితంగా డిజిటల్ లావాదేవీల భవిష్యత్తు ఆశాజనకంగా ఉన్నది. జమలు, చెల్లింపులకోసం పి.ఓ.ఎస్. యంత్రాలను వాడుతున్నారు. వీటిపై కస్టమ్స్ చార్జీలేమీ లేవు. కేంద్రం వీటిని ఎక్సైజు డ్యూటి నుండి కూడ మినహాయించింది. అదే సమయంలో ఇలాంటి యంత్రాల తయారీకి, దేశీయ ఉత్పత్తి దారులకు అవసరమైన అన్ని ఉపకరణాలపై అన్నిరకాల సుంకాలను మినహాయించారు. మార్చి 31, 2017 వరకు ఈ మినహాయింపులు వర్తిస్తాయి. అదేవిధంగా మార్చి 31, 2017 వరకు మరో పదిలక్షల పి.ఓ.ఎస్. టెర్మినళ్ళను ఏర్పాటుచేయాలని కూడ నిర్ణయించారు. అదేవిధంగా, అసంఘటితరంగ కార్మికులకు బ్యాంకు ఖాతాలను తెరిపించడానికి కేంద్ర కార్మికమంత్రిత్వశాఖ సహకారంతో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేశారు. మొత్తం 2,73,919 శిబిరాలను నిర్వహించి, 24.54 లక్షల ఖాతాలను తెరిచారు. జన్‌ధన్ ఖాతాలతో సహా మొత్తం 30 కోట్లమందికి రూపే కార్డులను జారీ చేశారు. 12 రోజుల్లో రూపే కార్డులు 300 శాతం అధికంగా జారీ అయినాయి. డెబిట్ కార్డుల వినియోగాన్ని మరింత పెంచడానికి, లావాదేవీల ఛార్జీలను కూడ రద్దుచేశారు. అదే విధంగా, ఈ-వ్యాలెట్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడానికి, ప్రభుత్వం వ్యక్తులు బ్యాంకు నుండి తీసుకునే మొత్తాలపై పరిమితి విధించింది. రైల్వేవారు కూడ అనేక చర్యలను తీసుకున్నారు. ట్రాయ్ వారు USSD (UNSTRUCTURED SUPPLE-MENTARY DATA)చార్జిలను ప్రస్తుతమున్న రూ. 1.50ల నుండి, 0.50 పైసలకు తగ్గించి, శ్లాబులను కూడ ఐదు నుండి, ఎనిమిదికి పెంచారు.

ఇంతవరకూ, చెక్‌పోస్టులు, టోల్ ప్లాజాల వద్ద ఎక్కువ కాలహరణం అయ్యేది. చెక్‌పోస్టుల సమస్యలను కొంతవరకు జి.ఎస్.టి. పరిష్కరిస్తుంది. జాతీయ రహదారులలో చెక్ పోస్టుల వద్ద, చెల్లింపులకు కొన్ని సాంకేతిక సమస్య లున్నాయి. అందుకే, కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ అన్నినూతన వాహనాలకూ, ETC COMPLAINT, RFID లను ఏర్పాటు చేయమని కోరింది. అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థలు, తమ చెల్లింపులను తప్పనిసరిగా, అన్ లైన్ లోనే చేయమని ఆదేశించారు. ఇలాంటి అన్ని చర్యల ఫలితంగా, ప్రస్తుత ప్రభుత్వ పెద్దనోట్లరద్దు నిర్ణయం డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత విజయవంతం చేస్తుందని ఆశిద్దాం.

■

**మౌలిక సదుపాయాల కల్పన**

ప్రత్యేక వ్యాసం

# స్వల్ప నగదు, అంతర్జాతీయ అనుభవాలు - మన స్థితిగతులు



**తెలంగాణ రాష్ట్రంలోని ఇబ్రహీంపూర్ గ్రామం పూర్తిగా నగదు రహితంగా మారిపోయింది. అందరికీ బ్యాంకు అకౌంట్లు ఇవ్వడం, చెల్లింపులన్నీ నగదు రహితంగా ఉండడం, కార్డు వినియోగించడంతో రికార్డు సృష్టించింది. ఇతర గ్రామాలు కూడా ఈ విజయగాథ నుంచి ప్రేరణ పొంది నగదు రహిత గ్రామాలుగా మారే క్రమంలో ఉన్నాయి**

భారతీయ రిజర్వు బ్యాంకు జూన్, 2016న 'పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ ఇన్ ఇండియా: విజన్ 2018' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. అందులో భారత్‌లో చక్కటి చెల్లింపు లావాదేవీలున్న ఆర్థిక వ్యవస్థను రూపొందించడానికి ఎలాంటి విధివిధానాలను చేపట్టాలో సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలను ఎలక్ట్రానిక్ చెల్లింపుల ద్వారా అన్ని ఆర్థిక వ్యవహారాలను నడుపుకొనే లక్ష్యంగా తీసుకెళ్లడంతో పాటు అత్యధిక సంఖ్యలో ఉన్న అసంఘటిత వర్గాలను కూడా సంఘటిత ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి తీసుకొని రావడం ముఖ్యమైంది. తద్వారా పన్ను పరిధిని పెంచుకోవడం, నల్లధనాన్ని అరికట్టడంతో పాటు, ఉగ్రవాదానికి, ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టే నల్లధనాన్ని అడ్డుకట్ట వేయడం ప్రధాన లక్ష్యంగా ఉంది. సంపూర్ణ నగదు రహిత దేశంగా భారతీయ ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందడానికి తొలిదశగా స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి ఆశించారు. స్వీడన్, కెన్యా, బ్రెజిల్ వంటి దేశాలు తక్కువ నగదు చలామణి ఉన్న దేశాలుగా విజయవంతంగా ముందుకెళుతున్నాయి. ఆయా దేశాల అనుభవాలను పరిశీలిస్తే, తక్కువ నగదు ఉన్న ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకి సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించుకోవడానికి అవసరమైన నిబంధనలతో పాటు, శరవేగంగా మౌలిక సదుపాయల కల్పనతో పాటు వినియోగదారుడి కేంద్రంగా విధాన కల్పన జరగాలి.

## భారత్ ఇతర దేశాల మధ్య పోలిక

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో చలామణిలో ఉన్న నగదు అనేక అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాల కన్నా అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో, దేశ ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉన్న నగదు వాటా జాతీయ స్థూల ఉత్పత్తితో పోలిస్తే 12.3 శాతంగా ఉంటే బ్రెజిల్‌లో అది 3.8 శాతంగా, దక్షిణ కొరియాలో 5.6 శాతంగా, స్వీడన్‌లో 1.7 శాతంగా ఉంది.

దీంతోపాటు 2016లో 68 శాతం ఆర్థిక లావాదేవీలన్నీ నగదు రూపంలో జరిగినవే కావడం విశేషం. థాయ్‌లాండ్, బ్రెజిల్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నగదు వినియోగం భారత్‌తో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. భారత్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం కూడా చాలా అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలతో పోలిస్తే అతి

**డా॥ అర్పిత ముఖర్జీ,** ప్రొఫెసర్, ఐసిఆర్ఐఈఆర్, న్యూ ఢిల్లీ. E-mail: arpita@icrier.res.in
**తను ఎమ్ గోయల్,** కన్సల్టెంట్, ఐసిఆర్ఐఈఆర్, న్యూ ఢిల్లీ. E-mail: tgoyal@icrier.res.in

తక్కువగా ఉంది. దేశంలో అతి తక్కువ నగదు వినియోగ దేశంగా స్వీడన్ రికార్డు సృష్టించింది. ఆ దేశంలో అత్యధిక నగదు లావాదేవీలు ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటాయి. బస్ టికెట్లు, దాన ధర్మాలు కూడా డిజిటల్ రూపంలో ఉంటాయి. ఆ దేశంలోని వర్తకులు నోట్లు, నాణేల స్వీకరణను తిరస్కరించడానికి వారికి న్యాయపరమైన హక్కులుంటాయి. సగటు ఐరోపావాసి కన్నా స్వీడన్ దేశస్థుడు మూడు రెట్లు అధికంగా డెబిట్ కార్డు వినియోగిస్తాడు. యాధృచ్ఛికంగా స్వీడెన్ కూడా 2016లోనే 20, 50, 1000 క్రోనా నోట్లను రద్దు చేయగా, జూలై, 2017 నుంచి మరికొన్ని ముఖ విలువున్న నగదు కూడా చెల్లుబాటు కాదని ప్రకటించింది. ఇక ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కెన్యా తమ దేశంలో అన్ని ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించిన, అంటే కౌన్సిల్ పార్కింగ్, నిర్మాణ అనుమతులు, భూమి ధరలు, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, పాస్‌పోర్టు జారీ ఫీజులు తదితరాలన్నింటినీ ఆన్‌లైన్ చేయడంతో అవినీతికి ఆస్కారం లేకుండా పోవడంతో పాటు, రాబడులు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రపంచ బ్యాంకు గ్లోబల్ ఫైండెక్స్ నివేదిక ప్రకారం కెన్యాలోని 58 శాతం పెద్దవారు 2014 సంవత్సరంలో మొబైల్ మనీని చురుగ్గా వాడారు. ఇది ప్రపంచంలోనే అత్యధిక మొబైల్ వినియోగంగా గుర్తింపు పొందింది. 2015లో కెన్యాలోని 31 మిలియన్ మొబైల్ మనీ చందాదారులకు దాదాపు 1,44,000 మంది ఏజెంట్లు వెన్నుదన్నుగా నిలిచారని ఆ దేశ సెంట్రల్ బ్యాంకు వెల్లడించింది. తక్కువ క్రెడిట్ కార్డు వినియోగం, ఇంటర్నెట్ అనుసంధానం తక్కువగా ఉన్నప్పటికీ మొబైల్ మనీ, స్మార్ట్ ఫోన్ వినియోగం ద్వారా అత్యధిక ఆన్‌లైన్ చెల్లింపులు చేయొచ్చు అనడానికి కెన్యా చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది.

**అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| బ్రెజిల్ | 17,811 | 20,561 | 22,146 | 24,837 | 25,241 |
| చైనా | 3,592 | 5,270 | 7,814 | 11,650 | 16,602 |
| భారత్ | 550 | 695 | 865 | 889 | 1.080 |
| స్వీడన్ | 22,167 | 20,837 | 20,380 | 20,304 | 18,660 |
| ఇంగ్లండ్ | 21,499 | 25,732 | 25,800 | 26,346 | 30,078 |

పట్టిక1: 2011-2015 మధ్య కాలంలో ప్రతి పది లక్షలమందికి ఎంపిక చేసిన దేశాల్లో అందుబాటులో ఉన్న పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లు (పీఓఎస్)

ఎలక్ట్రానిక్ రూపంలో చెల్లింపులను అంగీకరించడంతో పాటు, ఈ చెల్లింపు విధానాలను సమాజంలో లోలోపలికి చొచ్చుకొనిపోవడం ఎంతో ముఖ్యమైంది. భారత్‌లో, ఉదాహరణకి, 2015లో, కేవలం సగమంది జనాభాకి మాత్రమే కార్డు అందుబాటులో ఉంది. అదే స్వీడన్‌తో పోలిస్తే, అక్కడ ప్రతి ఒక్కరికీ సగటున 2.5 కార్డులుంటే, దక్షిణ కొరియాలో అది 5.5గానూ, బ్రెజిల్‌లో 4.1గానూ, చైనాలో నాలుగుగానూ ఉంది.

మిగిలిన దేశాలతో పోలిస్తే దక్షిణ కొరియాలో అతి ఎక్కువగా కార్డుల వినియోగం ఉన్నట్లు తెలియడంతో పాటు అక్కడి ఆర్థిక వ్యవస్థ శరవేగంగా నగదు రహిత సమాజం వైపుగా ప్రయాణం చేస్తోంది. కార్డు ద్వారా చెల్లింపు చేసిన వారికి అదనపు పన్ను రాయితీ కల్పించడం వంటి ప్రోత్సాహాలను ప్లాస్టిక్ మనీ వినియోగం పెంచేందుకు అందిస్తోంది. భారత్‌లో, నగదు చెల్లింపు చేసేవారిని కార్డు ద్వారా లావాదేవీలు నిర్వహించేలా చేయడానికి బ్యాంక్ చార్జీలను తగ్గించడం జరుగుతోంది. దీంతోపాటు, భారత్‌లోని అత్యధిక జనాభాతో పోలిస్తే ఇక్కడ విక్రయ సేవా మిషన్లు (పీఓఎస్‌లు అనగా విక్రయ కేంద్రాల వద్ద డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల ద్వారా లావాదేవీలు నిర్వహించే యంత్రాలు) మిగిలిన అభివృద్ధి చెందుతున్న దేశాలైన బ్రెజిల్, చైనా వంటి దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి.

ఇక తక్కువ నగదు చలామణిలో ఉన్న దేశాల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణకు మొబైల్ ఆధారిత చెల్లింపులు, ఎలక్ట్రానిక్ నగదు చెల్లింపులు వంటి ఇతర పద్ధతులు అమల్లో ఉన్నాయి. భారత్‌లో, ఈ విధానాలను అమలు చేయడానికి ఉన్న సౌకర్యాలు పరిమితంగానే ఉన్నాయి. 120 కోట్ల మందికిపైగా జనాభా ఉన్న భారత్‌లో వైర్‌లెస్ ఫోన్ సదుపాయం ఉన్నవారి సంఖ్య 30, జూన్, 2016 నాటికి వంద కోట్లకు పైబడే ఉన్నట్లు తేలింది. అయినా కేవలం 0.05 శాతం మాత్రమే నగదేతర చెల్లింపులు మొబైల్ ఫోన్ల ద్వారా జరపగలిగే ఎలక్ట్రానిక్ మిషన్ లావాదేవీలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా ఇతర దేశాలతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ల వినియోగం, ఇంటర్నెట్ సౌలభ్యత భారత్‌లో తక్కువగా ఉండడమే. భారత్‌లో కేవలం 17 శాతం మంది పెద్దలకు మాత్రమే 2016లో స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉంటే అదే దక్షిణ కొరియాలో 88 శాతం మందికి కెన్యాలో 26 శాతం మందికి అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడు, 2015లో భారత్‌లో 26 శాతం మంది వ్యక్తులు ఇంటర్నెట్‌ను వాడుతుంటే, బ్రెజిల్‌లో ఆ సంఖ్య 59.08 శాతం, చైనాలో 50 శాతం, దక్షిణ కొరియా, స్వీడెన్‌లో దాదాపు 90 శాతం మందికి అందుబాటులో ఉంది. అదే విధంగా,

భారత్‌లో ప్రతి వందమందిలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్రాండ్ సదుపాయం కేవలం 1.34 శాతం మందికి మాత్రమే ఉంటే స్వీడన్‌లో 36.07 శాతం, కొరియాలో 40.25 శాతం మందికి ఈ సౌకర్యం ఉంది.

ఆ విధంగా, ప్రస్తుతం దేశంలో ఉన్న మౌలిక సదుపాయాలను ప్రత్యేకించి సాంకేతిక సౌకర్యాలను శరవేగంగా అభివృద్ధి చేయడం ద్వారా భారత ప్రభుత్వం లక్ష్యంగా తీసుకున్న నగదు రహిత సమాజ సాధన సాధ్యమవుతుంది. దీంతోపాటు, సరైన విధానాల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం కూడా ఉంది.

**అంతర్జాతీయ అనుభవాల నుంచి నేర్చుకుంటూ పురోగతి సాధించడం:**

కెన్యా, నైరోబి వంటి దేశాలు తక్కువ నగదు లావాదేవీల ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా విజయవంతంగా ప్రయాణం చేస్తుంటే భారత్ కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ వినూత్న చెల్లింపు విధానాలను అవలంభించాల్సి ఉంది. ఈ విషయంలో, మొబైల్ చెల్లింపులు, మొబైల్ వాలెట్లు అన్నవి ఆన్‌లైన్ లావాదేవీలకు కీలకంగా నిలుస్తాయి. ఈ తరహా మొబైల్ చెల్లింపులన్నవి పీఓఎస్ వంటి ఎలక్ట్రానిక్ మిషన్లను ఏర్పాటు చేసుకోలేని చిన్న వ్యాపారాలు, కార్పొరేటేతర రంగాలకు సరిగ్గా సరిపోతాయని చెప్పాలి. అదే విధంగా ఆఫ్రికా ఖండంలోనే అత్యధికంగా మొబైల్ ఆధారిత చెల్లింపులు జరిపే కెన్యాలోనూ, ఫీజులు, ఛార్జీలు, జీతాలు తీసుకోవడం వంటివన్నీ కూడా ఎమ్-పెసా విధానంలో నిర్వర్తించు కుంటున్నారు. అదే భారత్‌లో పీటీఎమ్, సీసీ అవెన్యూ, పేయూ వంటి చెల్లింపు మార్గాలను ప్రోత్సహించడం ద్వారా నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయి.

అయితే ఇక్కడ కొన్ని రంగాల ఆందోళనలను గమనించాల్సి ఉంది. చిల్లర వర్తకులు, హోల్‌సేల్ వ్యాపారుల లావాదేవీలు, అసంఘటిత రంగంలోని కార్మికులకు చెల్లింపులు, వ్యవసాయ కూలీలకు ఇవ్వాల్సిన కూలీ వంటి వాటి గురించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. అసంఘటిత రంగంలోని చెల్లింపులన్నీ దాదాపుగా నగదు రూపంలో ఉండడంతో పన్ను ఎగవేత లేదా తక్కువ కూలీ ఇవ్వడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. అసంఘటిత రంగాన్ని సంఘటితం చేయడానికి అనేక చర్యలను తీసుకుంటూ, అక్కడ నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆగస్టు, 2016లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ని యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌ను ఏర్పాటు చేయడంతో, మొబైల్ అప్లికేషన్ ద్వారా వినియోగదారులు బ్యాంకుల మధ్య లావాదేవీలను నిర్వర్తించుకోవడం సాధ్యమవు తోంది. దీంతో వినియోగదారులు కార్డును, కోడ్‌ను, పాస్‌వర్డులను వాడకుండగానే వివిధ వాణిజ్యసంస్థలకు మొబైల్ ద్వారా చెల్లింపులు చేయడం సాధ్యపడుతోంది. డిసెంబర్, 2016లో భారత ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. దాని ప్రకారం వేతనాల చెల్లింపు చట్టంలోని ఆరవ సెక్షన్‌కి సవరణ చేయడం ద్వారా, యాజమానులు తమ ఉద్యోగులకు చెక్కుల రూపంలో, లేదా నేరుగా బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులు చేయడం సాధ్యపడడంతో నగదు రహిత లావాదేవీలకు చట్టపరంగా వెసులుబాటు కల్పించడం జరిగింది. ఇక్కడ చెప్పాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, స్వీడన్ కూడా వేతనాలను డిజిటల్ రూపంలో చెల్లించే కార్యక్రమాన్ని 1960ల్లోనే ప్రారంభించింది.

ఇక తెలంగాణ రాష్ట్రంలోని ఇబ్రహీంపూర్ గ్రామం పూర్తిగా నగదు రహితంగా మారిపోయింది. అందరికీ బ్యాంకు అకౌంట్లు ఇవ్వడం, చెల్లింపులన్నీ నగదు రహితంగా ఉండడం, కార్డు వినియోగించడంతో రికార్డు సృష్టించింది. ఇతర గ్రామాలు కూడా ఈ విజయగాథ నుంచి ప్రేరణ పొంది నగదు రహిత గ్రామాలుగా మారే క్రమంలో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు కూడా చొరవ తీసుకొని డిజిటల్ పేమెంట్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోతున్నాయి. ఉదాహరణకి గుజరాత్‌లోని అకోదరా అనే గ్రామంలో ఒక భారతీయ ప్రైవేటు బ్యాంకు 2015లోనే డిజిటలైజ్ చేసింది. అక్కడ వైర్‌లెస్ సౌకర్యాలను, ఇంటర్నెట్ సదుపాయాన్ని పేమెంట్ టెర్మినల్స్‌ని నెలకొల్పడం ద్వారా గ్రామస్తులకు ఆధునిక బ్యాంకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

భారత్‌లో ప్రస్తుతం మెట్రో రైలు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థల్లో చెల్లింపులన్నీ నగదు రహితంగానే చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఢిల్లీలోని కొన్ని మెట్రో స్టేషన్లు 2017 సంవత్సరం నుంచి పూర్తిగా నగదు రహితంగా మారిపోను న్నాయి.

**నగదు రహితం దిశగా ప్రభుత్వం పూర్తి చేయాల్సిన అంశాలు:**

**చెల్లింపు విధానంలో వివక్ష రాహిత్యం:**

నగదు రూపంలో చేసే చెల్లింపులతో పోలిస్తే కార్డుల ద్వారా లేదా డిజిటల్ రూపంలో చేసే చెల్లింపులు ఖరీదైనవిగా ఉండకుండా చూడాలి. ఆన్‌లైన్‌లో, ఎలక్ట్రానిక్ రూపంలో జరిపే చెల్లింపులకు తరచూ బ్యాంకులు ఫీజుల రూపంలో వడ్డించడం జరుగుతోంది. దీంతో ఆన్‌లైన్ చెల్లింపులు నిరుత్సాహజనకంగా

మారతాయి. నగదు చెల్లింపుల్లో ఎలాంటి ఫీజులు లేకపోవడం ఇక్కడ గమనార్హం.

**సమాచార భద్రత:**

ఎలక్ట్రానిక్ రూపంలో జరిపే చెల్లింపుల్లో వినియోగదారుల సమాచారం నమోదు కావడం సహజం. ఈ విధంగా నమోదు అయిన సమాచారం అన్నది వ్యక్తిగత భద్రతకి ముప్పుగా మారే ప్రమాద ముంది. ఉదాహరణకి స్వీడన్‌లో, డిజిటలైజేషన్ పెరిగిపోయిన తరువాత బ్యాంకు దొంగతనాలు గణనీయంగా తగ్గిపోయాయి. అదే సమయంలో ఆన్‌లైన్ మోసాల సంఖ్య పెరిగింది. ఆ విధంగా వినియోగదారుడి సమాచారాన్ని పూర్తిగా భద్రతాయుత వాతావరణంలో పరిరక్షించడం అత్యంత ముఖ్యమైన విషయంగా మారింది. ఇప్పటికే ఆర్బీఐ ప్రీపెయిడ్ సాధనాలైన స్మార్ట్ కార్డుల విషయంలో సమీక్ష ప్రారంభించింది. ఆన్‌లైన్ లావాదేవీల్లోని ఇబ్బందులను తగ్గించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా ముఖ్యమైంది.

**భౌతికపరమైన సాంకేతికపరమైన మౌలిక సౌకర్యాల కల్పన:**

చెల్లింపు విధానం అన్నది ప్రధానంగా వివిధ చెల్లింపు పద్ధతులు అందుబాటులో ఉండడం, వాటి లభ్యత, అమోద యోగ్యతపై ఆధారపడి ఉంటుంది. భారత్‌లో, ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు నగదు రహిత చెల్లింపుల పరిమాణానికి సరిపడా లేవన్నది వాస్తవం. దేశంలో నగదు రహిత లావాదేవీలు విస్తృతస్థాయిలో జరగడానికి వీలైన మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు వాటి నిర్వహణకి అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్, బ్రాడ్ బాండ్ అనుసంధానం అన్నవి ముఖ్యమైనవి. ఇక నగదు రహిత లావాదేవీల్లో అత్యధికంగా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉన్నందున వాటి వినియోగానికి ఇంటర్నెట్ అనుసంధానం అన్నది కీలక అంశంగా ఉంటుంది.

**తక్కువ పన్నులు:**

స్మార్ట్ ఫోన్లు, టాబ్లెట్స్ వంటి సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి వినియోగించే పరికరాలపై పన్నులను తగ్గించడం ముఖ్యమైన అంశంగా ఉంటుంది. దీంతో ప్రజలు డిజిటల్ రూపంలో తేలిగ్గా చెల్లింపులు చేయగలుగుతారు. సరుకులు, సేవా పన్ను (జీఎస్టీ) ప్రకారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ విడుదల చేసినట్లుగా జీఎస్టీలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై పన్ను 28 శాతంగా ఉండే అవకాశం ఉంది. ఇది చాలా ఎక్కువేనని చెప్పాలి. స్మార్ట్ ఫోన్లను అందరికీ అందుబాటులోకి తీసుకొని రావాల్సి ఉంది. 2016లో ప్రపంచంలోనే అత్యధిక కార్పొరేట్ పన్ను వసూలు చేసిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశీయ కంపెనీల నుంచి 30 శాతం చొప్పున, విదేశీ కంపెనీల నుంచి 40 శాతం చొప్పున ఇతర పన్నులకు అదనంగా వసూలు చేస్తుంది. అదే స్వీడన్‌లో 22 శాతముంటే, చైనాలో 25 శాతం పన్నులను దేశీయ, విదేశీయ కంపెనీల నుంచి వసూలు చేస్తారు. అత్యధిక పన్నులన్నవి పన్ను ఎగవేతకే దారితీస్తాయి.

**పరిణితి చెందిన ఈ-కామర్స్ విధానం:**

దేశానికి ఒక బలమైన ఈ-కామర్స్ క్రమబద్ధీకరణ విధానం ఉండడంతో అది నగదు రహిత చెల్లింపులు చేసే వినియోగదారుడికి పరిరక్షణ సాధ్యమవుతుంది.

చివరగా, తక్కువ నగదు లావాదేవీల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుందని చెప్పాలి. అయితే, తక్కువ నగదు లావాదేవీల నిర్వహణ విషయంలో ఇతర దేశాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటే, మౌలిక సదుపాయల కల్పన, దానికి తగిన రీతిలో మద్దతిచ్చే సాధనాలు ముఖ్యమైనవి. తక్కువ నగదు చలామణి ఆర్థిక వ్యవస్థ వైపుగా ప్రయాణం చేయడంలో ప్రభుత్వం, ఆర్థిక సంస్థలు, వాణిజ్య సంస్థలు సంయుక్తంగా కృషి చేయాలి. దీనితోడు, దేశంలో అతి తక్కువ, సరళీకృత పన్ను నిర్మాణం ఉండాలి. 2017-18 బడ్జెట్‌లో ఈ దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకొని తక్కువ నగదు ఛలామణిలో ఉన్న ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు దిశగా బలమైన అడుగులు వేయాలని ఆశిద్దాం.


యోజన

కేంద్ర బడ్జెట్ 2017-2018

మార్చి, 2017 ప్రత్యేక సంచిక

**నగదురహిత లావాదేవీలు**

# స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ- నల్లధనంపై ప్రభావం



**లబ్ది దారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు నగదు పంపిణీ చేస్తుండటంతో, డిజిటల్ చెల్లింపుల వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలుకు మరింత సమర్థత లభిస్తోంది. అందుకే ఒకసారి లబ్దిదారుల బ్యాంకు ఖతాలలోకి నగదు పంపిణీ అయిపోతే, మొత్తం ప్రక్రియ పారదర్శకమైపోతోంది. దాంతో సహజంగానే అవినీతి తగ్గిపోతుంది. డిజిటల్ ఆర్థికవ్యవస్థ ఎలా పనిచేస్తుందో, మొబైల్ ఫోన్లను బ్యాంకింగ్ పరికరాలుగా ఎలా వాడుకోవాలో, ఎలా చెల్లింపులు చేయాలో నేర్చుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.**

సమాంతర ఆర్థిక వ్యవస్థపై పోరాడాలని భారత దేశం నవంబరు 8న నిర్ణయించు కున్నపుడు, రోజువారీ నగదు లావాదేవీలను సజావుగా కొనసాగించేందుకు దోహదం చేసింది – ప్రజలు నగదు వాడకానికి ప్రత్యామ్నాయాలను వినియోగించ గలగటమే అనటం వాస్తవం. క్రెడిట్ కార్డులు / డెబిట్ కార్డులు, ఎలక్ట్రానిక్ వ్యాలెట్లు, మొబైల్ బ్యాంకింగ్ లాంటి వాటి ద్వారా చెల్లింపులు చేసే కొత్తశకం వైపు దేశం పురోగమిస్తున్న తరుణంలో, ఎక్కువ ఇబ్బందులు ఎదురవు తున్నది నగదు వాడకానికే. నల్లధనాన్ని పెకిలించివేసి, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు దిశగా ముందుకుసాగే లక్ష్యంతో; మరింత పారదర్శక పాలన, అవినీతి లేని సమాజ సాధనకు అవవసరమైన అన్ని చర్యలనూ చేపట్టటమే నరేంద్ర మోదీ ప్రభుత్వ దార్శనికత. దీనివల్ల, పన్ను వసూళ్లు పెరగటమే కాకుండా, పేదలకు రుణ సౌలభ్యమూ పెరుగుతుంది. చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, నగదు రహిత లావాదేవీల వల్ల వినియోగదారుల లావాదేవీలు విలువ పరంగా 98 శాతం, సంఖ్యాపరంగా 68 శాతం పెరుగుతాయని ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (Pricewaterhouse Coopers) సంస్థ 2015లో ఒక నివేదికలో పేర్కొంది. సమాజంలో ఆర్థిక సమానత్వ సాధనకు నగదు లావాదేవీలే అవరోధాలని కొందరు నిపుణులు, ఆర్థిక వేత్తలు కూడా చెబుతున్నారు. అంత పెద్ద ఎత్తున అధిక నగదు వినియోగించటంలో ఎదురయ్యే మరో ప్రధాన సవాలు ఏమిటంటే, అలా నగదు వినియోగించటానికి ఖర్చు చేయాల్సిన వనరులు కూడా ఎక్కువే. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించటానికి చేసే అన్ని ప్రయత్నాల వల్ల నేరుగా ప్రభావితం అయ్యేది, నల్లధన వ్యవస్థే.

ప్రజలు నగదు రహిత లావాదేవీలు చేయక తప్పని పరిస్థితులు ఏర్పడటంతో – పారదర్శకత లేని, రహస్య లావాదేవీల సమాంతర ఆర్థిక వ్యవస్థ వెనుకంజ వేయక తప్పలేదు. అన్ని లావాదేవీలు ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిగితే ప్రతి ఒక్క లావాదేవీ జాడనూ తెలుసుకోవచ్చు, వెంబడించవచ్చు, నమోదు చేయవచ్చు, పరిశీలించవచ్చు. పన్ను వసూళ్లలో కోత పెడుతున్న, తీవ్రవాదానికి ఆర్థిక వనరులు సమకూరుస్తున్న, మత్తు పదార్థాలను అందుబాటులోకి తెస్తున్న, నకిలీ నగదును అది సృష్టిస్తున్న నల్లధనాన్ని

**టిమ్సీ జైపురియా,** స్పెషల్ కరెస్పాండెంట్, CNBC TV18, న్యూ ఢిల్లీ.
E-mail: timsy.jaipuria@gmail.com

అరికట్ట వచ్చు. అలాగే, నల్లధనంపై ఆంక్షలు రియల్ ఎస్టేట్ ధరలను కూడా తగ్గిస్తాయి. ఎందుకంటే, నల్లధనం ఎక్కువగా రియల్ ఎస్టేట్‌లోనే పెట్టుబడిగా పెట్టటం వల్ల భూముల ధరలు పెరిగిపోతాయి కనుక, నల్ల ధనాన్ని అరికట్టే ఉద్దేశ్యంతో, దేశాన్ని నగదు రహిత సమాజంగా మార్చే ఆలోచనను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన 2016 బడ్జెట్ ప్రసంగంలోనే వ్యక్తంచేశారు. అయినా, దేశంలో మొత్తం లావాదేవీలలో 5% మాత్రమే ఎలాక్ట్రానిక్ పద్ధతిలో జరుగు తున్నాయని, ఇప్పటికీ మన దేశం నగదు లావదేవీలపైనే ఆధారపడ్డ దేశంగా కొనసాగుతుండటం విచారకరమైన విషయం. పెద్దనోట్ల రద్దు ద్వారా ఈ విషయాన్ని మరింత ముందుకు తెస్తూ, రిజర్వ్ బ్యాంకు ఇటీవల "భారత్‌లో చెల్లింపులు–సెటిల్మెంట్లు: 2018 దార్శనిక పత్రం" పేరిట ఈ మధ్య ఒక పత్రాన్ని వెలువరించింది. ఇందులో భారత్‌ను నగదు రహిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు, ఎలక్ట్రానిక్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు గాను దీర్ఘకాలిక, మధ్య కాలిక చర్యలను చేపట్టే ఉద్దేశ్యాన్ని, అందుకు అవసరం అయిన ప్రణాళికనూ వెలువరించింది.

నగదు పంపిణీ, నిర్వహణ లాంటి కార్యకలాపాలకే రిజర్వ్ బ్యాంకు ఒక్క 2015 సంవత్సరంలోనే 27 బిలియన్లు అంటే దాదాపు 2700 కోట్ల రూపాయిలు ఖర్చు చేసింది. ప్రపంచం అంతా డిజిటల్ చెల్లింపు వ్యవస్థ వైపు, ప్లాస్టిక్ నగదు వైపు పయనిస్తూంటే, భారత్ నగదు పైనే ఇంత ఖర్చు చేయాల్సి రావటం దేశాన్ని తిరోగమనం వైపు నడపటమేనని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. ఆర్థికమంత్రిగా అరుణ్ జైట్లీ, సార్వత్రిక బ్యాంకింగ్ సేవల లభ్యతకు 'నగదు రహిత ఆర్థిక వ్యవస్థ' మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ఇందుకు డిజిటల్ లావాదేవీలు మినహా మరే భౌతిక సదుపాయాల అవసరమూ లేదు. డిజిటల్ సదుపాయాలను ప్రభుత్వం చాలా సులభంగా అందుబాటులోకి తేగలదు కూడా. ఇంతే కాదు. మరి కొన్ని ప్రయోజనాలు కూడా నల్లధనం సృష్టిపై ప్రతికూల ప్రభావం చూపాయి. లబ్ది దారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు నగదు పంపిణీ చేస్తుండటంతో, డిజిటల్ చెల్లింపుల వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలుకు మరింత సమర్థత లభిస్తోంది. అందుకే ఒకసారి లబ్దిదారుల బ్యాంకు ఖాతాలలోకి నగదు పంపిణీ అయిపోతే, మొత్తం ప్రక్రియ పారదర్శకం అయి పోతోంది. ఈ చెల్లింపుల జాడను సులభంగా తెలుసుకోవచ్చు. దాంతో సహజంగానే అవినీతి తగ్గిపోతుంది. అలాగే, ప్రజలు తమకు న్యాయంగా రావలసిన మొత్తం తీసుకోటానికి ఎలాంటి 'చెల్లింపులూ' చేయాల్సిన అవసరం ఉండదు. ఈ పెను మార్పుకు నాంది పలుకుతూ, డిజిటల్ అర్థవ్యవస్థ ఎలా పనిచేస్తుందో, మొబైల్ ఫోన్లను బ్యాంకింగ్ పరికరాలుగా ఎలా వాడుకోవాలో, ఎలా చెల్లింపులు చేయాలో నేర్చుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. "మీ బ్యాంకు ఖాతాలను, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను వినియోగించుకునే భిన్న పద్ధతులను తెలుసుకోండి. మీ ఫోన్లపై వివిధ బ్యాంకుల ఆప్ (App)లను శక్తివంతంగా ఎలా వాడుకోవాలో నేర్చుకోండి. నగదు లేకుండా మీ వ్యాపారాలను ఎలా నడపాలో నేర్చుకోండి. కార్డ్ చెల్లింపులను, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపులను ఎలా చేయాలో తెలుసుకోండి' అని అన్నారు. నల్లధనాన్ని ఏరివేయటంలో దేశానికి సాయం అందించే మార్పుకు ప్రజలు స్వయంగా తమతోనే శ్రీకారం చుట్టాలని ప్రధానమంత్రి విజ్ఞప్తి చేశారు. ■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు 15వ తేది లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. గమనించగలరు.

***సీనియర్ ఎడిటర్***

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in




ప్రాతూరి పోతయ్య శర్మ

1) BHIM ఏమిటి? వివరాలేవీ?
   ఎ) భారత్ ఇంటర్ఫేస్ ఫర్ మనీ (BHIM). యాప్ ఇది.
   బి) ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైనది.
   సి) UPI & USSD పేమెంట్స్ మోడ్స్‌తో అనుసంధానమైన / సపోర్ట్ గల ఏ బ్యాంకు ఖాతా నుంచైనా మనీ ట్రాన్స్ ఫర్ (నగదు బదిలీ) చెయ్యవచ్చును .
   డి) పైవన్నీ

2) 'TIES' వివరాలేవీ?
   ఎ) ట్రేడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్ పోర్ట్ స్కీం (TIES) ఇది.
   బి) ఆర్థిక మద్దతునిస్తుంది
   సి) ఎగుమతుల మౌలిక సదుపాయాల కోసం రాష్ట్రాలు చేసే ప్రయత్నాలకు మద్దతు ఉంటుంది
   డి) పైవన్నీ

3) సీసం – జింక్ ఖనిజం పుష్కలంగా ఉన్న జవార్ గనులు ఎక్కడ ఉన్నాయి ?
   ఎ) విశాఖపట్నం
   బి) శారద జిల్లా, రాజస్థాన్
   సి) నైవేలి డి) తురంది

4) సెంట్రల్ స్టాటిస్టిక్స్ అర్గనైజేషన్ (CSO) ప్రకారం 20 16 – 17లో, భారత దేశ ఆర్థిక రంగానికి సంబంధించి ఏది కరెక్ట్?
   ఎ) జీడీపీ వృద్ధి రేటు : 7.1 %
   బి) రియల్ GDP : రూ. 121.55 లక్షల కోట్లు
   సి) తలసరి ఆదాయం (కరెంటు ప్రైసెస్‌లో) : రూ. 1,03,007/–
   డి) పైవన్నీ

5) దేవ్నీ (Deoni) జాతి ఆవుల లక్షణాలు ఏవి? వివరాలేవీ?
   ఎ) జహీరాబాద్, బీదర్, లాతూర్‌లలో పెంచుతున్నారు
   బి) చెవులు కాస్తంత కిందకి దిగి ఉంటాయి . ముఖం నుదురు లావుగా ఉంటుంది . నలుపుగాని తెలుపు గాని శరీర వర్ణం
   సి) ఇవి కరువు కాలంలో కూడా తట్టుకుని జీవించగలవు. డి) పైవన్నీ

6) క్రీస్తు పూర్వం 10, 000 సంవత్సరాలు 5,000 సంవత్సరాలకి చెందిన నవీన శిలాయుగపు మానవుడు జీవించిన మట్టరాళ్ల గుహ ఎక్కడుంది?
   ఎ) కొత్తగూడెం
   బి) యెల్లంపేట గ్రామం, మాచారెడ్డి మండలం, కామారెడ్డి, తెలంగాణా రాష్ట్రము
   సి) భద్రాచలం డి) పాల్వంచ

7) "ది పీపుల్స్ ప్రెసిడెంట్ APJ అబ్దుల్ కలాం" పుస్తక రచయిత ఎవరు?
   ఎ) టిం బౌక్వెట్ బి) S.M.ఖాన్
   సి) A.G.రోమ్మర్స్ డి) హన్య యన గిహర

8) చంద్రుడిలో లభించే "వాటర్–ఐస్"ని ఏమంటారు?
   ఎ) హైడ్రాక్సీల్ బి) హైడ్రోజన్ పెరాక్సైడ్
   సి) ట్రిషియం డి) డ్యుటేరియం

9) GIFT సిటీ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు?
   ఎ) గుజరాత్‌లో గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ సిటీని గాంధీనగర్ దగ్గర ఏర్పాటు చేస్తున్నారు.
   బి) ముంబై సి) చెన్నై డి) కోల్‌కతా

10) 1969లో మహాత్మాగాంధీ శతజయంతి సందర్భంగా విడుదల చేసిన పోస్టల్ స్టాంప్ మీద ఉండే మహాత్మా గాంధీ బొమ్మ / చిత్రం గీసిన దేవరు ?
   ఎ) సూరజ్ సదన్ ( మాంట్రియాల్, కెనడా)
   బి) M.F.హుస్సేన్ సి) రవీంద్రనాథ్ టాగోర్
   డి) చిత్తరంజన్ దాస్

11) భీమల్ పెన్ పూజ (భీముని పూజ) తెలంగాణా రాష్ట్రములో ఏ గిరిజనులు చేస్తారు? వివరాలేవీ?
   ఎ) కోలం తెగ వారు
   బి) కోలం తెగ వారి జనాభా దాదాపు 30,000
   సి) ఆదిలాబాద్, మంచిర్యాల్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో నివశిస్తున్నారు
   డి) పైవన్నీ

12) రాష్ట్రపతి (ఆర్టికల్ 123 ప్రకారం), గవర్నర్ (ఆర్టికల్ 213 ప్రకారం) ఆర్డినెన్స్‌లు జారీ చేయు అధికారాలు కలిగిఉన్నారు. సాధారణంగా ఆర్డినెన్స్‌లు ఏ సమయాలలో జారీచేస్తున్నారు?
   ఎ) ప్రభుత్వాన్ని నడిపించేవారు చట్టసభలను ఎదుర్కోవడం ఇష్టం లేనప్పుడు.
   బి) ఎగువ సభలో ఓటమి గురించి భయ పడినప్పుడు.
   సి) ప్రతిపక్షాలుపదే పదే సభ సమావేశాలను అడ్డుకున్నప్పుడు.
   డి) పైవన్నీ

13) 2017లో బెంగళూరులో నిర్వహించిన భారతీయ ప్రవాసీ దివస్‌కి అతిధులుగా ఎవరెవరు వచ్చారు?
   ఎ) పోర్చుగల్ ప్రధాన మంత్రి : అంటోనియో కోస్తా
   బి) సూరినాం వైస్ – ప్రెసిడెంట్: మైకేల్ అశ్విన్ ఆధిన్
   సి) కతార్ నుండి : కరీంఅబ్దుల్లా
   డి) పై అందరూ

14) ప్రకాష్ పర్వ్ పేరుతో గురు గోవింద్ సింగ్ 350వ జయంతి సందర్భంగా, ఒకవారం రోజుల పాటు ఉత్సవాలు ఎక్కడ నిర్వహించారు?
   ఎ) హైదరాబాద్ బి) పాట్నా, బీహార్
   సి) గుల్బర్గా డి) అలహాబాద్

15) ప్రస్తుతం UGC చైర్మన్‌గా ఎవరు పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు ?
   ఎ) M. జగదీష్ కుమార్
   బి) H.R. నాగేంద్ర సి) D.P. సింగ్
   డి) K.P.జోషిపుర

16) ఉత్తరప్రదేశ్‌లో MLA సీట్లు ఎన్ని?
   ఎ) 403 బి) 40 సి) 117 డి) 30

17) భారత్ నెట్ రెండవ దశను ఎన్ని కోట్ల రూపాయలతో చేపట్ట దలిచారు? వివరాలేవీ?
   ఎ) 27,000
   బి) 1.5 లక్షల గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బాండ్ కనెక్షన్ ఇస్తారు.
   సి) మిడ్ – 2017 నుండి ప్రారంభిస్తారు.
   డి) పైవన్నీ

18) కేంద్ర ప్రభుత్వం ప్రకారం, డిమానిటైజేషన్ చేసిన రు.500 & రు.1000 నోట్ల మొత్తం విలువ ఎంత? (కోట్ల రూపాయలలో )
   ఎ) 12.44 బి) సుమారు 15.4
   సి) 14.97 డి) 10.00

19) USA కాంగ్రెస్ (అమెరికా దేశ పార్లమెంట్ పేరు కాంగ్రెస్)లో ఉన్న 535 సభ్యులలో ఎంత మంది విదేశాలలో జన్మించి USAలో సెటిల్ అయిన వారున్నారు?
   ఎ) 23 బి) 30 సి) 40 డి) 50

20) USAలో సాధారణ జనభాలో ఎవరెవరు ఎంత శాతం ఉన్నారు ?
   ఎ) ముస్లింలు : 0.9 %

బి) హిందువులు: 0.7 %

సి) బుద్దిస్ట్ లు: 0.7 %   డి) పైవన్నీ

21) ఇండియన్ – అమెరికన్స్ మీద ఇటీవల పుస్తకం రాసిన దేవరు?

ఎ) దేశ్ కుమార్   బి) సంజయ్ చక్రవర్తి

సి) నిర్వి కార్ సింగ్   డి) పై ముగ్గురు కలిసి

22) ఫైనాన్షియల్ స్టెబిలిటీ & డెవలప్‌మెంట్ కౌన్సిల్ ( FSDC)లో ఎవరెవరు ఉంటారు ?

ఎ) కేంద్ర ఆర్థిక మంత్రి

బి) రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా , గవర్నర్

సి) SEBI, PFRDA, IRDA ఛైర్మన్లు

డి) పై అందరూ

23) పోర్చుగల్ ప్రధాన మంత్రి అంటొనియో కోస్తా త్రండ్రి పేరు అర్లాండో కోస్తా. ఈయన ఏ రాష్ట్రము లో ఉండేవారు?

ఎ) పాండిచేరి   బి) గోవా

సి) యానాం   డి) మాహే

24) 2015 – 16లో భారత దేశం ఎన్ని మిలియన్ కిలో గ్రాముల తేయాకు ఎగుమతి చేసింది?

ఎ) 232.9   బి) 119   సి) 127   డి) 230

25) 7, లోక్ కళ్యాణ్ మార్గ, న్యూ ఢిల్లీ ఎవరి అధికార నివాసం?

ఎ) భారత రాష్ట్రపతి

బి) భారత దేశ ప్రధాన మంత్రి

సి) ప్రతిపక్ష పార్టీ నేత

డి) సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులు

26) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?

ఎ) గోవా: 40 (ఒకేదశలో ఓటింగ్ )

బి) మణిపూర్: 60 (రెండు దశలలో ఓటింగ్)

సి) పంజాబ్: 117 (ఒకే దశలో ఓటింగ్)

డి) పైవన్నీ (రాష్ట్రాలు: అసెంబ్లీ స్థానాలు) (పోలింగ్ దశలు)

27) 2017లో 70 MLA సీట్లున్న ఉత్తరాఖండ్‌లో ఎన్నికలు ఒకే దశలో నిర్వహిస్తారు. 403 MLA సీట్లున్న ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికలు ఎన్ని దశలలో నిర్వహిస్తారు?

ఎ) 7 (ఫిబ్రవరి 7 నుండి మార్చ్ 8, 2017 వరకు)

బి) 5   సి) 4   డి) 3

28) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు అత్యధికంగా ఎంత? వివరాలేవీ?

ఎ) UP : రు.28 లక్షలు

బి) గోవా: రు. 20 లక్షలు

సి) ఎన్నికల ఖర్చు చెల్లింపు ఎంత దాటితే చెక్కు ద్వారా చెల్లించాలి : రు. 20,000/–

డి) పైవన్నీ (ఎన్ని కల కమిషన్ ఆదేశాల ప్రకారం)

29) కెన్ – బెట్వా రివర్ లింకింగ్ ప్రాజెక్ట్ వివరాలేవీ?

ఎ) ప్రాజెక్ట్ ఖర్చు : రు. 10,000 కోట్లు

బి) కాలువల పొడవు : 230 కిలోమీటర్లు

సి) మధ్య ప్రదేశ్‌లో 3.5 లక్షల హెక్టార్లు, ఉత్తర ప్రదేశ్‌లో కరువు ప్రాంతమైన బుందేల్ ఖండ్‌లో 14,000 హెక్టార్ల భూమికి సాగునీరు లభిస్తుంది.

డి) పైవన్నీ

30) 1.1.1818 నాడు జరిగిన భీమా – కోరే గావ్ వద్ద జరిగిన యుద్ధంలో ( 3వ ఆంగ్లో – మరాఠా యుద్ధంలో) ఎవరి సేనలు పరాజయం పొందాయి?

ఎ) టిప్పు సుల్తాన్

బి) పీష్వా బాజీరావు II

సి) ఝాన్సీ లక్ష్మి బాయ్

డి) జాఫర్ షా

31) సుప్రీం కోర్టు 44వ ప్రధాన న్యాయ మూర్తిగా ఎవరు బాధ్యతలు చేపట్టారు?

ఎ) జస్టిస్ జగదీష్ సింగ్ కేహర్

బి) జస్టిస్ D.Y.చంద్ర చూడ్

సి) జస్టిస్ T.S.ఠాకూర్

డి) వీరెవరు కారు

32) ఈ కింది వాటిల్లో ఏది గుజరాత్‌లో ఉంది?

ఎ) లిటిల్ రాన్ (విస్తీర్ణం: దాదాపు 7,000 చదరపు కిలో మీటర్లు)

బి) వైల్డ్ యాస్ (అడవి గాడిదలు) వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం : విస్తీర్ణం 4953 చదరపు కిలోమీటర్లు.

సి) కాలదుంగార్ & నల్ సరోవర్ సరస్సు

డి) పైవన్నీ

33) ఏ నగరాన్ని "గేట్ వే అఫ్ సెవెన్ సిస్టర్స్" అంటారు?

ఎ) గౌహతి (గువహతి)   బి) షిల్లాంగ్

సి) కొహిమా   డి) ఈటానగర్

34) 1,080 MW భద్రాద్రి థర్మల్ ప్రాజెక్ట్ (BTPP) వివరాలేవీ?

ఎ) 270 x4=1080 MW (ప్రతిపాదిత సామర్థ్యం)

బి) మణుగూరులో నిర్మిస్తారు

సి) బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ (సబ్–క్రిటికల్ టెక్నాలజీ గలది). డిసెంబర్, 2017 నాటికి పూర్తి కావాలి.

డి) పైవన్నీ

35) 2017లో 7 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు గెల్చుకున్న సినిమా ఏది?

ఎ) "లాలా ల్యాండ్"

బి) "వన్ ఫ్లూ ఓవర్ ది కుకూస్ నెస్ట్"

సి) "మిడ్ నైట్ ఎక్స్ ప్రెస్"

డి) "మాంచెస్టర్ బై ది సీ"

36) 'అంతరిక్షం' అనే సంస్కృతం పదం నుండి ఏ కంపెనీకి పేరు పెట్టారు?

ఎ) ఆంట్రిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇది ఇస్రో సంస్థ)

బి) BHEL   సి) ECIL   డి) BDL

37) సాట్ కాం (శాటిలైట్ కమ్యూనికేషన్స్) వ్యాపారంలో గల ప్రధాన సౌకర్యలేవి ?

ఎ) ట్రాన్స్‌పాండర్లను DTH బ్రాడ్ కాస్టింగ్ కోసం అద్దెకి ఇవ్వటం

బి) DSNG, డిజిటల్ శాటిలైట్ TV న్యూస్‌ను, మారు మూల ప్రాంతాల నుండి సేకరించటం

సి) VSAT మరియు సెల్యూలర్ బ్యాక్ హాలింగ్

డి) పైవన్నీ

38) హైథ్రూ పుట్ శాటిలైట్ (HTS) (ఉపగ్రహాల) వల్ల ప్రయోజనం ఏది?

ఎ) ఇంటర్నెట్ సర్వీస్‌లు బాగా అభివృద్ధి చెందుతాయి

బి) ఇన్సూరెన్స్ కంపెనీలు వెరిఫికేషన్ చేస్తాయి

సి) వ్యవసాయం అభివృద్ధి చెదుతుంది

డి) వరదలు నిరోధించ బడతాయి

39) కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ కి నూతన లెఫ్టి నెంట్ గవర్నర్‌గా ఎవర్ని నియమిచారు ?

ఎ) కిరణ్ బేడి   బి) అనిల్ బైజాల్

సి) నజ్మా హెప్తుల్లా   డి) మృదులా సిన్హా

40) RBI చట్టం 1934లోని ఏ సెక్షన్ ప్రకారం లీగల్ టెండర్ కరెన్సీ నోట్ల చెల్లింపులకు సంబంధించిన బాధ్యత / ఆబ్లిగేషన్ ఉంది?

ఎ) సెక్షన్ 42   బి) సెక్షన్ 26

సి) సెక్షన్ 4   డి) సెక్షన్ 35

41) USA సెనెట్ (మన దేశ రాజ్య సభ లాంటిది)లో ఏ పార్టీ వారు ఎంత మంది ఉన్నారు?

ఎ) రిపబ్లికన్ పార్టీ సెనేటర్లు : 52

బి) డెమోక్రాటిక్ పార్టీ సెనేటర్లు : 46

సి) ఇండిపెండెంట్ సెనేటర్లు : 2

డి) పైవన్నీ (మొత్తం సేనేటర్ల సంఖ్య : 100)

42) 2017లో ప్రవాసీ భారతీయ సమ్మాన్ (అవార్డులు) అందుకున్నది ఎవరు ?

ఎ) డా: అంటోనియోకోస్తా

బి) నిషా దేశాయ్ బిస్వాల్

సి) అరిఫుల్ ఇస్లాం   డి) పై అందరూ

43) బెడా క్విలిన్ (BDQ) మందు ఏ వ్యాధి తగ్గటానికి వాడతారు ?

ఎ) TB   బి) ఎయిడ్స్

సి) కలరా   డి) మలేరియా

44) 'ఖందేరి' వివరాలేవీ?

ఎ) ఛత్రపతి శివాజీకి రాజ్యంలో ఒక కోట ఇది. ఇది ఒక దీవిలో ఉంది.

బి) ఈ పేరు మీద జలాంతర్గామిని తయారు చేశారు.

సి) స్కార్పీన్ సబ్‌మెరైన్ ఇది

డి) పైవన్నీ

45) తమిళనాడు నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎవరు?

ఎ) రాజీవ్ శర్మ   బి) గిరిజా వైద్యనాథన్

సి) ఆనంద్ ప్రకాష్   డి) S.V.ప్రసాద్

46) పోలవరం ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం

నాబార్డ్ ద్వారా ఎంత సొమ్ము అందచేసింది (కోట్ల రూపాయలలో )

ఎ) 1200 బి) 1981.54

సి) 1400 డి) 2000

47) ఇండియన్‌ఎయిర్ ఫోర్స్ నూతన చీఫ్ మార్షల్ ఎవరు?

ఎ) టాం వెబ్ బోవెన్

బి) బిరేందర్ సింగ్ ధనోవా

సి) ఫిలిప్ గేమ్

డి) సర్ ఎడ్వర్డ్ లియోనార్డ్ ఎల్లింగ్ టన్

48) భారత దేశం బలం మూడు Dల మీద ఉందంటారు ? అవి ఏవి ?

ఎ) డేమోగ్రఫీ ( జనాభా)

బి) డెమోక్రసీ (ప్రజాస్వామ్యం)

సి) డిమాండ్ (ఎకనామిక్స్‌లో వాడే పదం)

డి) పైవన్నీ

49) 2017 వైబ్రెంట్ గుజరాత్ సమావేశానికి వచ్చిన విదేశీ ప్రముఖులు ఎవరు?

ఎ) కీన్యా అధ్యక్షుడు : ఒహురు కీన్యేట్ట

బి) రువాండా అధ్యక్షుడు : పాల్ కగామే

సి) సెర్బియా ప్రధాని : అలేక్సాండర్ వూసిక్

డి) పై అందరూ

50) భారతదేశం యొక్క ఆఫ్రికా పాలసి, ఆఫ్రికన్ యూనియన్ ప్రమోట్ చేసే దేనికి అనుకూలంగా ఉంది?

ఎ) ఎజెండా 2063

బి) UN సంస్కరణలు

సి) వాతావరణ మార్పు & ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్

డి) కౌంటర్ టెర్రరిజం

51) ఈస్ట్ ఆఫ్రికా కమ్యూనిటీ (EAC)లో గల దేశాలేవి?

ఎ) కెన్యా

బి) టాంజానియా, ఉగాండా, రువాండా

సి) బురుండీ & సౌత్ సూడాన్

డి) పైవన్నీ

52) న్యూ ఢిల్లీలో గల రాష్ట్రపతి భవనం ఉన్న ప్రాంతాన్ని 1910 సంవత్సర ప్రాంతంలో ఏమని పిలిచేవారు ?

ఎ) బక్సర్ బి) రైసినా గ్రామం

సి) కాళిఘాట్ డి) భద్రక్

53) ICC క్రికెటర్ అఫ్ ది ఇయర్ & ది బెస్ట్ క్రికెటర్ అఫ్ ది ఇయర్ అవార్డు ఇటీవల ఎవరికి ఇచ్చారు ?

ఎ) R. అశ్విన్ బి) విరాట్ కోహ్లి

సి) M.S. ధోని డి) సచిన్ టెండూల్కర్

54) 100 బోలివార్ బిల్స్ (కరెన్సీ నోట్స్) ని ఇటీవల డిమానిటైజేషన్ చేసిన దేశం ఏది ?

ఎ) సౌత్ ఆఫ్రికా బి) వెనెజులా

సి) జింబాబ్వే డి) బ్రెజిల్

55) 2016 మిస్ వరల్డ్‌గా ఎవర్ని ఎంపిక చేశారు?

ఎ) ఐశ్వర్య రాయ్ బి) స్టే ఫాని డెల్ వాల్లే

సి) మేగాన్ యంగ్ డి) రోలీన్స్ట్రాస్

56) UN భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్) ఏ దేశంలో కాల్పుల విరమణను గుర్తించింది?

ఎ) సూడాన్ బి) సిరియా

సి) ఇరాక్ డి) అల్జీరియా

57) అల్ – బిరూని, పర్షియా స్కాలర్ & గణిత శాస్త్ర వేత్త, భూ గోళం చుట్టూ కొలతని కటాస్ రాజ్ మందిరం నుండి కొలిచాడట. ఈ మందిరం ఎక్కడ ఉంది?

ఎ) ఆఫ్ఘనిస్తాన్ బి) పాకిస్తాన్

సి) తజికిస్తాన్ డి) కిర్గిస్తాన్

58) ఏ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్, ఎలెక్టోరల్ రోల్స్ (ఓటర్ల జాబితా) హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ప్రచురిస్తోంది?

ఎ) తమిళనాడు బి) ఉత్తర ప్రదేశ్

సి) కేరళ డి) కర్ణాటక

59) ఏప్రిల్,1917లో మహాత్మాగాంధీ ఎక్కడకు వెళ్లి పేద రైతుల సమస్యలు తెలుసుకుని, వారికి తోడుగా ఉండి, ఉద్యమం మొదలు పెట్టారు?

ఎ) బార్డోలీ బి) చంపారణ్, బీహార్

సి) సబర్మతి డి) వార్ధా

60) హోప్ ఐలాండ్ (దీవి) ఎక్కడ ఉంది?

ఎ) అండమాన్ & నికోబార్

బి) కొరింగా వైల్డ్ లైఫ్ శాంక్చువరి (కాకినాడ)

సి) లక్షద్వీప్ డి) దయ్యు & డామన్

61) కన్ ఫ్యూసియస్ అనే రుషి (క్రీస్తుపూర్వం 551 – 479) ఏ దేశస్థుడు ?

ఎ) జపాన్ బి) చైనా

సి) దక్షిణ కొరియా డి) ఉత్తర కొరియా

62) డిసెంబర్, 2016లో భారత దేశ వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిట్) ఇంతకు తగ్గింది ?

ఎ) 23.88 బి) 10.36

సి) 34.25 డి) 7.6

63) ప్రెసిడెన్షియల్ మెడల్ అఫ్ ఫ్రీడమ్‌ను ఇటీవల USA లో ఎవరికిచ్చారు?

ఎ) బిల్ క్లింటన్

బి) జో బిడెన్, వైస్ – ప్రెసిడెంట్

సి) బరాక్ ఒబామా డి) రిచర్డ్ నిక్సన్

64) భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎక్కడ వస్తున్నది?

ఎ) పాలేర్ రిజర్వాయర్, ఎర్రగడ్డ తండా, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా

బి) నాగార్జున సాగర్

సి) ఎల్లంపల్లి డి) కరీం నగర్

65) డిజి ధన్ మేళా ఉపయోగంఏమిటి? వివరాలేవీ?

ఎ) జనాల్లో డిజిటల్ ఫైనాన్షియల్ లిటరసీ ప్రచారం చేయటం.

బి) డిజిటల్ ట్రాన్సాక్షన్స్ అందరికి తెలియచేయటం

సి) 'లక్కీగ్రాహక్' యోజన విజేతలకు బహుమతులు అందించటం

డి) పైవన్నీ

66) పబ్లిక్ అకౌంట్స్ కమిటి చైర్మన్ ఎవరు? వివరాలేవీ?

ఎ) KV థామస్(చైర్మన్)

బి) అత్యధికంగా 22 మంది సభ్యులు ఉంటారు

సి) CAG సమర్పించిన అకౌంట్స్ నివేదికలను అధ్యయనం చేస్తుంది.

డి) పైవన్నీ

67) రీ యూనియన్ ఐలాండ్ ఎక్కడ ఉంది ?

ఎ) పసిఫిక్ మహా సముద్రం

బి) ఇండియన్ ఓషన్

సి) అరేబియా సముద్రం

డి) బంగాళాఖాతం

68) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?

ఎ) PIO : పర్సన్స్ అఫ్ ఇండియన్ ఆరిజన్

బి) OCI : ఓవర్సీస్ సిటిజెన్ అఫ్ ఇండియా

సి) FTA : ఫారెన్ టూరిస్ట్ ఎరైవల్స్

డి) పైవన్నీ

69) భారతీయ రిజర్వు బ్యాంకు నోట్ ముద్రణ ప్రైవేటు లిమిటెడ్ (BRBNMPL), ఉన్నసల్బోని ఏ రాష్ట్రములో ఉంది?

ఎ) కర్ణాటక

బి) పశ్చిమ మేదిని పూర్ , పశ్చిమ బెంగాల్

సి) మహారాష్ట్ర డి) మధ్యప్రదేశ్

70) విరల్ V. ఆచార్య, RBIలో ఏ పదవిలో ఇటీవల చేరారు?

ఎ) చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్


బి) డిప్యూటీ గవర్నర్

సి) డైరెక్టర్ డి) వైస్ ప్రెసిడెంట్

## జవాబులు (ఫిబ్రవరి - 2017)

| | | | |
|---|---|---|---|
| 1–డి | 19–ఎ | 37–డి | 55–బి |
| 2–డి | 20–డి | 38–ఎ | 56–బి |
| 3–బి | 21–డి | 39–బి | 57–బి |
| 4–డి | 22–డి | 40–బి | 58–బి |
| 5–డి | 23–బి | 41–డి | 59–బి |
| 6–బి | 24–ఎ | 42–డి | 60–బి |
| 7–బి | 25–బి | 43–ఎ | 61–బి |
| 8–ఎ | 26–డి | 44–డి | 62–బి |
| 9–ఎ | 27–ఎ | 45–బి | 63–బి |
| 10–ఎ | 28–డి | 46–బి | 64–ఎ |
| 11–డి | 29–డి | 47–బి | 65–డి |
| 12–డి | 30–బి | 48–డి | 66–డి |
| 13–డి | 31–ఎ | 49–డి | 67–బి |
| 14–బి | 32–డి | 50–ఎ | 68–డి |
| 15–ఎ | 33–ఎ | 51–డి | 69–బి |
| 16–ఎ | 34–డి | 52–బి | 70–బి |
| 17–డి | 35–ఎ | 53–ఎ | |
| 18–బి | 36–ఎ | 54–బి | |

### పన్ను ఎగవేతదారులపై ఉపగ్రహ వేట:




బెంగుళూరు మహానగరపాలకసంస్థ భారతీయ అంతరిక్షపరిశోధన సంస్థ సహకారంతో ఉపగ్రహ అనుసంధాన ఆస్తిపన్ను సమాచార వ్యవస్థ (GEOSPATIAL ENABLED PROPERTY TAX INFORMATION SYSTEM-GEPTIS) నొకదానిని అభివృద్ధి చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా మనం ఎంత పన్నును ప్రభుత్వానికి చెల్లించిందీ, లేదా మన పొరుగువారు ఎంతమేర పన్ను చెల్లింపులో ప్రభుత్వ నిబంధనలను పాటించారు. వంటి వివరాలను తెలుసుకోవచ్చు. ఈ సౌకర్యం త్వరలోనే బెంగుళూరు వానులకు అందుబాటులోనికి రానున్నది. గుర్తించిన ఆస్తి ఆకుపచ్చ రంగులో ఉంటే, సదరు స్వంతదారు 2009-10 నుండి పన్నులను పూర్తిగా చెల్లించినట్లు. లేతగులాబి రంగులో ఉంటే, కనీసం ఒక సంవత్సరమైనా బాకీ ఉన్నట్లు. ముదురు గులాబీ రంగులో ఉంటే, చాలా సంవత్సరాలు పన్ను చెల్లించనట్లు. పౌరులు తమ ఇంటి మంచినీటి కనెక్షన్ కోసంగానీ, మరే ఇతర అవసరంకోసం రోడ్డు తవ్వాల్సివస్తే, లేదా ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు విద్యుత్ దహనవాటికను బుక్ చేసుకోవాలన్నా, ఇటువంటి ఇతర పౌరసేవలకు ఈ GEPTIS ద్వారా ప్రభుత్వ అనుమతి పొందవచ్చు.

### సాంకేతికతా వ్యసనం:

సమాచార సాంకేతిక పరిజ్ఞానము అభివృద్ధిచెందిన నేటి కాలంలో చరవాణి, అంతర్జాలం వంటి అంశాలకు చాలామంది బానిసలవుతున్నారు. అత్యధిక సమయం వాటితో గడపడంలో వ్యసనపరులవుతున్నారు. దీనితో విలువైన సమయం వృధాకావడమే కాక, శరీర కదలికలు లేక ప్రజలు అనారోగ్యాల పాలబడుతున్నారు. ఈ అవస్థను




ఆధునిక సాంకేతిక పదజాలంలో Digital Burnout అంటారు. ఈ Digital Burnout వల్ల, నిరంతర అస్తవ్యస్తత (అంటే ఏ పనిమీదా దృష్టి కేంద్రీకరించలేని విసుగు), తక్కువ ఉత్పాదకత, భావాలను నియంత్రించ లేక పోవడం వంటి లక్షణాలు పొడసూపుతాయి. యదార్థప్రపంచానికీ, కాల్పనిక ప్రపంచానికీ మధ్యనుండే వ్యత్యాసాన్ని గుర్తించలేకపోతారు. రోజులో కేవలం కొద్దిసేపే, అంతర్జాలంలో పనిచేయడం, ఒకేసారి అనేకపనులను చేసే మల్టీ టాస్కింగ్ అలవాటును మార్చుకోవడం, కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లల, ఫేస్ బుక్ వంటి అంతర్జాల మాధ్యమాల వినియోగాన్ని నియంత్రింటడం, కంప్యూటర్ ముందుకాకుండా, ఆరుబయట ఎక్కువ కార్యకలాపాలు చేసేవిధంగా పిల్లలకు అలవాటు చేయడం వంటివి ఈ వ్యసనానికి పరిష్కారాలు.

### నగదు రహిత పథకం, "భీం":

BHIM
Bharat Interface for Money by NPCI

నగదు రహిత లావాదేవీలకోసం ఇప్పటికే అనేక పథకాలు, మార్గాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. Bhaarat Interface for Money, BHIM గా పిలిచే ఈ ప్రభుత్వ అప్లికేషన్, కేంద్ర ప్రభుత్వంవారి UPIతో అనుసంధానించబడి ఉంటుంది. ఇప్పటికే అందుబాటులోనున్న అన్ని అప్లికేషన్ల కన్నా, దీనిని వినియోగించడం అతి సులభం. ఎటువంటి దరఖాస్తులు నింపడం, లేదా కొత్తఖాతాలను చేర్చిన తర్వాత 24 గంటలు వేచి ఉండటం వంటి జంఝాటాలేమీ దీనిలో ఉండవు. ఒకసారి మన బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసిన తర్వాత, ఇతర బ్యాంకు ఖాతాలలో డబ్బులు వేయడం, వారి అనుమతితో డబ్బులు తీయడం ఇక చిటికెలో పని. ముందుగా ఈ అప్లికేషన్ కేవలం ఐ-ఫోన్లు, స్మార్ట్ ఫోన్లకుమాత్రమే అందుబాటులో ఉన్నది. ఆధార్ నెంబర్ సహాయంతో చేసే చెల్లింపులను కూడ ఈ అప్లికేషన్ ద్వారా చేయవచ్చు. వేలిముద్ర ద్వారాకూడ చెల్లింపులు చేయవచ్చు. ఒకసారి రూ. 20,000/-ల వరకూ లావాదేవీలు జరపవచ్చు.


### డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా:




దేశంలో పారిశ్రామిక డేటా భద్రతకోసం డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా DSCIను నాస్కామ్ ప్రారంభించింది. అత్యంత భద్రతతో కూడిన అంతర్జాల లావాదేవీలకు ఈ సంస్థ తన సభ్యులకు హామీనిస్తుంది. జాతీయ ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థలు, ఐ.టి. సంస్థలతో సహా, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య నియంత్రణా సంఘాలు, వాణిజ్య సంఘాలు మొదలైన సంస్థలన్నీ దీనిలో సభ్యులుగా ఉంటాయి. ఈ భద్రతాచర్యలను భవిష్యత్తులో మరింత మెరుగుపరచడానికి అవసరమైన శిక్షణ, అధ్యయనం, ప్రమాణపత్రాల జారీ వంటి

కార్యక్రమాలను నిర్వహిస్తుంటుంది. ఉన్నత ప్రమాణాలతో కార్యక్రమాలను నిర్వహించే సంస్థలకు అవార్డులను అందజేస్తుంటుంది.

**డిజి ధన్-వ్యాపార్ యోజన:**




డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహానికి వ్యక్తులకు ప్రోత్సాహకాలను ప్రకటించినట్లే, వ్యాపారులకు కూడ, ఒక "డిజి వ్యాపార్ యోజన" పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. డిజిటల్ లావాదేవీలు అధికంగా జరిపినవారు ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఏప్రిల్ 14, 2017 వరకు ప్రతివారం, ఆతరువాత ఒక మెగా డ్రాను తీస్తారు. దేశవ్యాప్తంగా మొత్తం 100 నగరాలలో ఈ డ్రాలను తీస్తారు. డ్రాలతో పాటుగా ప్రజలలో అవగాహనను పెంపొందించడానికి డిజి మేళాలను కూడ నిర్వహిస్తారు. జాతీయ చెల్లింపుల సంస్థ (NATIONAL PAYMENTS CORPORATION OF INDIA - NPCI) నిర్వహించే ఈ కార్యక్రమంలో రూపే కార్డులు, USSD, UPI మరియు, AEPS ల ద్వారా లావాదేవీలు నిర్వహించిన వారు దీనిలో పాల్గొనవచ్చు. ఏప్రిల్ 14, 2017న నిర్వహించే మెగా డ్రాలో ఒక కోటి, 50 లక్షలు, 25 లక్షల రూపాయల బహుమతులు వ్యక్తులకు, వరుసగా రూ. 50 లక్షలు, 25 లక్షలు, ఐదు లక్షలరూపాయల బహుమతులు వ్యాపారులకు ఉంటాయని నీతి ఆయోగ్ ముఖ్యకార్యనిర్వహణాధికారి అమితాబ్ కాంత్ తెలియచేశారు.

**కార్మికులకు నగదురహిత చెల్లింపులు:**

ఇకపై దేశంలోని కార్మికులకు వేతనాలు, ఇతర చెల్లింపులను డిజిటల్ రూపంలోనే చెల్లించాలని నిర్దేశిస్తూ, ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనాలు ఖచ్చితంగా




ఏమేరకు అమలవుతున్నాయో పరిశీలించడం దీనివల్ల సాధ్యపడుతుంది. ఇంతవరకు రూ. 18,000/-ల కన్నా తక్కువ వేతనం పొందుతున్నవారికి కూడ ఈ నిబంధన వర్తిస్తుంది. ఈ మేరకు కనీసవేతనాలచట్టం సెక్షన్ 6ను సవరించనున్నారు. జనధన యోజన పథకంద్వారా ఈ చెల్లింపులు మరింత సులభతరం అవుతాయి.

**డిజిటల్ ఇండియా గడువు మార్చి 17:**

డిజిటల్ ఇండియా కార్యక్రమం క్రింద అమలవుతున్నవివిధ పథకాలకు కేంద్రం మార్చి నెలను గడువుగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రజలను నగదురహిత లావాదేవీలకు మళ్ళించడానికి ఉద్దేశించినవి ఈ కార్యక్రమాలు. ఈ లక్ష్యానికి మద్దతుగా డిజిసేవక్ కార్యక్రమాన్ని మార్చినాటికి ప్రభుత్వం ప్రారంభించనున్నది. అదేవిధంగా బహుళ లక్ష్యవేదిక "ఉమంగ్" (Unified Mobile Application for New Age Governance) కూడ మార్చినాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

**ఇకపై 'ఈ-బ్యాలెట్' విధానం:**



క్లిష్ట ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సైనిక సోదరులకోసం ఎలక్షన్ కమీషన్, 'ఈ-బ్యాలెట్' విధానాన్ని ప్రారంభించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికలసంఘం చేసిన సూచనను, కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఆమోదించింది. ప్రస్తుతం జరుగుతున్న ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో, ఈ విధానాన్ని, ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం, రక్షణ మంత్రిత్వశాఖవారి సహకారంతో ఈమేరకు, ఓటర్లజాబితాను రూపొందిస్తున్నది. అంతేకాదు, ఇకపై ఓటర్ల నమోదు కూడ ఫేస్‌బుక్ ద్వారా జరుగనున్నది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్, పంజాబ్‌లలో ఈ విధానం అమలవుతున్నది. త్వరలో సామాజికమాధ్యమాలలో, ఓటర్ల సేవ పోర్టల్ కూడ ప్రారంభంకానున్నది.

**గనులపై ఉపగ్రహ నిఘా:**




అక్రమంగా గనులు తవ్వేవారిపై ఉపగ్రహం ద్వారా నిఘా మొదలైంది. కేంద్ర గనుల మంత్రిత్వశాఖ ఇందుకోసం, Mining Surveillance System (MSS) విధానాన్ని ప్రారంభించింది. దేశంలోపలేకాక, చుట్టుపక్కలకూడ ఈ నిఘా ఉంటుంది. గనులలో పనిచేసే కార్మికుల భద్రతకోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తవ్వకం జరుగుతున్న గనుల చుట్టుపక్కల 500 మీటర్ల పరిధిలో ప్రతి అంగుళాన్నీ, ఈ విధానం శోధిస్తుంది. ప్రస్తుతం దేశంలో 3,843 భారీ గనుల తవ్వకాలకు అనుమతి ఉన్నది.

■

**విశిష్ట వ్యాసం**

# ఎన్నికల్లో నల్లధనం ప్రభావానికి కళ్ళెం – పెద్ద నోట్ల రద్దు



**ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చులకు పరిమితి విధించడం జరిగింది. అయితే చిత్రంగా వ్యయపరిమితి అభ్యర్థులకే గానీ, రాజకీయ పార్టీలకు లేదు. ఇదొక చిత్రమైన పరిస్థితి. అంతే కాదు ఇలా పార్టీలకు వ్యయపరిమితి లేక పోవడం వలన అభ్యర్థులకు విధించిన పరిమితికి అర్థమే లేకుండా పోయింది. ఇప్పుడు పెద్దనోట్లపై ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నసరైన నిర్ణయం. ఎన్నికలలో ఖర్చు చేసేందుకు పెద్దనోట్ల కట్టలు కట్టిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇప్పుడు ఏమి చేయాలో, తెలియక తలలు పట్టుకుంటున్నారు.**

ఎన్నికలలో విజయం సాధించేందుకు రాజకీయ పార్టీలు చాలా పెద్ద ఎత్తున డబ్బును ఖర్చు చేస్తాయి. ఇదేమి కొత్త విషయం కాదు. చాలా కాలంగా ఇదే పరిస్థితి ఉంది. కొంచెం విజ్ఞతతో ఆలోచిస్తే, పోలింగ్ ముందు రోజు రాత్రి అభ్యర్థులు ఓటర్లకు పంచే డబ్బు, తాగించే మద్యమే ప్రజా ప్రతినిధుల గెలుపును నిర్ణయిస్తోంది అనవచ్చు. ఎన్నో ఏళ్లుగా స్వేచ్ఛాయుత ఎన్నికలను రాజకీయ పార్టీలు తాము పోగేసిన డబ్బుల మూటల్లో వేసి కుట్టేశాయి, ఇందుకు గట్టి ఆధారాలు అనేకం ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రైట్స్ (ADR) విశ్లేషణ ప్రకారం 2011లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాల శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులలో 576 మంది (అంటే మొత్తం 3,547 మందిలో 16 శాతం) కోటీశ్వరులు. అయినా, అందులో 50 శాతం మంది ఆదాయ పన్ను రిటర్న్లు దాఖలు చేయలేదు. ఈ ఐదు రాష్ట్రాలలోనే కాదు ఇతర రాష్ట్రాలలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఎన్నికలలో నాటిన అవినీతి విత్తనం పరిపాలనలో మహావృక్షంగా ఎదిగింది. ఎన్నికల ప్రచారంలో లక్షలు కోట్లు ఖర్చు పెట్టిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత వసూళ్ళను ఉద్యమంగా సాగిస్తున్నారు. ఇక్కడే, రాజకీయ – అధికార యంత్రాంగాల మధ్య అపవిత్ర సంబంధం ఏర్పడుతున్నది. ఇలా పరిపాలనలోని రెండు ప్రధాన అంగాలు ఒకదానితో ఒకటి అక్రమంగా చేతులు కలిపినప్పుడు, అవినీతి అటూ, ఇటూ అడ్డంగా, నిలువుగా, అష్ట దిక్కులకూ వ్యాపిస్తోంది. అన్నిరంగాలలోకి విస్తరిస్తోంది. పోలీసు కానిస్టేబుల్, పట్వారీని ఇదేమిటని అడిగితే, "ఉపర్ తక్ దేనా" (పై వరకు ఇవ్వాలి) అన్న పడికట్టు సమాధానం వస్తోంది.

అలాగని రాజకీయ నాయకులు సంతోషంగా ఎన్నికలలో పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నారని అనుకోవలసిన అవసరమూ లేదు. వాళ్ళు కూడా ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. అయితే, ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా చర్చలు, చర్యలు లోపించడంతో వారి ఆందోళన మాటలకే పరిమితం అవుతోంది. ఈ విషయంపై పార్లమెంట్లో చర్చ జరిగింది. కమిటీలు వేశారు. నివేదికలు వచ్చాయి. సమస్యకు


**ఎస్. వై. ఖురేషి,** కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి, న్యూ ఢిల్లీ.
E-mail: syquraishi@gmail.com

ఏకైక పరిష్కారం(స్టేట్ ఫండింగ్) ప్రభుత్వమే ఎన్నికలకు నిధులను సమకూర్చడం అనే నిర్ణయానికి వచ్చారు. ఈ కమిటీ లన్నింటిలోకి 1999లో ఇంద్రజిత్ గుప్తా సారథ్యంలో ఏర్పడిన కమిటీ అత్యంత ప్రధానమైనది. ఈ కమిటీ లో మన్మోహన్ సింగ్, సోమనాథ్ చటర్జీ లాంటి ఉద్దండులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటి ఎన్నికల నిధులను పాక్షికంగా ప్రభుత్వం సమకూర్చాలని సూచించింది. అందుకూ ఓ షరతు విధించింది. రాజకీయ పార్టీలలో నిజమైన అంతర్గత ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే ఆ పార్టీలకు మాత్రమే ప్రభుత్వం పాక్షికంగా ఎన్నికల నిధులను సమకూర్చాలని పేర్కొంది. అయితే, ఈ సూచనను పరిశీలించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రాలేదు.

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఓటర్లకు డబ్బును ఎరవేయడం పట్ల భారత ఎన్నికల సంఘం తీవ్రంగా ఆందోళన చెందుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, తొలి ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనే నేను కమిషన్ ముందున్న రెండు సవాళ్ళను ప్రస్తావించాను. అందులో మొదటిది ఎన్నికల్లో ధన ప్రభావం/ దుర్వినియోగం, రెండవది ఓటుహక్కు వినియోగించుకోవడంలో ఓటర్లు చూపే అశ్రద్ధ, నిర్లక్ష్యం. ఈ రెండు సమస్యల పరిష్కారానికి రెండు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రెండు విభాగాలు కూడా గణనీయ స్థాయిలో విజయాన్ని సాధించాయి. అంతకు ముందెన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం పెరిగింది. అలాగే, ఎన్నికల సమయంలో కోట్లాది రూపాయల నగదును, మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం కూడా జరిగింది. అలాగే ఎన్నికల సంఘం పోషించిన క్రియాశీల పాత్ర కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. జార్ఖండ్లో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నిక రద్దయింది. దీనితో పాటుగా ఎన్నికల సంఘం వోటుకు నోటు అనర్థాల విషయంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మరో వంక 2011 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 25న నిర్వహిస్తున్న ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్ద ఓటరు నమోదు కార్యక్రమంగా చరిత్ర సృష్టించింది. అలాగే ఈ సందర్భంగా, ప్రజలు ముఖ్యంగా యువత ఓటు హక్కు వినియోగంలో నైతిక విలువలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఇంతవరకు 140 మిలియన్ల మంది ఈ ప్రతిజ్ఞ తీసుకున్నారు.

ఎన్నికల నియమావళి ఉచ్చునుంచి తప్పించుకునేందుకు, అభ్యర్థులు ఎన్నికల ఖర్చు లెక్కలను తప్పుగా చూపేందుకు చేసే ప్రయత్నాలకు, ఓటరు చైతన్య విభాగం, మీడియా, పౌర సమాజం అందించిన సహకారంతో ఎన్నికల సంఘం కళ్ళెం వేసింది. పాత ఎత్తుగడలు ఇప్పుడు అంతగా సాగడం లేదు. అయినప్పటికీ, ఇంకా ఈ నాటికీ ఎన్నికలలో నల్లధనం ప్రభావం చూపుతూనే ఉంది. ఇదొక విషాదం. నిజానికి ఎన్నికలలో డబ్బు ఖర్చు లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు. అయితే అదే సమయంలో ఎన్నికల ప్రక్రియలో ధన ప్రభావమే ప్రధానం కావడం, ధనికులు మాత్రమే ఎన్నికలో పోటీ చేయగలిగే పరిస్థితి రావడం మాత్రం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. అందుకే, ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చులకు పరిమితి విధించడం జరిగింది. అయితే చిత్రంగా వ్యయపరిమితి అభ్యర్థులకే గానీ, రాజకీయ పార్టీలకు లేదు. ఇదొక చిత్రమైన పరిస్థితి. అంతే కాదు ఇలా పార్టీలకు వ్యయపరిమితి లేక పోవడం వలన అభ్యర్థులకు విధించిన పరిమితికి అర్థమే లేకుండా పోయింది. ఆర్థిక క్రమశిక్షణా రాహిత్య పరిస్థితులను సృష్టించింది. ప్రత్యర్థులను చిత్తు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు 2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి, రూ.30,000 కోట్లు ఖర్చు చేశాయి.

ఇంతింత సొమ్ము రాజకీయ పార్టీలకు ఎక్కడ నుంచి వస్తుంది? రాజకీయ పార్టీలకు ప్రధాన ఆదాయ వనరులు, కార్పొరేట్ సంస్థలు ఇచ్చే విరాళాలు, చిన్న చిన్న మొత్తాల్లో వచ్చే చందాలు, సభ్యత్వ రుసుము, ఇవి కాక, డిపాజిట్లపై వచ్చే వడ్డీలు, అద్దెలు, రెవెన్యూ ఆదాయాలు మొదలైనవి ఉంటాయి. అయితే, రాజకీయ పార్టీలకు అందే విరాళాలకు సంబంధించి, అవి ఎక్కడ నుంచి వచ్చాయి అనే విషయంలో ఎక్కడా పారదర్శకత అన్నది మచ్చుకైనా కనిపించదు. ఇంచుమించుగా అన్ని రాజకీయ పార్టీలు, 75 నుంచి 80 శాతం నిధులకు లెక్కలు చూపవు. ఇదొక తీవ్రమయిన సమస్య, ఇది విదేశాల నుంచి వచ్చిన సొమ్మే కావచ్చు, కాదంటే నేర ప్రపంచం, డ్రగ్ లేదా రియల్ ఎస్టేట్ మాఫియా నుంచి అందిన అక్రమ డబ్బే కావచ్చును.

మన ఎన్నికలలో నోటుకు ఓటు అనేది ఒక నిరంతర ప్రక్రియలా సాగుతోందని, వికీలీక్స్ విడుదల చేసిన అమెరికా రహస్య పత్రాలు తెలిపాయి. తమిళనాడులో 2009 లో జరిగిన ఒక ఉపఎన్నికలో, ఒక్కొక్క ఓటరుకు రూ 5000 చొప్పున పంచినట్లు అప్పటి కేంద్ర మంత్రి సన్నిహిత సహచరుడు చెప్పిన విషయాన్ని ఈ పత్రాలు వెల్లడించాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన అనతరం సదరు నాయకుడు, చాలా

చాలా ఆనందంగా తన ఫార్ములా విజయానికి ఇక ఎదురు లేదని ప్రకటించారు. ఈ దుర్మార్గమైన 'తిరుమంగల ఫార్ములా' ఎన్నికల సంఘం ముందు చాలా పెద్ద సవాలుగా నిలిచింది. ఎన్నికల సంఘం 2014 ఎన్నికల సందర్భంగా, రూ. 300 కోట్లు లెక్కచూపని రొక్కాన్ని జప్తు చేసింది. దేశ వ్యాప్తంగా 2014 ఎన్నికల తదుపరి జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలలో అంతకు ముందు ఎన్నడు లేని అత్యధిక మొత్తంలో నగదును ఎన్నికల సంఘం అధికారులు జప్తు చేశారు. ఉదాహరణకు, బీహార్ విషయాన్నే తీసుకుంటే, 2015లో జరిగన రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో అత్యధిక మొత్తంలో, రూ.19 కోట్ల రూపాయలని ఎన్నికల సంఘం నిఘా విభాగం జప్తు చేసింది. తమిళనాడులో ఏకంగా రూ.100 కోట్లు పట్టుబడ్డాయి.

రాజకీయ నాయకులందరూ అవినీతి పరులే.. ఇదీ ఇప్పుడు సామాన్య ప్రజల అభిప్రాయం. రాజకీయ నాయకుల పట్ల ప్రజలకు ఇలాంటి అభిప్రాయం ఉండడం, ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఎందుకంటే, రాజకీయ నాయకులలోనూ, నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలిచే నాయకులు మన దేశంలో ఎందరో ఉన్నారు. నిజానికి మన దేశం ఈనాటికి ప్రబల శక్తిగా ఎదిగిందంటే అందుకు ఒకప్పటి మన నాయకుల నిస్వార్ధ కృషే కారణం. చాలా పెద్ద మొత్తంలో, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో పోగు పడిన నల్లధనమే, 2008లో ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్ధిక మాద్యం నుంచి మన దేశాన్ని రక్షించింది అని కొందరు తరుచూ అంటుంటారు. కానీ, ఎన్నికలలో ధన ప్రభావం వలన అలాంటి గుడ్డిలో మెల్ల లాంటి ప్రయోజనం కూడా ఏనాడు లేదు.

ఈ నేపధ్యంలో రూ. 500 రూ.1000 కరెన్సీ నోట్లను రద్దు చేస్తూ ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నసరైన నిర్ణయం. ఐదు రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరగనున్న సమయంలో తీసుకున్న ఈ నిర్ణయం, ఎన్నికలలో ధన ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఎన్నికలలో ఖర్చు చేసేందుకు పెద్దనోట్ల కట్టలు కట్టిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇప్పుడు ఏమి చేయాలో, తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికలపై పెద్ద నోట్ల రద్దు ప్రభావం చాలా గణనీయంగా ఉంటుందనేనిది నా వ్యక్తి గత అభిప్రాయం. సహజంగా ఎన్నికల సమయంలో నల్ల డబ్బు బయటకు వస్తుంది. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది, అదే విధంగా సరిహద్దుల అవలనుంచి వచ్చే నకిలి నోట్ల ప్రవాహానికి కూడా అడ్డుకట్ట పడింది కాబట్టి, ఎన్నికల పై ధన ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది. గతంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత పోలింగ్ తేదీకి దగ్గరలో వేరు వేరు ప్రాంతాలకు డబ్బు కట్టలు చేరవేసేవారు. అయితే ఎన్నికల సంఘం దాడులు ముమ్మరంచేసిన తర్వాత డబ్బు పంపిణి తేదీని పైకి జరిపారు. దీంతో ఎన్నికలకు కొద్ది వారాల ముందు తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో ధన ప్రభావంపై గట్టి ప్రభావం చూపుతుంది.

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఒకటి రెండు కాదు 40 మార్గాలలో డబ్బు పంపిణి చేస్తారు. నేను 'యాన్ అన్ డాక్యుమెంటెడ్ వండర్ – ది మేకింగ్ అఫ్ గ్రేట్ ఇండియన్ ఎలక్షన్స్' అనే పుస్తకంలో ఈ 40 పద్దతులను సవివరంగా వివరించాను. అలాగే ఇప్పుడు మారిన పరిస్థితులలో కొత్త పద్దతులు కనిపెడతారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అందుకు మరికొంత సమయం పడుతుంది. ఆ విధంగా ప్రస్తుత ఎన్నికలలో అక్రమ ధన ప్రభావం ఉండదు.

పెద్ద నోట్ల రద్దు ప్రయోజనాలను మదింపు చేసే సమయంలో ఎన్నికల నిర్వహణ పాఠాలు, గుణపాఠాలను కూడా పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం ఉంది. ప్రధాన మంత్రి పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ప్రకటించిన రెండు రోజుల తర్వాత ఒక పత్రికలో నేను రాసిన వ్యాసంలో, ఈ నిర్ణయం బ్యాంకు అధికారుల సహకారంతో అక్రమ మార్గాల్లో నగదు అక్రమ రవాణా (మనీ లాండరింగ్) కు దారితీస్తుందనే భయాన్ని వ్యక్త వ్యక్తపరిచాను. నా భయం నిజమని తేలింది. అలాగే, నాకున్న అనుభవంతో, దళారీలు బ్యాంకు అధికారులు చేతులు కలిపి చేసే అక్రమాలపై ప్రభుత్వం కన్నేసి ఉంచాలని సూచించాను. ఒక సందర్భంలో, ఎన్నికల సంఘం వ్యయ నియంత్రణ నిఘా బృందం, రూ. 2 కోట్లు తీసుకుపోతున్న వాహనాన్ని ఆపింది. అయితే ఏటీఎంలను నింపేందుకు ఆ డబ్బును తీసుకు పోతున్నామని వాహనంలోని వారు చెప్పడంతో మా అధికారులు క్షమాపణలు చెప్పి మరీ వాహనాన్ని వదిలేశారు. అయితే ఆ మర్నాడు అంతకు రెట్టింపు సొమ్ముతో మరో వాహనాన్ని మరో బృందం పట్టుకున్నప్పుడు కూడా అందులోని వారు అదే కారణం చెప్పారు. మూడో వాహనం రూ. 11 కోట్లతో పట్టుబడింది. ఇక అప్పుడు విచారణ జరపాలని నిర్ణయించి చూస్తే, అసలు భాగోతం బయట పడింది. ఆ వాహనంలో ఉండవలసిన సాయుధ గార్డ్ లేడు, అలాగే ఇతర భద్రత జాగ్రతలు కనిపించలేదు. ఆ వెంటనే నేను రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా గవర్నర్ డి. సుబ్బారావుతో మాట్లాడితే ఆయన విచారణకు ఆదేశించారు.

తమిళనాడు శాసన సభకు 2016 మే నెలలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల సంఘం, అపరిమితంగా నల్ల డబ్బు ఖర్చును గుర్తించి, అరవకురిచి, తంజావూర్ శాసన

సభ స్థానాల్లో ఎన్నికలను రద్దు చేసింది. ఆ సమయంలో ఎన్నికల సంఘం నల్ల డబ్బు వినియోగానికి సంబంధించి నిర్దిష్ట సమాచారం ఉన్న సమయాల్లో ఎన్నికలను రద్దు చేసే అధికారం శాశ్వతంగా ఎన్నికల సంఘానికి ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసింది. కేంద్ర న్యాయ శాఖ ఈ ప్రతిపాదనను తిరస్కరించినా, నల్ల ధన వ్యతిరేక పోరాటం ప్రారంభించిన ప్రధాన మంత్రి ఈ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకుంటారని నేను ఆశిస్తున్నాను.

కనీసం ప్రస్తుత ఎన్నికలపై పెద్ద నోట్ల రద్దు ప్రభావం తప్పక ఉంటుందని బీజేపీ ఆర్థిక వ్యవహారాల విభాగం అధ్యక్షుడు గోపాల కృష్ణ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలకు వచ్చే నిధులు ఆగిపోతాయని అయన అన్నారు. "ఇంతవరకు, రాజకీయ పార్టీల పై ఎన్నికల ఖర్చుల లెక్కలు చెప్పాలనే వత్తిళ్ళు ఉన్నాయి. అయితే నల్లధనం చలామణీలో ఉండడం వలన నియంత్రణ అమలులో నీరు గారి పోయింది. ఇప్పడు నిధుల రాక ఆగిపోవడంతో ఎన్నికల వ్యయం కూడా గణనీయంగా తగ్గుతుంది" అని గోపాల కృష్ణ అన్నారు. అయితే, ఈ ఆలోచనలు నిజం కావాలంటే, ఎంతో కాలంగా అమలుకు నోచుకోని ఎన్నికల సంస్కరణల అమలుకు మరిన్నిచర్యలు తక్షణం తీసుకోవలసిన అవసరం ఉంది. అసోసియేషన్ అఫ్ డెమోక్రాటిక్ రైట్స్ కు చెందిన డాక్టర్. అలోక్ చంద్, పెద్ద నోట్ల రద్దు వలన రాజకీయ పార్టీలకు వచ్చే నిధులు తగ్గి, ఎన్నికల వ్యయంలో డబ్బు పంపిణీ తగ్గిపోయినా, రాజకీయ పార్టీలు ఆ లోటును భర్తీ చేసేందుకు, ప్రభుత్వ ఖజానాకు భారంగా మారే ఉచిత వరాలను ప్రకటించే ప్రమాదం ఉంటుందని అన్నారు. ''ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఆ ఆదేశాలను జాగ్రత్తగా అమలు చేయవలసి ఉంది" అని అయన అన్నారు.

పెద్ద నోట్ల రద్దు నిర్ణయం వెనక ఉన్న లక్ష్యాలలో ఎన్నికల సంస్కరణలు లేకపోయినా, ఎన్నికల సంస్కరణలపై ఆ ప్రభావం తప్పక ఉంటుంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత, ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ఈ-బ్యాంకింగ్, ఈ-వాలెట్‌కు విశేష ప్రచారం కలిపి స్తున్నాయి. ఇప్పడు ఈ మాటలు అందరి నోటా వినిపిస్తున్నాయి. నల్లధనం నిర్మూలనలో ఇది మరో సానుకూల పరిణామం. ఇలా, రిక్షా కార్మికులు, కూరగాయల వర్తకులు సైతం నగదు లావాదేవీలకు స్వస్తి చెబితే బ్యాంకింగ్ వ్యవస్థ బలపడుతుంది. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది.

అయితే, దీనితోపాటుగా రాజకీయ పార్టీలకు ఇచ్చే రూ. 20,000 లోపు విరాళాలను నగదు రూపంలో చెల్లించేందుకు గల మినహాయింపును కూడా తొలగించాలన్న డిమాండ్ వినవస్తోంది. అదే జరిగితే, రాజకీయ పార్టీలకు నగదు రూపంలో అందే 80 శాతం విరాళాల విషయంలోనూ పారదర్శకత ఏర్పడుతుంది. ఈ మొత్తం సంవత్సరానికి ఇంచు మించుగా రూ. 1000 కోట్ల వరకు ఉంటుంది. ప్రధానమంత్రి తమ పార్టీ ప్రజాప్రతినిధులు అందరూ, నవంబర్ 8 నుంచి జరిపిన బ్యాంకు లావాదేవీలను బహిర్గతం చేయాలని ఆదేశించడం, మరో మంచి పరిమాణం. నోట్ల రద్దుకు సంబంధించి చాలా ప్రశ్నలు తలెత్తాయి. అయితే, ఈ అన్ని ప్రశ్నలకు ఒకటే సమాధానం, కేవలం విమర్శలు చేసేకంటే, ప్రధాన మంత్రికి మంచి సలహాలు ఇవ్వడం మంచిది. రాజకీయ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు వచ్చేందుకు జరిగిన తొలి ప్రయత్నాన్ని, ఎందుకు స్వాగతించ రాదు?

అలాగే ప్రభుత్వం తీసుకున్న మరో మంచి నిర్ణయం, బినామీ ఆస్తుల నిరోధ చట్టం తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం. ఈ చట్టం కూడా ఎన్నికలలో నల్ల ధనం ప్రభావాన్ని కట్టడి చేస్తుంది. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ నగదు రహిత లావాదేవీల వైపు పయనిస్తోంది. ఇది ఒక విధంగా స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అనుకూలించే 'అదృశ్య శక్తి, 'అగుపించని అదృష్టం' అని చెప్పవచ్చును. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఎన్నికల సంస్కరణల అమలుకు సమయం ఆసన్నమైందనే నేను భావిస్తున్నాను.

■


## యోజన చందా ఆన్-లైన్‌లో

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Divistion వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

*సీనియర్ ఎడిటర్*

# డిజిటల్ బాటలో గ్రామీణ ఆర్థిక రంగం



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనివారికి చెల్లింపులన్నీ నగదురహితంగానే జరుగుతున్నాయి. వారందరి వేతనాలు బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఇప్పటివరకు 25 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు 32 వేల కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యాయి. ఇప్పటివరకు నగదురహిత లావాదేవీల విషయంలో జరిగిన పురోగతిని పరిశీలిస్తే గ్రామీణ భారతాన్ని నగదురహిత ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా మంచి ప్రారంభం జరిగిందని చెప్పవచ్చు.

ప్రధాని నరేంద్రమోదీ గత ఏడాది నవంబర్‌లో 500, 1000 రూపాయల నోట్ల రద్దును ప్రకటించిన సమయంలో "ఈ కరెన్సీ మార్పిడి ప్రక్రియ ఆర్థిక రంగాన్ని పూర్తిగా నగదురహిత లావాదేవీల బాటలో నడిపించకపోయినా ఆ దిశగా అడుగులు వేయిస్తుంది" అన్నారు. దేశంలో పెద్ద నోట్లను రద్దు చేసి రెండు నెలలు దాటిన తర్వాత ఇప్పటి పరిస్థితిని సమీక్షిస్తే దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల నగదురహిత లావాదేవీల దిశగా భారీ పరివర్తన చోటు చేసుకుంటున్నట్టు అవగతం అవుతుంది. గ్రామీణుల్లో ఆధార్‌తో అనుసంధానమైన చెల్లింపుల వ్యవస్థ, నేషనల్ యూనిఫైడ్ యుఎస్ఎస్‌డి (అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డేటా), పాయింట్ ఆఫ్ సేల్స్ (పిఒఎస్) పరికరాలతో అనుసంధానమైన డెబిట్, క్రెడిట్ కార్డులు, మొబైల్ యాప్‌ల ఆధారిత ఈ-వ్యాలెట్ల ద్వారా చెల్లింపులు చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ ఇజిఏ) కింద ఉపాధి పొందుతున్న వారి వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. ప్రైవేటు, సహకార రంగంలోని డెయిరీలకు పాల ఉత్పత్తిదారులు సరఫరా చేస్తున్న పాలకు చేయాల్సిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమచేయడం, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద జారీ చేసిన రుపే కార్డుల ద్వారానే ఆయా ఖాతాదారులు చెల్లింపులు చేసేలా చూడడం వంటి నగదురహిత ఆర్థిక కార్యకలాపాలనే గ్రామీణ ప్రజలు అనుసరించేలా చూడడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీక రించింది. జన్‌ధన్ యోజన కింద ఇప్పటి వరకు 26.5 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరిచారు. ప్రతి జన్‌ధన్ ఖాతాదారుకు ఒక రుపేకార్డును ఇవ్వనున్నట్టు జన్‌ధన్ యోజన కార్యక్రమం హామీ ఇచ్చింది. ఆ హామీ కింద ఇప్పటికి 19.5 కోట్ల కార్డులు జారీ చేశారు. డిజిటల్ పరివర్తన దిశగా గ్రామీణ సమాజాన్ని ముందుకు నడపడంలో జన్‌ధన్ ఖాతాదారులనే పతాకధారులుగా నిలపాలన్నది ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు చెప్పారు. అందుకు తగినట్టుగానే నగదురహిత పరివర్తనలో పాడిపరిశ్రమే ముందువరుసలో నిలిచింది.

ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును

**సందీప్ దాస్,** జర్నలిస్టు, న్యూ ఢిల్లీ.
E-mail: sandipdas2005@gmail.com

ప్రకటించిన తర్వాత వివిధ వాణిజ్య విభాగాల్లో డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగినా వ్యవస్థీకృత పాడిపరిశ్రమ వెనుకబడి ఉంది. కానీ, ఆ తర్వాత సహకార, ప్రైవేటు డెయిరీలకు అనుసంధానమైన పాల వ్యాపారులు ఒక మిలియన్‌కు (10 లక్షలు) పైగా ఖాతాలు తెరిచారు. నవంబర్ నుంచి వారు తమకు రావలసిన సొమ్మును ఆ ఖాతాల ద్వారానే అందుకుంటున్నారు. గత ఏడాది మధ్య కాలం నుంచి చూస్తే డెయిరీ వ్యవసాయదారులు తెరిచిన బ్యాంకు ఖాతాల సంఖ్య మూడు మిలియన్లు (30 లక్షలు) దాటింది. వచ్చే రెండు నెలల కాలంలో చెల్లింపులన్నీ పూర్తిగా బ్యాంకు ఖాతాల ద్వారానే జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి బోర్డు (ఎన్‌డిడిబి), ఢిల్లీ పాల స్కీమ్ నిర్వాహకులకు కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న పశుసంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోనే అతి పెద్ద పాల సమాఖ్య అయిన అమూల్‌గా అమిత ప్రసిద్ధి పొందిన గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్యకు పాలు సరఫరా చేస్తున్న మొత్తం 29 లక్షల మందికి చెల్లింపులు బ్యాంకు ఖాతాల ద్వారానే నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో బ్యాంకు ఖాతాలు తెరిపించాలని ప్రభుత్వం సూచించింది. "పెద్ద నోట్ల రద్దు ప్రకటించిన తర్వాత ఇప్పటికి మేం 8 లక్షల కొత్త ఖాతాలు తెరిపించాం, ప్రస్తుతం 19 లక్షల మందికి పైగా పాడి రైతులు మా సమాఖ్యకు విక్రయిస్తున్న పాలకు చెల్లింపులు బ్యాంకు ఖాతాల ద్వారానే అందుకుంటున్నారు" అని జిసిఎంఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఎస్.సోధి చెప్పారు. మిగిలిన రైతులందరూ బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు వీలుగా గుజరాత్‌లోని గిరిజన ప్రాంతాలన్నింటిలోనూ శాఖలు తెరవాలని తమ సమాఖ్య బ్యాంకులను కోరిందని ఆయన వెల్లడించారు. అమూల్ తాను కొనుగోలు చేస్తున్న పాలకు ప్రతి వారం రైతులకు 450 కోట్ల రూపాయల మేరకు చెల్లింపులు చేస్తూ ఉంటుంది. ఆ మొత్తంలో ప్రస్తుతం 310 కోట్ల రూపాయలు ఇప్పుడు రైతుల ఖాతాలకే బదిలీ చేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు ప్రకటించిన తర్వాత బ్యాంకు ఖాతాలకు చేస్తున్న జమలు రెట్టింపయ్యాయి. చెన్నైకి చెందిన ప్రైవేటు డెయిరీ దిగ్గజం హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రతీ పదో రోజున మూడు లక్షల మందికి పైగా పాల ఉత్పత్తిదారులకు 75 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లోనే జమ చేస్తోంది. ప్రైవేటు పాడి పారిశ్రామికుల్లో కూడా ఈ-చెల్లింపులు జోరందుకున్నాయనేందుకు ఇది సంకేతం.

పాడిపరిశ్రమలోని రైతులకు వారం లేదా పది రోజులకు ఒక సారి 120 కోట్ల రూపాయల వంతున చెల్లింపులు జరుగుతూ ఉంటాయని, దీని వల్ల భారీ పరిమాణంలో నగదు బట్వాడా జరుగుతున్నదని అధికారులంటున్నారు. దేశంలోని మొత్తం 22 సహకార పాడి పరిశ్రమాభివృద్ధి సంఘాల్లోను కోటి మంది వరకు డెయిరీ రైతులుండగా వారిలో 60 నుంచి 70 శాతం మందికి బ్యాంకు ఖాతాలున్నాయి. "గత కొద్ది నెలలుగా రాష్ట్ర స్థాయి పాడిపరిశ్రమ సమాఖ్యలను నగదురహిత లావాదేవీల దిశగా ప్రోత్సహిస్తూ వస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దుతో మా ప్రయత్నాలకు కొత్త ఉత్తేజం వచ్చింది" అని ఒక అధికారి చెప్పారు. పాలు సరఫరా చేస్తున్న రైతులందరితోనూ బ్యాంకు ఖాతాలు తెరిపించాలని ఇప్పటికే నగదు చెల్లింపులు అధికంగా చేస్తున్న జిసిఎంఎంఎఫ్, కర్ణాటక పాల ఉత్పత్తిదారుల సమాఖ్య, రాజస్థాన్ సహకార పాడి సమాఖ్య వంటి సంస్థలను పాడి పరిశ్రమలోని సహకార సంఘాల జాతీయ సంస్థ ఎన్‌డిడిబి కోరింది.

చౌకధరల దుకాణాలన్నింటిలోనూ డిజిటల్ లావాదేవీలను ఆహార మంత్రిత్వ శాఖ ప్రోత్సహిస్తోంది. దేశంలోని ఐదు లక్షలకు పైగా చౌక ధరల దుకాణాల్లో జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) లబ్ధిదారులు భారీ సబ్సిడీ ధరలకు కొనుగోలు చేసే ఆహారధాన్యాలకు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలు లేదా రుపే కార్డుల ద్వారా చెల్లింపులు చేసేందుకు ఆహార మంత్రిత్వ శాఖ తగు ఏర్పాట్లు చేసింది. "ఈ చట్టం లబ్ధిదారులు భారీ సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆహారధాన్యాలకు నెలవారీగా చెల్లించే సొమ్ము 75 రూపాయల నుంచి 90 రూపాయలే అయినప్పటికీ ఆ చిన్న మొత్తాలు కూడా నగదురూపంలో చెల్లించకుండా చూడాలని వేం భావిస్తున్నాం". అని ఆహారమంత్రిత్వ శాఖ అధికారి ఒకరు చెప్పారు. ఎన్ఎఫ్ఎస్ఏ కింద లబ్ధిదారులకు నెలకి ఐదు కిలోల బియ్యం లేదా గోధుమ కిలో మూడు రూపాయలు/రెండు రూపాయల ధరకు పొందుతున్నారు. ఇవి కాకుండా ఒడిశా, చత్తీస్‌గఢ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు మరింత సబ్సిడీని అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అయితే చౌక ధరల దుకాణాల్లో 29,082 పాయింట్స్ ఆఫ్ సేల్ (పిఓఎస్) పరికరాలు ఇప్పటికే ప్రవేశపెట్టింది. ఎన్ఎఫ్ఎస్ఏ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలతో అనుసంధానమైన పిఓఎస్ పరికరాలు ప్రవేశపెట్టింది. ''పిఓఎస్ పరికరాల సహాయంతో లబ్ధిదారులు తాము కొనుగోలు చేసిన ఆహారధాన్యాలకు నగదురహిత చెల్లింపులు చేయవచ్చు" అని ఒక అధికారి అన్నారు. దేశంలో మొత్తం 5,27,750 చౌకధరల దుకాణాలుండగా ప్రస్తుతం 33 శాతం దుకాణాలు మాత్రమే పిఓఎస్ పరికరాలు కలిగి ఉన్నాయి. ఎన్ఎఫ్ఎస్ఏ కింద జరిగే కొనుగోళ్ల లావాదేవీలన్నీ

ఎలక్ట్రానిక్‌గా రికార్డవుతున్నాయి. "ఈ పిఓఎస్ పరికరాలన్నీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయాల్సి ఉంటుందని ఒక అధికారి అన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఒడిశాలతో పాటు కర్ణాటక కూడా ఆధార్ అనుసంధానిత చెల్లింపుల విధానాన్ని ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో (పిడిఎస్) ప్రవేశపెట్టింది. ఎన్ఎఫ్ఎస్ఏ కింద భారీ సబ్సిడీ ధరలకు ఆహార ధాన్యాలు కొనుగోలు చేసే 1.08 కోట్ల మంది పేదరిక రేఖకు దిగువన నివశించే లబ్ధిదారులకు (బిపిఎల్) బయోమెట్రిక్ అధీకృత విధానంలో చెల్లింపులు చేసేందుకు 20,778 చౌకధరల దుకాణాల్లో పిఓఎస్ పరికరాలను ప్రవేశపెట్టింది. రాష్ట్రప్రభుత్వం కార్డు హోల్డర్ల జన్‌ధన్ ఖాతాలను కూడా ఆధార్‌తో అనుసంధానం చేస్తోంది. మహారాష్ట్ర ప్రభుత్వం నగదురహిత లావాదేవీల కోసం బిజినెస్ కరెస్పాండెంట్లు లేదా యుఎస్ఎస్‌డి, ఈ-వ్యాలెట్ నమూనాలో ప్రయోగాత్మక చెల్లింపుల విధానాన్ని 84 చౌకధరల దుకాణాల్లో ప్రవేశపెట్టింది. పిడిఎస్ దుకాణాలు ఇప్పుడు పిఓఎస్ పరికరాల ద్వారా లావాదేవీలు నిర్వహి స్తున్నాయి. ఎఫ్‌పిఎస్‌లు పేదరిక రేఖకు దిగువన ఉన్న ప్రజలకు రేషన్ కార్డులపై ఆహారధాన్యాలు సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న సుమారు 50 వేల పిడిఎస్ దుకాణాలన్నింటిలోనూ నగదురహిత లావాదేవీలు ప్రవేశపెట్టాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్రప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును ప్రకటించిన నాటి నుంచి ఇప్పటివరకు చేతిలో నగదు లేని కారణంగా ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఆహారధాన్యాల సరఫరాలో జాప్యం జరిగిన సంఘటన ఒక్కటి కూడా జరిగిన వార్తలు లేవు.


దేశంలోని 24 కోట్ల రేషన్ కార్డుల్లో 71 శాతం కార్డులను ఆధార్ సీడింగ్ చేసి ఆ కార్డులన్నింటినీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయడం, పిఓఎస్ పరికరాలు అమర్చడం ద్వారా నగదురహిత లావాదేవీలకు అంతా సిద్ధం చేసినట్టు ఒక అధికారి చెప్పారు. ప్రస్తుతం దేశంలో 82 కోట్ల మందికి సరఫరా చేస్తున్న 50 నుంచి 55 మిలియన్ టన్నుల బియ్యం లేదా గోధుమ ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలోకి వచ్చాయి. అన్ని రకాల అధికారిక కార్యకలాపాల్లోను నగదురహిత లావాదేవీలే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆహారం, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించింది. పంజాబ్, హర్యానా మినహా మిగతా రాష్ట్రాల నుంచి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) సేకరించే ఆహారధాన్యాలకు కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పి) ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. పంజాబ్, హర్యానాల్లో మాత్రం కమిషన్ ఏజెంట్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అలాగే వినియోగదారుల వ్యవహారాల శాఖ ఇటీవలే ముగిసిన ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన 703 కోట్ల రూపాయల విలువ గల పప్పుధాన్యాలకు చెల్లింపులను ఆయా రైతుల ఖాతాల్లో ఆన్‌లైన్‌లోనే జమ చేసింది. అన్ని రకాల కాంట్రాక్టు పనులకు చెల్లింపులు నగదురహితంగా చేయడాన్ని తప్పనిసరి చేయాలని అధికారులను మంత్రిత్వశాఖ ఆదేశించింది.

దేశంలో ప్రారంభించిన ఆర్థిక సమ్మిళిత కార్యక్రమం పుణ్యమా అని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఇజిఏ) కింద పనివారికి చెల్లింపులన్నీ నగదురహితంగానే జరుగుతున్నాయి. వారందరి వేతనాలు బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో (2016-17) ఇప్పటివరకు 25 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు 32 వేల కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యాయి. కోటి మంది ప్రజలకు డిజిటల్ చెల్లింపుల్లో చైతన్యం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. కోటి మందికి పైగా గ్రామీణ పౌరులకు డిజిటల్ చెల్లింపుల్లో శిక్షణ ఇవ్వడం వల్ల వినియోగదారులుగా వారికి అందుబాటులో ఉన్న చెల్లింపుల విధానాలు ఏమిటి, వాటిలో ఏది తమకు అనుకూలం అనే అవగాహన వారికి వస్తుంది. ఇప్పటికే 40 లక్షల మందికి పైగా గ్రామీణ పౌరులు, 1.2 లక్షల మంది వరకు వ్యాపారులు డిజిటల్ చెల్లింపులకు నమోదు చేసుకున్నారు. "ప్రజల్లో చైతన్యం కల్పించే స్థాయి నుంచి ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలను ప్రజలు క్రియాశీలంగా ఆచరించే స్థాయికి చేరుకోవడం జరిగింది. ఈ చైతన్యంలో ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ నిర్వహణలోని కామన్ సర్వీస్ సెంటర్లు ముందువరుసలో ఉన్నాయి" అని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. అయితే ఇప్పటికిప్పుడే సమాజాన్ని 'నగదురహితం'గా మార్చలేమని ప్రధాని అంగీకరించారు. అయితే 'నగదు చెల్లింపులు తక్కువ'గా జరిగే వ్యవస్థగా భారత్‌ను మార్చేందుకు తక్షణం కృషి ప్రారంభించాలని పిలుపు ఇచ్చారు. "ఈ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా పని చేస్తుంది, బ్యాంకు ఖాతాలను, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలి, వివిధ బ్యాంకుల యాప్‌లను మీ ఫోన్లపై ఎంత సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు, నగదురహితంగా వ్యాపారాలను ఎలా నిర్వహించాలి" అన్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని ప్రధాని పిలుపు ఇచ్చారు. ఇప్పటివరకు నగదురహిత లావాదేవీల విషయంలో జరిగిన పురోగతిని పరిశీలిస్తే గ్రామీణ భారతాన్ని నగదురహిత ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా మంచి ప్రారంభం జరిగిందని చెప్పవచ్చు.

■

**లెస్ క్యాష్ ఎకానమీ - వివిధ రకాల డిజిటల్ పేమెంట్ సదుపాయాలు:**

1. క్రెడిట్ మరియు డెబిట్ కార్డుతో చెల్లింపులు చేయగలరు.
2. ఫ్రీఛార్జి, ఆక్సిజన్ మొదలగు తొమ్మిది వేర్వేరు ఈ-వ్యాలెట్లతో చెల్లింపులు చేయగలరు.
3. ఆధునిక HPCL డ్రైవ్ ట్రాక్ ప్లస్ వ్యవస్థతో చెల్లింపులు చేయగలరు.



# స్వల్ప నగదు ఆర్థిక వ్యవస్థ - భారత్‌లో చెల్లింపులు



**దేశంలో పెద్దఎత్తున మొబైల్ టెలిఫోన్లు అందుబాటులోకి రావడంతో నగదు రహిత చెల్లింపులు చేయడానికి ప్రతిఒక్కరికీ ఒక మార్గం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బ్యాంకు ఖాతాలకంటె మొబైల్ ఫోన్లు ఎక్కువగా ఉన్నాయని తేలింది. దీనితో అన్ని పేమెంట్ వ్యవస్థలు, మొబైల్ వాలెట్లు మొబైల్ టెలిఫోన్‌లో లేదా ఇతర కంప్యూటర్ పరికరాలలో లావాదేవీలు జరపడానికి వీలుగా సాఫ్ట్‌వేర్‌లు అభివృద్ధి చేసే అవకాశం కల్పించింది.**

నగదు లేదా లీగల్ టెండర్ ప్రమేయం ఏమాత్రం లేకుండా ఒక చెల్లింపు బాధ్యతను తీర్చేందుకు ఉద్దేశించిన వ్యవస్థను చెల్లింపుల వ్యవస్థ (పేమెంట్ సిస్టం)గా వ్యవహరిస్తున్నాం. నగదు ద్వారా చెల్లింపులు జరుగుతున్నట్టయితే ఆ చెల్లింపుల ప్రక్రియను ప్రత్యేక వ్యవస్థ ద్వారా చేయాల్సిన అవసరం లేదు. అదే నగదు ప్రమేయం లేకుండా చెల్లింపుల ప్రక్రియ సజావుగా సాగాలంటే చెల్లింపులు చేసే వ్యక్తి, దానిని అందుకునే వ్యక్తి ఇరువురూ చెల్లింపుల వ్యవస్థ పరిధిలోని వారు గాని లేదా చెల్లింపుల వ్యవస్థలో పాత్ర వహించేవారు కాని కావాలి. సంప్రదాయంగా ఉపయోగించే పేపర్ ఆధారిత చెల్లింపు వ్యవస్థలో నగదు రహితంగా, అంతర్ బ్యాంకు లావాదేవీల ద్వారా డబ్బు బదలాయించే పద్ధతులలో మొట్ట మొదటిది వివిధ రూపాలలోని చెక్కు ద్వారా (ఖాతాదారు చెక్కు, డిమాండ్ డ్రాఫ్ట్, పేమెంట్ ఆర్డర్, బ్యాంకర్స్ చెక్, డివిడెండ్ వారంట్, ఇంట్రస్ట్ వారంట్, ట్రావెలర్స్ చెక్, గిఫ్ట్ చెక్, డెబిట్‌నోట్,రిఫండ్ ఆర్డర్ వంటివి) చెల్లింపులు చేయడం. బ్యాంకర్స్ చెక్ క్లియరింగ్ హౌస్ వ్యవస్థ ద్వారా చెక్కులను ప్రాసెస్ చేస్తారు. అంతర్ బ్యాంకు నగదు రహిత చెల్లింపుల వ్యవస్థలో చెక్కులను ప్రాసెస్ చేయడానికి చెక్ క్లియరింగ్ హౌస్ ఉండడం కనీస అవసరం. చెక్కుల ద్వారా నగదు రహిత బదిలీలు చేయడం మొదలైన రెండు శతాబ్దాల తర్వాత కూడా ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. బ్యాంకింగ్ రంగంలో ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులోకి రావడంతో పలు రకాలైన చెల్లింపు పద్ధతులు వచ్చాయి. అలాగే,బ్యాంకింగ్ రంగంతో సంబంధం లేని వారు అంటే టెలికం ఆపరేటర్లు, చెల్లింపుల వ్యవస్థలోకి వచ్చారు. చెక్ ప్రాసెసింగ్‌లో యాంత్రీకరణ తొలుత 1986లో ఎం.ఐ.సి.ఆర్ టెక్నాలజీ (మాగ్నటిక్ ఇంక్ క్యారక్టర్ రికగ్నిషన్)ని అందిపుచ్చుకోవడంతో ప్రారంభమైంది. రిజర్వుబ్యాంకు చొరవ, ప్రోత్సాహంతో ఆ తర్వాత బ్యాంకు కార్యకలాపాలలో కంప్యూటరైజేషన్, యాంత్రీకరణ వేగవంతమైంది.

రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) 1990 దశకంలో ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సర్వీసెస్ (ఇసిఎస్-సిఆర్)ను ప్రారంభించింది. ముందుగా దీనిని క్రెడిట్ సేవలకు ఉపయోగించారు. ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సర్వీస్ ద్వారా చెల్లింపులు చేసే వారు, బ్యాంకు ద్వారా ఎలక్ట్రానిక్ మాధ్యమం

**జి. రఘురాజ్,** రిజర్వు బ్యాంక్ అధికారి, హైదరాబాద్.
E-mail: graghuraj@idrbt.ac.in

ద్వారా చెల్లింపులు చేస్తారు. చెల్లింపులు చేసే వ్యక్తి తన ఖాతా నుంచి సొమ్మును మినహాయించి, తాను సూచించిన వారికి చెల్లించాల్సిందిగా బ్యాంకును కోరతాడు. ఇలా ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సేవలు అందుతాయి. ఇది ముఖ్యంగా టెలిఫోన్, విద్యుత్, మంచినీటి బిల్లులు, ప్రీమియం చెల్లింపుల వాడకానికి సంబంధించింది. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఇ.ఎఫ్.టి) వచ్చింది. ఎలక్ట్రానిక్ ఆదేశాల ద్వారా ఒక బ్యాంకు ఖాతాదారు మరో బ్యాంకు ఖాతాదారుకు చెల్లింపులు చేయవచ్చు. తొలుత ఇది దేశంలోని 15 ప్రధాన నగరాలలో మాత్రమే అందుబాటులో ఉంటూ వచ్చింది. 2004 తర్వాత ఇది ఎన్.ఇ.ఎఫ్.టి (నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్)గా రూపుదిద్దుకుంది. బ్యాంకుకు చెందిన అన్ని శాఖలు, ఔట్‌లెట్‌ల అకౌంటింగ్‌ను కేంద్రీకృతం చేసే కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ దిశగా బ్యాంకులు మార్పు చెందడంతో మరిన్ని ఆన్‌లైన్ సదుపాయాలు కల్పించే అవకాశం బ్యాంకులకు దక్కింది. కార్డు ఆధారిత లావాదేవీలు, ఎక్కడైనా చెల్లింపులు చేయడానికి వీలు కల్పించే కొత్త అవకాశాలను విస్తృతం చేశాయి. అన్ని బ్యాంకులకు ఏటిఎం సదుపాయం కల్పించి వాటిని అనుసంధానం చేయడం, దేశంలోని ఏ ఎ.టి.ఎం నుంచైనా నగదును విత్‌డ్రా చేసుకునే సదుపాయం కల్పించడం విప్లవాత్మకమైన మార్పుగా చెప్పుకోవచ్చు. దీనితో నగదు తీసుకునేందుకు బ్యాంకులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఏటిఎం కార్డు డెబిట్ కార్డుగా మారి ఏటిఎం నుంచి నగదు తీసుకోవడానికే కాకుండా పిఒఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రం ద్వారా షాపింగ్ చేయడానికి, అలాగే ఇంటర్నెట్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేయడానికి బహుముఖ ప్రయోజనకర కార్డుగా ఇది ఎంతో ఉపయోగం లోకి వచ్చింది. ఎన్.ఇ.ఎఫ్.టి అనేది రిటైల్ చెల్లింపుల అవసరాలను తీరుస్తుండగా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2004 వ సంవత్సరం మార్చిలో పెద్దమొత్తంలో చెల్లింపులకు సంబంధించి ఆర్.టి.జి.ఎస్- (రియల్‌టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టం)ను తీసుకువచ్చింది. దీనిని బ్యాంకుల ఫండ్ మేనేజర్లు, ఫైనాన్షియల్ కంపెనీలు, పెద్దమొత్తంలో నగదు బదిలీ చేయదలచిన వారు వాడుతారు. దీని పేరులో రియల్‌టైమ్ అని సూచించినట్టుగానే అంతర్ బ్యాంక్ లావాదేవీలను ఆన్‌లైన్ ద్వారా స్వల్ప వ్యవధిలో పూర్తి చేసే ఏకైక వ్యవస్థ ఇది. ఏదైనా అంతర్‌బ్యాంక్ చెల్లింపుల వ్యవస్థకు, ఇరు పక్షాల మధ్య లావాదేవీలను పరిష్కరించే విశ్వసనీయమైన కేంద్రీకృత కౌంటర్ పార్టీ ఉండాలి. రిజర్వు బ్యాంకు ఈ పనిని నిర్వహిస్తోంది. ఇందుకు వీలు కల్పించే విధంగా పేమెంట్, సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం 2007ను తీసుకువచ్చారు. దీని ప్రకారం చెల్లింపుల వ్యవస్థకు , చెల్లింపుల వ్యవస్థకు అధీకృత వ్యవస్థగా వ్యవహరించడానికి వారి మధ్య చెల్లింపుల పరిష్కారాలకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సాధికారత కల్పించారు. పేమెంట్ వ్యవస్థలను ఆఫర్ చేయడానికి రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానంగా అనుమతిచ్చిన రెండు సంస్థలు, ది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ), క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) అన్ని బ్యాంకుల అన్ని ఏటిఎంలకు సంబంధించి గరిష్ఠస్థాయిలో రిటైల్ చెల్లింపులు చేస్తూ నేషనల్ ఫైనాన్షియల్ స్విచ్ (ఎన్ఎఫ్ఎస్)ను నిర్వహిస్తుంది. ఎన్.పి.సి.ఐ ఎన్నో రకాల చెల్లింపు పద్ధతులను అందుబాటులోకి తెచ్చింది.

**అవి...**

ఐఎంపిఎస్- ఇమిడియట్ పేమెంట్ సిస్టమ్

ఎన్ఎసిహెచ్- నేషనల్ ఆటోమేటెడ్ క్లియరింగ్ హౌస్

సిటిఎస్- చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (ఇమేజ్ ఆధారిత ప్రాసెసింగ్ ద్వారా చెక్‌ను క్లియర్ చేయడం)

ఎఇపిఎస్- ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్

యుపిఐ -యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్

స్టార్ 99 స్లాష్ - యుఎస్ఎస్‌డి ఆధారిత అవ్యవస్థీకృత అనుబంధ సర్వీస్ డేటా

**రుపే డెబిట్ కార్డ్**

**యుపిఐ-యునిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్**

ఎన్‌పిసిఐ రిటైల్ బిల్ పేమెంట్ వ్యవస్థ బిబిపిఎస్- భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిని ఉపయోగించే వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సేవలకు సంబంధించిన బకాయిలు, పన్నులు, ఇలా ఏవిధమైన చెల్లింపులనైనా దేశంలోని ఎక్కడినుంచైనా చెల్లించడానికి వీలు కలుగుతుంది ఇవే కాకుండా వాలెట్ సర్వీసులు అందించే పలు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు ఉన్నారు. పే టిఎం, బిల్ డెస్క్, సిసి ఎవెన్యూ, ఇన్‌స్టామోజో, పే పాల్, సిట్రస్ పే, డైరెక్‌పే, పే యు మనీ, ఇ పే, పే నెట్జ్, వంటివి వీటిలో కొన్ని. వీటితోపాటుగా క్లోజ్‌డ్ పే మెంట్ సిస్టమ్‌లు కూడా ఉన్నాయి. ఇవి ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్, భారీ మార్కెటింగ్ డెలివరీ సర్వీస్ సంస్థలకు చెందినవి. ఇవి పరిమిత ప్రయోజన ప్రీ పెయిడ్ కార్డులను కలిగిఉండవచ్చు.

పేమెంట్ అండ్ సెటిల్ మెంట్ సిస్టమ్ చట్టం 2007లోని సెక్షన్ 2( ఐ) కింద పేమెంట్ సిస్టమ్ అన్న దానికి నిర్వచనం...

పేమెంట్ సిస్టమ్ అంటే చెల్లింపుదారుకు, లబ్ధిదారుకు మధ్య క్లియరింగ్, పేమెంట్, సెటిల్‌మెంట్ సర్వీస్, లేదా వీటన్నిటి ద్వారా చెల్లింపులు జరిగేట్టు చూసే వ్యవస్థ. స్టాక్ మార్కెట్ ఈ పరిధిలోకి రాదు. వివరణ.. ఈ క్లాజు కింద, పేమెంట్

సిస్టం అన్న దానిలో క్రెడిట్ కార్డు డెబిట్ కార్డు , స్మార్ట్ కార్డు, నగదు బదిలీ కార్యకలాపాలు, లేదా ఇలాంటి కార్యకలాపాలు ఆధారిత వ్యవస్థలు కలిగి ఉంటాయి.

పేమెంట్ సిస్టమ్, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాలోని పేమెంట్, సెటిల్‌మెంట్ సిస్టమ్స్ ఆథరైజేషన్ కలిగి ఉండాలి. పేమెంట్ వ్యవస్థను నిర్వహించే సంస్థలు కొన్ని నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు వీటిని నిర్వహించాలనుకునే వారి సమర్థతను అంచనావేస్తాయి. బ్యాంకు పేమెంట్ వ్యవస్థను ఆఫర్ చేస్తున్నట్టయితే, ఖాతాదారు కాని, లేదా ఎండ్ యూజర్‌కానీ ఏదైనా పేమెంట్ వ్యవస్థను వాడేందుకు తమ బ్యాంక్ వద్ద నమోదు చేసుకోవలసి ఉంటుంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్.టి.జి.ఎస్, ఎన్.ఇ.ఎఫ్.టి, ఇసిఎస్ (డెబిట్ లేదా క్రెడిట్) సిస్టమ్‌లను నేరుగా నిర్వహిస్తుంది. అదే, పేమెంట్‌సిస్టమ్ ప్రొవైడర్లు ఆపరేట్ చేసే చెక్ క్లియరింగ్‌తో పాటు అన్నిరకాల ఇతర పేమెంట్ వ్యవస్థల సేవలు సర్వీసు ప్రొవైడర్లే పరిష్కరిస్తారు. చివరగా ఇవి రిజర్వుబ్యాంకు ఖాతాలలో నమోదవుతాయి. కొత్త ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడంతో ఐటిసి– ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం ప్రాధాన్యతను మరింత పెంచింది. అలాగే దేశంలో ఇంతవరకూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు అందుబాటులోకి రాని ప్రాంతాలకు వాటిని అందించడానికి అవకాశం కలిగింది.బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రాని వారికోసం పూర్తి స్థాయి బ్యాంకింగ్ సేవలుఅందుబాటులోకి తీసుకురావడం సాధ్యంకాని ప్రాంతాలలో కనీస బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకింగ్ కరస్పాండెంట్ పద్ధతిని తీసుకువచ్చారు. దీనివల్ల సమ్మిళిత ఆర్థిక లక్ష్యాలు సాధించడానికి వీలు కలుగుతుంది. దేశంలో పెద్దఎత్తున మొబైల్ టెలిఫోన్లు అందుబాటులోకి రావడంతో నగదు రహిత చెల్లింపులు చేయడానికి ప్రతిఒక్కరికీ ఒక మార్గం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బ్యాంకు ఖాతాలకంటె మొబైల్ ఫోన్లు ఎక్కువగా ఉన్నాయని తేలింది. దీనితో అన్ని పేమెంట్ వ్యవస్థలు, మొబైల్ వాలెట్లు మొబైల్ టెలిఫోన్‌లో లేదా ఇతర కంప్యూటర్ పరికరాలలో లావాదేవీలు జరపడానికి వీలుగా సాఫ్ట్‌వేర్‌లు అభివృద్ధి చేసే అవకాశం కల్పించింది. వీటిని వినియోగించే వారు ఒక ఖాతా లేదా వాలెట్ నుంచి మరొక ఖాతాకు లేదా వాలెట్‌కు సులభంగా చెల్లింపులు చేయడానికి ఇవి ఎంతో ఉపకరిస్తున్నాయి. అయితే వీటిని వాడే వారు తమ పాస్‌వర్డ్‌ను కానీ లేదా పిన్ నెంబరును కానీ ఎవరికీ తెలియజేయకుండా, జాగ్రత్తపడాల్సి ఉంటుంది. వీటన్నిటి వాడకంతో నగదు చెల్లింపులు, చెక్కుల ద్వారా చెల్లింపులు ఇంతకు ముందు స్థాయిలో లాగా పెరగడంలేదు. మొత్తంమీద చెల్లింపుల వ్యవస్థలు తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థదిశగా ముందుకు సాగుతున్నాయి. పెద్దనోట్ల రద్దు నిర్ణయం అనంతరం నగదు రహిత లావాదేవీలకు సంబంధించి గత కొద్దినెలల్లో, కొన్నిఎలక్ట్రానిక్ చెల్లింపుల వ్యవస్థలద్వారా లావాదేవీలలో 30 నుంచి 40 శాతం పెరుగుదల కనిపించింది. ■

## లావాదేవీలపై నిఘా

కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు పదిరకాలైన లావాదేవీలపై నిఘా పెట్టింది. ఇలాంటి లావాదేవీలను విచారించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని కూడ ఏర్పాటు చేసింది. అవి ఏమంటే:

1) ఒక ఆర్థిక సంవత్సరంలో పది లక్షలరూపాయలకన్నా అధికంగా లావాదేవీలు జరిగితే, ఆ ఖాతాలను (అయితే వీటిలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కరెంటు ఖాతాలు లెక్కలోకిరావు);
2) ఫిక్స్‌డ్ డిపాజిట్లలోకూడ, ఒకే వ్యక్తికి సంబంధించినవి ఒకసంవత్సరంలో పదిలక్షల గరిష్ట పరిమితిని దాటితే;
3) ఒక లక్ష రూపాయలకన్నా ఎక్కువగా నగదు చెల్లింపు చేస్తే, మరియు పదిలక్షల రూపాయలకన్నా, అధికంగా ఏదైనా క్రెడిట్ కార్డుకు, చెక్కు రూపేణా చెల్లింపు చేస్తే;
4) నవంబరు 09, 2016 నుండి డిసెంబరు 30, 2016 తేదీల మధ్య 2.5 లక్షల రూపాయలకన్నా ఏ ఖాతాలోనైనా జమ అయితే దాని వివరాలు;
5) కరెంటు ఖాతాల విషయంలో ఒక సంవత్సరంలో రూ. 12.5 లక్షలకన్నా ఎక్కువ డిపాజిట్ అయితే వివరాలు;
6) ఏప్రిల్ 01, 2016 నుండి, నవంబర్ 09, 2016 మధ్య ఏ ఖాతాలోనైనా అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వాటి వివరాలు;
7) మ్యూచ్యువల్ ఫండ్లు లేదా బైబ్యాక్ చేసిన వాటాల లావాదేవీలు;
8) పది లక్షల రూపాయలకు మించిన విదేశీమారక ద్రవ్య, ట్రావెలర్స్ చెక్కుల కొనుగోళ్ళు;
9) 30 లక్షల రూపాయలు మించిన ఆస్తులు ఎవరైనా కొంటే, రిజిష్టర్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌లు ఆ వివరాలను వెంటనే ఈ ప్రత్యేక విభాగానికి తెలియచేయాలని బోర్డు ఒక ప్రకటనలో తెలియచేసింది. ■

# నగదు రహితమే సుగమ్యం



**నగదురహిత లావాదేవీల వలన సుఖవంతమైన జీవనాన్ని గడపడం ఎంత సులభమో దాన్ని భద్రపరచడం నెంబర్లను గుర్తు పెట్టుకోవడం, అడిగిన సమాచారాన్ని ప్రతిసారి సరియైనదిగా ఎంటర్ చేయడం, మొబైల్ పరిజ్ఞానంతో పాటు, స్మార్ఫోన్ కలిగి వుండడం కూడ అంతే అవసరం.**

అభివృద్ధి చెందుతున్న భారతదేశం నేడు ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో ఆర్థిక లావాదేవీల సమస్య ఒకటి. ఈనాడు ఈ 500/-, 1000/- రూపాయల నోట్ల రద్దుతో ఆర్థిక లావాదేవీల సమస్య మరింత తీవ్రమైంది. అందువల్ల నేడు ప్రజలు నగదు రహిత లావాదేవీలకే మొగ్గుచూపుతున్నారు. ఈనాడు ప్రభుత్వం ఈ లావాదేవీలను అధికంగా జరిపిన వారికి నగదు పురస్కారాలను కూడా అందిస్తుంది. ఇలా జరపడం వల్ల ప్రతిరూపాయి లెక్కలోకి వస్తుంది. నల్లధనానికి కొంత మేర స్వస్తి పలకవచ్చు. దొంగతనాలు. దారిదోపిడిలు వంటి అకృత్యాలను కూడా అరికట్టొచ్చు.

వచ్చిన సమస్యల్లా నగదురహిత లావాదేవీలు చేయటం ఎలా? మనదేశంలో చుదువుకున్న వారికంటే చదువులేని వారే ఎక్కువ. కాని ప్రతిఒక్కరు నగదురహిత లావాదేవీలను జరపడం కొద్దిగా కష్టమే కాని భారత ప్రభుత్వం కొన్ని సదుపాయలను మనకు అందించింది. వాటిని అనుసరిస్తే లావాదేవీలు చేయడం సులభతరం అవుతుంది. దీన్ని ఎలక్ట్రానిక్స్ (e-money) నగదురహిత బదలీ అంటారు.

**ఈ-మనీలో 3 రకాలు**

మొదటి రకంలో నగదును ఇచ్చి దానికి తగిన మొత్తంతో ఒక కార్డును పొంది దానిని వస్తురూపంలో కానీ మిగిలిన వివిధరకాల సదుపాయాలను పొందటానికి కానీ ఉపయోగిస్తారు. (1) స్మార్ట్‌కార్డులు (2) ప్రీపెయిడ్ కార్డులు (3) గిఫ్ట్‌కార్డులు (4) మైబస్ కార్డులు ఈ విధంగా మన నగదును ముందుస్తుగా చెల్లించి నగదురహిత లావాదేవీలను చేయవచ్చు.

రెండవ రకం సాఫ్ట్‌వేర్ సహాయంతో ఆన్‌లైన్ సేవలను అందించే వ్యవస్థ ఉదాహరణకు పేటియం వంటివి ఇందులో మనం ముందుగానే కొంత నగదును ఉంచి ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారునికి నగదును బదిలీ చేస్తారు.

ఇక మూడోవ రకం వర్చువల్ కరెన్సీ డిజిటల్ మనీగా పరిగణిస్తారు. కేవలం వర్చువల్ కమ్యూనిటీలలోనే దీన్ని వుపయోగిస్తారు. దీనిపైన నియంత్రణ కేవలం, దీన్ని అభివృద్ధి చేసినవారికి మాత్రమే ఉంటుంది.

**డా॥ సురభి లక్ష్మీ శారద,** ఫ్రీలాన్సర్, హైదరాబాద్.
E-mail: saradasurabhi@yahoo.com

## ఏకీకృత సమన్వయ చెల్లింపు విధానం

**(Unified Payments Interface)**

బ్యాంక్ ఖాతా కలిగివున్న ప్రతివ్యక్తీ ఈ పద్ధతిని ఉపయోగించవచ్చు. దీనిలో తక్షణ చెల్లింపు విధానం ద్వారా నగదును IFSC Code లేకుండా వేరొక ఖాతాలోకి బదిలీ చెయ్యొచ్చు. ఉదాహరణకు ఒకవ్యక్తికి భారతీయ స్టేట్ బ్యాంక్‌లో ఖాతా ఉందనుకుంటే దానికి సంబంధించిన appలో UPI Options ఉంటాయి. తక్షణ చెల్లింపు విధానం (IMPS) ద్వారా నగదును వేరొకవ్యక్తి ఖాతాకు బదిలీ చెయ్యవచ్చు.

## తక్షణ చెల్లింపు విధానం - IMPS

2010లో మొదలైన ఈ విధానంలో NEFT లాగా కాకుండా విరామం లేకుండా 24 గంటలు నిర్విరామంగా నగదును అందుకునే సౌకర్యం ఉంది.

## NPCI (National Payments Corporation of India)జాతీయ చెల్లింపుల సంస్థ

ఈ సంస్థ భారతీయులందరికీ నిబంధనలు లేని చెల్లింపు విధానాన్ని అందిస్తున్నది. 2008లో ప్రారంభమైన ఈ లాభరహిత సంస్థ సెక్షన్ 25 కంపెనీ చట్టప్రకారం నమోదై రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) మరియు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (IBA) ఆధ్వర్యంలో రిటైల్ చెల్లింపు విధానంలో మొత్తం భారతదేశాన్ని ఒక గొడుగుకిందకు తీసుకొచ్చి పనిచేస్తోంది. 2016 నవంబర్ నాటికి 56 బ్యాంకుల్లో NPCI వాటాదారులతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేటు రంగ బ్యాంకులు, మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకులు, గ్రామీణ, విదేశీ బ్యాంకులు ఉన్నాయి. ఈ కంపెనీ లక్ష్యం అధిక లావాదేవీలను తక్కువ లావాదేవీ ధరలో అందించటం.

## జాతీయ ఆర్థిక స్విచ్ (నేషనల్ ఫైనాన్షియల్ స్విచ్)

నేషనల్ ఫైనాన్షియల్ స్విచ్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధీనంలో మొత్తం బ్యాంకులకు అనుసంధానించబడి పనిచేస్తుంది. దేశంలోని అన్ని ATMల నుంచి ఏ బ్యాంక్ కార్డు కలిగిన వినియోగదారులైన NFSలను స్వధన్ అన్న పేరుతో 1997 నుంచి 2003 వరకు ఒక షేర్డ్ నెట్‌వర్క్‌లా పనిచేసింది. ఈ NFSలు నగదు మరియు నగదురహిత లావాదేవీలైన బాలెన్స్ వివరాలు, మినిస్టేట్‌మెంట్లను అందించే సౌకర్యాన్ని అన్ని ATMలకు కలుగుచేసింది. 2016 వరకు 2.3 లక్షల ATMలు దీనికి అనుసంధానించబడ్డాయి.

## చెక్ ట్రంకేషన్ వ్యవస్థ

2010లో త్వరితగతిన చెక్‌ను నగదుగా మార్చుకోవటానికి ఉద్దేశించబడింది. దీన్నే ఇమేజ్ బేస్ట్ క్లియరెన్స్ సిస్టమ్ అని కూడా అంటారు. ఒక బ్యాంక్ నుండి వచ్చిన చెక్కు ఛాయాచిత్రాన్ని గ్రహించి దాన్ని సదరు బ్యాంకులకు పంపి నగదుగా మార్చుకోవడం. దీనివల్ల నగదును త్వరగా పొందవచ్చు. అంటే ప్రత్యక్ష విధానం కాకుండా పరోక్షంగా పంపవచ్చు. దీనివల్ల నకిలీ చెక్కులను అరికట్టవచ్చు.

## రూపే (RUPAY)

2012లో ఏర్పడి స్వదేశీ, గ్లోబల్ పద్ధతులలో వీసా, మాస్టర్ కార్డుల చెల్లుబాటును NPCI చెలామణిలోకి తెచ్చింది. స్వదేశం, విదేశాలలో కూడా ఉపయోగించవచ్చు. ఈ కార్డులన్నీ NFSల ద్వారా కొన్ని గ్లోబల్ సిస్టమ్స్ ద్వారా డిస్కవరి ఫైనాన్షియల్ సర్వీసులతో అనుసంధామైనాయి.

## NUUP (NATIONAL UNIFIED USSP PLATFORM)

USSD ఛానల్స్‌ను ఉపయోగించుకుంటూ GSM Phone ల ద్వారా బ్యాంక్ ఎకౌంట్లలో లావాదేవీలు జరపడం.

## SBI

రిజర్వ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో ఆగష్టు 25, 2016న UPI Platform మరియు ఆండ్రాయిడ్ అప్లికేషన్‌తో ఏర్పడ్డ అతిపెద్ద చెల్లింపు సంస్థ. ఈ పద్ధతిలో నగదును SMS పంపినంత త్వరితగతిన పంపవచ్చు. మనకు కావలసిందల్లా ఎవరికైతే పంపాలో వారి ఖాతా నంబరే.

అప్పటికే దాదాపు 30 బ్యాంకులు ఇలాంటి తమ సొంత యాప్‌లను తయారు చేసుకుని Google Play Store ద్వారా అందుబాటులోకి తెచ్చాయి.

## మొబైల్ ద్వారా చెల్లింపు విధానాలు

USSD(UNSTRUCTURED SUPPLEMENTARY SERVICE DATA) లేదా *99# మొబైల్ పోర్టకోడ్.

1. బ్యాంక్ ఎకౌంట్‌ను మన ఫోన్ నంబర్‌కు అను సంధానించాలి.
2. దీనికి స్మార్ట్ ఫోన్ లేదా ఇంటర్‌నెట్ కనెక్షన్ అవసరంలేదు.
3. MMID (Mobile Money Identifier) లేదా MPIN (Mobile PIN) ను బ్యాంక్ నుంచి తెచ్చుకోవలసి ఉంటుంది.
4. *99# ను మన మొబైల్ నుంచి నొక్కాలి.
5. మొదటి మూడు అక్షరాల బ్యాంక్ పేరు లేదా 4 అక్షరాల IFSC Code ను నొక్కాలి.
6. ఇక ఆప్షన్లను ఎంచుకోవాలి. (1) నగదు లావాదేవీలు (2) బ్యాలెన్స్ విచారణలు మొదలైనవి.
7. ఎవరికైతే నగదును పంపాలనుకుంటున్నారో వారి మొబైల్ నంబర్, MMID మరియు నగదు మొత్తాన్ని Enter చేయాలి.
8. MPIN మరియు మన 4 అంకెల అకౌంట్ నంబరును Enter చేయాలి.

**M Wallets**

1. దీనికి స్మార్ట్ ఫోన్‌తో పాటు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉండాలి.
2. వ్యాలెట్‌లోని అప్లికేషన్‌ని Download చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలి.
3. నగదును బదిలీ చేసేటపుడు క్రెడిట్ / డెబిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ పద్ధతిని ఉపయోగించాలి.
4. వర్చువల్ చిరునామాను, పిన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలి.
5. ఇక నగదు బదిలీని లబ్ధిదారుని ఆధార్ నంబర్ / వర్చువల్ చిరునామా / అకౌంట్ నంబర్ / IFSC Code / మొబైల్ నంబర్ మరియు MMID ద్వారా చేయవచ్చు.
6. ఒక లక్ష రూపాయల వరకు దీన్ని ఉపయోగించ వచ్చు.

**పరిధి**

KYC కస్టమర్లకైతే ఒక లక్ష రూపాయలు KYC కానివారికి కేవలం రూ. 20 వేల వరకూ. ఇక UPI ద్వారా కూడా నగదు రహిత లావాదేవీలు పొందవచ్చు.

**ఈ-బ్యాంకింగ్ వలన కలిగే నష్టాలు - జాగ్రత్తలు**

1. ఒకసారి e-wallet ద్వారా పంపిన నగదు సదరు లబ్ధిదారునికి కొన్ని సందర్భాలలో కొంత ఆలస్యంగా వెళ్ళవచ్చు.
2. ఏ మాత్రం నంబర్లలో పొరపాటు జరిగినా మరొక లబ్ధిదారునికి వెళ్ళవచ్చు.
3. కొన్నిరకాల వ్యాలెట్లు కొన్ని స్మార్ట్ ఫోన్‌లకు సపోర్ట్ చేయకపోవచ్చు.
4. నెట్‌వర్క్ సరిగా పనిచేయక నగదు లావాదేవీల్లో ఆలస్యమవచ్చు.
5. రివర్స్ డిపాజిట్‌గా మనం ATMల ద్వారా తీసిన మొత్తం మనకు రానియెడల మెసేజ్ రూపంలో రివర్స్ అయినట్లు వస్తుంది.
6. నిర్దిష్ట పరిధిలోకి లోబడి లావాదేవీలు జరుగుతాయి.
7. సైబర్ క్రైమ్స్ జరిగే అవకాశం వుంది. PIN నంబర్, CVV నంబర్, పాస్‌వర్డ్‌లను గోప్యంగా వుంచడం వల్ల ఈ నేరాన్ని అరికట్టవచ్చు.

నగదురహిత లావాదేవీల వలన సుఖవంతమైన జీవనాన్ని గడపడం ఎంత సులభమో దాన్ని భద్రపరచడం నెంబర్లను గుర్తు పెట్టుకోవడం, అడిగిన సమాచారాన్ని ప్రతిసారి సరియైనదిగా ఎంటర్ చేయడం, మొబైల్ పరిజ్ఞానంతో పాటు, స్మార్‌ఫోన్ కలిగి వుండడం కూడ అంతే అవసరం. ఇలా విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు విస్తృతం చేసుకోగలిగితే సుఖమయ నగదురహిత లావాదేవీలకు ఎంచక్క శ్రీకారం చుట్టొచ్చు ఏమంటారు?

■

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ స్వచ్ఛతా పక్షోత్సవాలను జనవరి 16 నుంచి 31 వరకు నిర్వహించింది. యోజన (తెలుగు) తనవంతుగా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నది.

*– సీనియర్ ఎడిటర్*

## సూచన

యోజన చందాదారులకు ప్రతి నెలా ఒకటి, రెండవ తేదీల్లో రంచనుగా వారి సంచిక పోస్టులో వెళ్లిపోతుంది. ఎవరికైనా అందకపోతే వారి పోస్టుమ్యాన్‌ను సంప్రదించి చిరునామాను సరిచూసుకోవాలి. సంచిక అందక పోతే యోజన బాధ్యత వహించదు. ఇందులో ఉత్తర ప్రత్యుత్తరాలకు, టెలిఫోన్ సంభాషణలకు అవకాశంలేదు. గమనించగలరు.

*– సీనియర్ ఎడిటర్*

## పాఠకులకు మనవి

**యోజన తెలుగు మాసపత్రిక పాఠకుల స్పందనలను ఆహ్వానిస్తోంది. యోజన పాఠకులు, చందా దారులు, శ్రేయోభిలాషులు పత్రికలో వచ్చే వ్యాసాలపై తమ సందేహాలు, సూచనలు, స్పందనను లేఖలు, ఈ-మెయిల్ (yojana_telugu@yahoo.co.in), ట్విట్టర్ (@TeluguYojana)ల ద్వారా తెలియచేయగలరు. యోజన నాణ్యతను మరింత మెరుగు పరచడానికి మీ స్పందన ఎంతో ఉపకరిస్తుంది.**

**The Editor,**
**Yojana (Telugu), Room No. 205, Second Floor,**
**CGO Towers; Kavadiguda, Hyderabad - 500 080.**

*– ఎడిటర్, యోజన*

# నగదు లావాదేవీల వల్ల కలిగే దుష్ప్రభావాలు



**ఇంతకీ మనదేశంలో జరిగింది ఏమిటయ్యా అంటే, 'వినగదీకరణ' కాదు, నోట్ల స్వాపింగ్ అనొచ్చు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో నగదులేకుండా వ్యవహరించడం కష్టమే! మన అర్థవ్యవస్థ నగదురహిత విధానం కన్నా నగదు తక్కువ విధానాన్నే సమర్థిస్తుంది. ఈ నగదురహితాన్ని మనదిగా చేసుకోవడంలో ప్రజలలో అనేక భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరీ స్పష్టంగా చెప్పాలంటే, అధికాదాయ వర్గాలకంటే తక్కువ ఆదాయ వర్గాలే నగదు లావాదేవీలను ఇష్టపడతారు.**

ప్రస్తుతం దేశంలో నెలకొన్న నోట్ల సంక్షోభం ఎంత అలజడి సృష్టించిందంటే, దాదాపు మిగిలిన నగదు మొత్తాన్నీ ప్రజలు ఉపసంహరించుకున్నారు. ప్రపంచ బ్యాంక్ కు చెందిన ఆర్థికవేత్త కెన్నెత్ రోగోఫ్ తన, "నగదు వల్ల కలిగే దుష్పరిణామాలు" అన్న పుస్తకంలో ప్రపంచంలోని ఆర్థికవ్యవస్థలన్నీ అధిక నగదుతో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. మన దేశంలోనైతే, లావాదేవీలకు సంబంధించి నగదుకు, ద్రవ్యానికీ పెద్ద తేడా లేదు. అందుకనే, అకస్మాత్తుగా ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు, దేశంలోని నగదు స్వరూపం గొంతు నులిమినట్లయింది. దానితో ఒకరకమైన నగదు మాంద్యం ఏర్పడింది. అసలు ఇంతకీ మనదేశంలో జరిగింది ఏమిటయ్యా అంటే, 'వినగదీకరణ' కాదు, నోట్ల స్వాపింగ్ అనొచ్చు. పాత నోట్ల స్థానే కొత్తవి, మరింత అధిక విలువ గలిగిన వాటిని ప్రవేశపెట్టటం వల్ల నగదు వరద మరింత పెరుగుతుందే కానీ, తగ్గదు. కనుక ఈ చర్య ద్రవ్య అర్థ వ్యవస్థ విపరిణామాలను ఏ మాత్రం నియంత్రించలేదు. నగదు అర్థ వ్యవస్థ సహజంగానే, రికార్డు కాని లావాదేవీల ద్వారా, లెక్క, జమలేని కొనుగోళ్ళు, అమ్మకాల ద్వారా నోట్ల ముమ్మర పరిస్థితిని, పన్ను ఎగవేతను, అవినీతిని, మాదకద్రవ్యాలను, ఉగ్రవాదాన్నీకూడ ప్రోత్సహిస్తుంది.

**నగదు రహితం ఖరీదు:**

ఈ హార్వర్డ్ ఆర్థికవేత్త అన్నట్లు పేదలను కూడా ఒడిలోకి తీసుకునేటట్లు ఆర్థిక సమ్మిళితం ఉండాలి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో నగదులేకుండా వ్యవహరించడం కష్టమే! ఎంతోమంది అమాయకులను బాధించవచ్చు, నిజంగా చెడ్డవారిని అసలేమీచేయలేక పోవచ్చు. కరెన్సీ నోటు అనేది వ్యాధిని వ్యాపింపచేసే క్రిమి మాత్రమే! ఆర్థికవ్యవస్థలో నగదు ప్రమేయాన్ని తగ్గించడం ఎప్పుడూ మంచిదే కానీ, పూర్తి నగదురహిత ఆర్థికవ్యవస్థను ఊహించడం అసంభవమే. మార్పు అనేది క్రమేణా ఎక్కువ నొప్పిలేకుండా జరగాలి. నగదులేని ప్రపంచంలోకి పయనించడానికి ముందు ఎన్నో విషయాలను చక్కబెట్టాలి. తక్కువ నగదు లేదా నగదు రహిత స్థితి, చట్టవిరుద్ధమైనవి కాకపోయినా నగదు లావాదేవీలకు గోప్యత, లావాదేవీల భద్రత, నిజాయితీగా ధనమార్జించే వారిని వేధించకుండా ఉండటం, నగదు లావాదేవీలలో ఉండే సౌలభ్యాన్ని

**ప్రొఫెసర్ కె. నాగేశ్వర్,** విద్యావేత్త, శాసన మండలి మాజీ సభ్యులు, హైదరాబాద్.
E-mail: knhyderabad@gmail.com

పోగొట్టకుండా ఉండాలి. ఏదిఏమైనా నగదురహిత లావాదేవీలు అక్రమ నగదు లావాదేవీలను అరికట్టగలవుకదా! మొత్తం నగదు జనిత అక్రమాలన్నింటినీ అరికట్టగల దనుకోవడం మాత్రం గడ్డివాములో సూదిని వెతికినట్లే!

ఎంతో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు సైతం అనేక ఆర్థిక కుంభకోణాలను ఎదుర్కొంటున్నాయి. ఈ కుంభకోణాలు జరుగుతున్నది ప్రధానంగా నగదువల్ల మాత్రం కాదు. నగదు రూపంలో లేని ద్రవ్యాన్ని సరిగా నిర్వహించలేకపోవడం, ఆర్థిక వ్యవస్థ పారదర్శకంగా లేకపోవడం, వీటితోపాటు రాజకీయ అవినీతి ఈ లోపాలకు కారణం కావచ్చు. వ్యవస్థీకృత దోపిడి, చట్టబద్ధం చేసిన అతి భారీ స్థాయిలో జరుగుతున్న కుంభకోణాలు మాత్రమే దేశాన్ని ఇంతవరకూ కుదిపేశాయికానీ, నగదు లావాదేవీలు కాదు. ఆర్థికవ్యవస్థలో ఉన్న లోపాలే నగదుకు శాపంగా పరిణమించాయి. ఈ రెంటినీ సరిపోల్చడం సబబు కాదు.

**ఇప్పటికీ నగదే రాజు:**

అంతర్జాతీయ అనుభవం ఏమంటే, ఆర్థిక లావాదేవీలలో ఇప్పటికీ నగదే ప్రధానం. మన దేశం పూర్తి నగదు రహితానికి కలలుకంటున్నప్పటికీ, అనేక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ఇంకా నగదు లావాదేవీలే ప్రధానంగా ఉన్నాయి. డాలర్, యూరో కరెన్సీల విలువ 2005 తరువాత దాదాపు రెట్టింపు అయింది. బ్లూంబర్గ్ నివేదిక ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, జర్మని, కెనడా, ఫ్రాన్స్, నెదర్‌ల్యాండ్స్ వంటి దేశాల చెల్లింపుల విధానంపై జరిపిన అధ్యయనం ప్రకారం వీటి అనుభవాలు భిన్నంగా ఉన్నట్లు తెలియచేసింది. ఈ చిన్న అన్ని దేశాలలోనూ వినియోగదారులు తమ లావాదేవీలకు తరచుగా నగదునే వినియోగించారు. చిన్నచిన్న లావాదేవీలకు నగదే సౌకర్యవంతమని ప్రపంచవ్యాప్త అనుభవం. స్వీడన్‌లో ఈ నగదు లావాదేవీలు మొత్తం లావాదేవీలలో కేవలం మూడు శాతం మాత్రమే! నార్వేలో అయితే వీధిపక్కన దొరికే బజ్జీలు, వార్తాపత్రికలను కూడా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కొనవచ్చు. డెన్మార్క్‌లో దాదాపు మూడవ వంతు జనాభా నగదు రహిత చెల్లింపులనే చేస్తున్నారు. బెల్జియంలో 90 శాతం పైగా జనాభా నగదు రహిత చెల్లింపులకే ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు, సోమాలియా, కెన్యా వంటి అతిపేద ఆఫ్రికన్ దేశాలలో కూడా లావాదేవీలలో నగదు ప్రభావం తగ్గిపోతున్నది. అదే సమయంలో ఆస్ట్రియా, జర్మని వంటి దేశాలయితే వ్యతిరేక దిశలో పయనిస్తున్నాయి. తొందరపడి నగదు రహితానికి మళ్ళేముందు ఈ పరస్పర విరుద్ధ అనుభవాలన్నింటినీ మనదేశం జాగ్రత్తగా గమనించాలి.

**మన వాస్తవికత:**

సగటు భారతీయుని కొనుగోలు శక్తి ఆధారంగా చూస్తే భారీ నగదు అవసరమైన లావాదేవీలు మనదేశంలో చాలా తక్కువ. కనుకనే, మన అర్థవ్యవస్థ నగదురహిత విధానం కన్నా నగదు తక్కువ విధానాన్నే సమర్థిస్తుంది. ఈ నగదురహితాన్ని మనదిగా చేసుకోవడంలో ప్రజలలో అనేక భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరీ స్పష్టంగా చెప్పాలంటే, అధికాదాయ వర్గాలకంటే తక్కువ ఆదాయ వర్గాలే నగదు లావాదేవీలనే ఇష్ట పడతారు. సంక్షేమరాజ్యంలో ప్రభుత్వ విధానాలెప్పుడూ దిగువస్థాయి వారి ఆశక్తులను దృష్టిలో పెట్టుకోవాలి. నగదు లావాదేవీలే అధికంగా జరుగుతున్న మన ఆర్థికవ్యవస్థను నగదురహితం చేయడం ఎలా సాధ్యం? వినగదీకరణ మామూలుగా అయితే, నగదు రహిత ఆర్థికవ్యవస్థకు దారితీయాలి. కానీ, ప్రస్తుత సందర్భంలో అయితే, ప్రభుత్వం లక్ష్యం పెద్దనోట్లను రద్దుచేయడం కాదు. నూతన రూ. 500ల నోట్లను, మరింత అధికవిలువ కలిగిన 2000ల రూపాయల నోట్లను ప్రవేశపెట్టడం వల్ల వినగదీకరణ లక్ష్యం నగదురహితం కాకుండాపోయింది. ఇలాంటి అసంబద్ధ నిర్ణయాలకన్నా, ప్రభుత్వం నగదురహిత లావాదేవీలను ప్రోత్సహిస్తే బాగుండేది!

**నగదురహిత ఆర్థికవ్యవస్థ ప్రయోజనాలు:**

దేశంలోని బ్యాంకింగ్ కార్యకలాపాల రూపురేఖలను సాంకేతిక పరిజ్ఞానం సంపూర్ణంగా మార్చివేసింది. బ్యాంకులనూ వారి ఖాతాదారులకూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో సౌకర్యవంతం చేసిందనేది కూడా నిజమే. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చిన మొబైల్ బ్యాంకింగ్, మొబైల్ వ్యాలెట్‌లు మొత్తం బ్యాంకింగ్ వనితీరునే మార్చివేశాయి. ఆర్థిక సమ్మిళితంలో భాగంగా ఈ నూతన విధానాలు మరింత లోతుకు తీసుకు వెళ్ళాయి. ముందు ముందు మరింత ఆశ్చర్యకరమైన సాంకేతిక ఆవిష్కరణలు వెలుగు చూడనున్నాయి. మన సమయాన్ని సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పొదుపు చేస్తుంది. తద్వారా ఈ సమయాన్ని మరింత ప్రయోజనకరమైన అంశాలకు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు మే, 2016లో ప్రజలు రెండులక్షల ఏటిఎంల నుండి 730 మిలియన్లకుపైగా లావాదేవీలు చేసినట్లు రికార్డు అయింది. ఒక్కొక్క లావాదేవీకీ ఐదు నిముషాల చొప్పున లెక్కకట్టినా, మనం ప్రతి నెలా 60 మిలియన్లకుపైగా పనిగంటలను వృథా చేసినట్లయింది. ఒక సంవత్సరానికి కావలసిన నగదును అంటే కరెన్సీని ముద్రించడానికి ప్రభుత్వం 34.2 బిలియన్ రూపాయలను ఖర్చు చేస్తున్నది. అదే సమయంలో అంటే, 2016 ఆర్థిక సంవత్సరంలో మన బ్యాంకులు ఏటిఎంల నిర్వహణకు 158 బిలియన్ రూపాయలను వ్యయం చేశాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వెనుక కథ ఇది.

**వినగదీకరణలో నష్టపోయినవారు:**

సాంకేతిక ఆవిష్కరణల సహాయంతో బ్యాంకులకు వినియోగదారలకు సమానమైన లబ్ధి కలుగుతున్నప్పటికీ నగదు రహితం పట్ల మనకున్న ప్రేమ, మక్కువ వల్ల కొన్ని తప్పని సరి ఇబ్బందులను విస్మరించలేము. సాంకేతిక వైవిధ్యంవున్న మన దేశంలో సత్వరమే నగదు రహిత వ్యవస్థకు మారితే పెద్ద సంఖ్యలో అనేక వర్గాలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వెలుపలే ఉండి పోతాయి. నగదు దుష్ప్రభావాన్ని రూపు మాపాలంటే ముందుగా ఈ సమస్యను పరిష్కరించాలి. బలహీన వర్గాలే కాదు, నగదు ప్రేరిత రంగాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ప్రపంచ సాంకేతిక ప్రధాన స్రవంతిలోకి దేశాన్ని తీసుకు వెళ్ళాలనే తాపత్రయంతో ఏ ఒక్కరిని వెలుపల వదిలేయకూడదు. ఇందుకు ఎంతో మార్పు అవసరం. ఆర్థిక రంగంలో సాంకేతికతను ప్రోత్సహించడాన్ని వ్యతిరేకిస్తు న్నట్లు భావించకూడదు. నగదు రహితం కోసం నగదు లేకుండా చేయడానికి యత్నించే ముందు ఆదాయ వ్యత్యాసాలు, సాంకేతిక వ్యత్యాసాలు, అక్షరాస్యత వ్యత్యాసాలు తదితర తేడాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలి. దీనికి తోడు, అక్రమాలను సమర్ధవంతంగా ఎదుర్కొవడానికి నియంత్రణ వ్యవస్థ, వినియోగదారుల సమస్యలను పరిష్కరించాడానికి స్పందన వ్యవస్థ, తక్కువ వ్యయంతో లావాదేవీలను నిర్వహించే పరిస్థితులను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. భ్రమలతో ఆర్థిక విధానాన్ని రూపొందించలేం. అలాగే, మనం ఆధునికతవైపు మళ్ళడాన్ని దృఢమైన నమ్మకాలు అడ్డుకోలేవు. చిన్నచిన్న రాజకీయ విభేదాలతో ప్రజావిధానాన్ని నిలువరించ కూడదు. మన దేశం నగదు రహిత గమ్యాన్ని చేరుకోవడానికి ప్రజలు, ప్రభుత్వం తమ వంతు కృషి చేయాలి. రాజకీయ వాగ్వాదాలతో దేశాభివృద్ధిని అడ్డుకోవడాన్ని అనుమతించకూడదు.

**ఇంకెంతో చేయాల్సి ఉంది**

వేగంగా విస్తరిస్తున్న టెలికాం రంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఎంతో తోడ్పడుతుంది. 2011 జనభా లెక్కల ప్రకారం మన దేశంలోని ఇళ్ళలో మరుగు దొడ్లకంటే మొబైల్ ఫోన్లే ఎక్కువగా ఉన్నాయి. 53 శాతం ఇళ్ళలో మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఈ సంఖ్య 88 శాతానికి చేరినట్లు ఇటీవల జరిపిన సర్వేలో తేలింది. మన దేశంలో నీళ్ళ కనెక్షన్ల కన్నా టెలికాం కనెక్షన్లు మెరుగ్గా ఉన్నాయి. మనం వెంటనే డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు మారాలని వాదిస్తున్నవారికిది బలాన్నిస్తుంది. అయితే, ఇదంతా గణాంకాల్లో ఒగ భాగం మాత్రమే! స్మార్ట్‌ఫోన్ల అందుబాటు ఇంకా పరిమితంగానే ఉండడంతో మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు జరపడం ఇబ్బందిగానే ఉన్నది. నగదు రహిత ఆర్థిక వ్యవస్థతో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఈ కల సాకారం కావాలంటే భారతీయ ఆర్థిక వ్యవస్థ మరెంతో దూరం ప్రయాణించాల్సి ఉంది. **మనకు నగదుపైనే లావాదేవీలు జరిపే అతి పెద్ద చిల్లర వాణిజ్య రంగం ఉంది.** ప్రజల మనోభావల్లో మార్పు తీసుకు రావడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ, సంబంధిత మౌళిక సదుపాయాల కొరత ప్రధాన అడ్డంకిగా ఉన్నది. **విశ్వసనీయ అంచనాల ప్రకారం, దేశంలోని 15 మిలియన్ల మంది వ్యాపారుల్లో 1.4 మిలియన్ల మంది మాత్రమే పాయింట్ ఆఫ్ సేల్ (పి.ఓ.యస్) యంత్రాలు కలిగి వున్నారు.** ఇది చాలా తక్కువ. భారతదేశం నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు మారడంలో అనేక ప్రయోజనాలు, ఇబ్బందులున్నాయి. బ్యాంక్‌లు నగదు లావాదేవీలు జరపడానికి ప్రతిఏటా 25 వేల కోట్ల రూపాయులు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. దీనికి అదనంగా కరెన్సీ నోట్ల ముద్రణా, పంపిణీ కోసం రిజర్వు బ్యాంకు ప్రతిఏటా 17 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఆ విధంగా డిజిటల్ చెల్లింపుల వల్ల భారీ మొత్తంలో డబ్బు ఆదా చెయవచ్చు. అయినప్పటికీ, డిజిటల్ బ్యాంకింగ్ మౌళిక సదుపాయాల నిర్వహణ ఖర్చు, సైబర్ భద్రత సమస్యలు వుంటాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసిఐసిఐ బ్యాంకులు కూడ సైబర్ దాడుల నుంచి తప్పించుకోలేక పోతున్నాయి. సైబర్ దాడుల వంటి సవాళ్ళు నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు మారాలనే వైఖరినే నిరుత్సాహ పరుస్తున్నాయి. అనేక మంది భారతీయులకు బ్యాంకింగ్ సదుపాయం ఇంకా పూర్తిగా అందుబాటు లోకి రాలేదు. దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరు వందల మిలియన్ల మందికి సులువైన బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులో లేదని రిజర్వు బ్యాంక్ డేటా తెలియజేస్తోంది. మూడు వందల మిలియన్ల మందికి బ్యాంక్ ఖాతాలే లేవు. బ్యాంక్ ఖాతా తెరవడానికి కావలసిన సరైన పత్రాలు అనేక మిలియన్ల మంది వద్ద ఇప్పటికీ లేవు. విద్యుత్తు, ఇంటర్‌నెట్ అనుసంధానం కొరత వల్ల బ్యాంకు లావాదేవీలు, ప్రత్యేకించి డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడుతోంది. అధికంగా వున్న డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీల ఖర్చులు అనేక మందికి నిరుత్సాహకంగా మారాయి. భారతీయ మార్కెట్లో అత్యధికంగా వున్న చిన్న వ్యాపారస్తులకు డిజిటల్ లావాదేవీల ఖర్చులు ఖచ్చితంగా భారంగా వున్నాయి. టెలీ, ఇంటర్‌నెట్ అనుసంధానం బ్యాంకుల ఏర్పాటు ఇవన్నీ పట్టణాలకు అనువుగా ఉన్నాయి. మహిళలు, వయోవృద్ధులు, నిరక్షరాస్యులు ఈ సదుపాయాలు పొందడంలో వెనుకబడివున్నారు. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ

*తరువాయి 51వ పేజీలో...*

# ఇండియాలో నగదు రహిత వ్యవస్థ



**పెద్దనోట్ల రద్దు, నగదు లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ నియంత్రణల వల్ల ప్రజలు అనివార్యంగా నగదురహిత లావాదేవీలవైపు మళ్ళుతున్నారు. అయితే, ఈ లక్ష్య సాధనలో అనేక ఆటంకాలూ, చిక్కులూ ఎదుర్కోవలసి వస్తున్నది. దేశప్రజలలో ఇంకా సమాజంలోని అట్టడుగు వర్గాలు సైతం అధికంగా వినియోగించే అవసరాలు, ప్రదేశాలలో, అంటే మార్కెట్ యార్డులు వంటి చోట్ల తప్పనిసరిగా లావాదేవీలకు నగదు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సర్వవేళలా సిద్ధంగా వుంచాలి.**

ప్రస్తుత నగదు రహిత విధానం మనదేశంలో ఒక విధానపరమైన మార్పు కానీ, అనేక ఇతర దేశాలలో, అంటే సింగపూర్, ఐర్లెండ్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జర్మని, అమెరిక, జపాన్ మొదలైన అభివృద్ధి చెందిన దేశాలలో ఇప్పటికే ఇది ఆచరణలో ఉన్నది. ఈ దేశాలన్నిటిలో మొత్తం కాకపోయినా, అధికశాతం లావాదేవీలు నగదు రహితంగానే జరుగుతున్నాయి. ప్రస్తుతం మనదేశంలో 98 శాతం లావాదేవీలు నగదు రూపం లోనే జరుగుతున్నాయి. ఇప్పటి మన ఈ చర్చకు కారణం ప్రధాని పెద్ద నోట్లను రద్దుచేసి, నూతన ఐదువందలు, రెండువేల రూపాయల నోట్లను ప్రవేశపెట్టడమే! రద్దయిన నోట్లు మొత్తం కరెన్సీలో 86 శాతంగా ఉండటంవల్ల ఈ సంక్షోభం తలెత్తింది. ఈ నగదురహిత నిర్ణయాన్ని ఒక చారిత్రక ఘట్టంగా చెప్పవచ్చు. ఈ సాహసోపేత నిర్ణయాన్ని అందరూ అభినందించాల్సిందే!

మాజీ ప్రధాని నరసింహారావు మన ఆర్థికవ్యవస్థను అంతర్జాతీయ సమాజానికి తలుపులు తెరుస్తూ ఆర్థిక సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణలకు నాంది పలికినట్లే, ఇప్పుడు మోదీ నగదురహిత వ్యవస్థకు నాందిపలికారు. అసలు డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని మొదలెట్టినపుడే, ఈ నగదురహితాన్ని ప్రారంభించినట్లు చెప్పవచ్చు. ఈ నూతన విధానం వలన మనకు అనేక ప్రయోజనాలున్నాయి. ప్రతి లావాదేవీ కూడా నమోదు అయి ఉండటంతో, బినమీ లావాదేవీలు, మోసపూరిత లావాదేవీలకు అవకాశం తక్కువ. దానితో నల్లధనం జమ అయ్యే అవకాశంకూడతక్కువే! ఒక్కొక్క ప్రత్యేక రంగంలో ఎంతమొత్తంలో నగదు చలామణీలో ఉంటుందో నిర్దిష్టంగా తెలుస్తుంది. దానితో అనవసరమైన నగదు, అది నకిలీ కరెన్సీ కానీయండి, నల్లధనం కానీయండి చలామణీలోకి వచ్చి నోట్ల ముమ్మర పరిస్థితిని కలిగించదు. దీనితో ప్రతిలావాదేవీపై చెల్లించిన పన్ను సమగ్రంగా ప్రభుత్వానికి చేరుతుంది. పన్ను ఎగవేతలుండవు, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు నగదు నిర్దిష్టంగా

**ఎన్. వెంకటేశ్వర్లు,** ఛార్టెడ్ అక్కౌంటెంట్, హైదరాబాద్.
E-mail: canandyala@rediffmail.com

అందుబాటులోకి వస్తుంది. స్థూల దేశీయో త్పత్తి రేటు కూడా పెరుగుతుంది. నగదు రహిత లావాదేవీలు నల్లధనం, అవినీతి రెంటికీ చరమగీతం పాడే అవకాశం వున్నది. చలామణీలో ఉండే కరెన్సీకి నిర్దిష్ట లెక్క, జమ లేకుంటే, అరాచక, అసాంఘిక, విద్రోహ శక్తులు చొరవతీసుకుంటాయి. ఈ నల్లధనం ఉగ్రవాదులకూ, వేర్పాటు వాదులకూ ఎంత సహాయపడుతున్నదో మనందరకూ బాగా తెలుసు. ఇలాంటి శక్తులవల్ల అభివృద్ధికి ఎంత ఆటంకం కలుగుతున్నదో కూడ తెలుసు. నగదురహిత విధానంతో ఈ సమస్యల నుండి బయట పడవచ్చు. ఇప్పటికే, పెద్దనోట్ల రద్దు, నగదు లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ నియంత్రణల వల్ల ప్రజలు అనివార్యంగా నగదురహిత లావాదేవీలవైపు మళ్ళు తున్నారు. అయితే ఈ లక్ష్య సాధనలో అనేక ఆటంకాలూ, చిక్కులూ ఎదుర్కోవలసి వస్తున్నది. ముఖ్యంగా మనదేశం వ్యవసాయాధారమైంది. దేశ ప్రజలలో ఇంకా 83 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో అధికశాతం నిరక్షరాస్యులు అంతేకాదు, పట్టణా ప్రాంతాలలో ఉండే కనీస సౌకర్యాలుకూడా లేకుండా జీవిస్తున్నారు. వీరందరికీ డిజిటల్ లావాదేవీలపై అవగాహనను కల్పించడం, చరవాణి పనిముట్లను అందుబాటులోకి తేవడం, అంతర్జాల సౌకర్యాన్ని అవిచ్ఛి న్నంగా లభ్యమయ్యేటట్లు చూడటం వంటి వన్నీ కొండంతపని అంటే ఇంకా తక్కువే. అంతేకాదు, వ్యవసాయ పనులలో ఉండే రైతుకూలీలకు కూలీ చెల్లింపులను నగదు రహితంగా అంటే ఆచరణ సాధ్యంకాదు. ఇందుకోసం సమాజంలోని అట్టడుగు వర్గాలు సైతం అధికంగా వినియోగించే అవసరాలు, ప్రదేశాలలో, అంటే మార్కెట్ యార్డులు వంటి చోట్ల తప్పనిసరిగా లావాదేవీలకు నగదు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సర్వవేళలా సిద్ధంగా వుంచాలి. నూతన ప్రత్యామ్నాయా లైన ఆన్‌లైన్ లావాదేవీలు, క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి నూతన సౌకర్యాలకు ప్రజలు అలవాటుపడే వరకూ కొన్ని చిక్కులు తప్పవు. నూతన విధానం మళ్ళీ పుంజుకునేంత వరకూ, చిన్న లావాదేవీలకు కొంత చీకటే! ఈ నూతన విధానాన్ని మెల్లి మెల్లిగా ప్రజలకు అలవాటు చేయాలి. మొత్తమ్మీద ఈ నూతన మలుపు ఒక సరి కొత్త మేలుకొలుపనే చెప్పాలి. ప్రజలు సరిగా దీని ప్రయోజనాలను అర్థంచేసుకుని, ప్రభుత్వానికి సహకరిస్తే, భావితరాలకు మేలుచేసిన వారవుతారు. ■

*49వ పేజీ తరువాయి...*

## నగదు వల్ల కలిగే దుష్ప్రభావాలు

రెండూ ఒకదానితో మరోకటి ముడిపడి వున్నాయి. అయితే, ఇందులో ఏది ముఖ్యమన్నది ప్రధానాంశం. వీటి మధ్య వున్న సంబంధంపై నెలకొన్న అస్తవ్యస్త దృష్టి కారణంగా పెద్దనోట్ల రద్దువల్ల భారీ మొత్తంలో నగదు అతి స్వల్ప కాలంలో ఉప సంహరించబడింది. భారత్‌లో నగదు–స్థూల జాతీయ ఉత్పత్తిల మధ్య నిష్పత్తి 12 శాతంగా వుంది. మనదేశంలో రోజువారీగా జరుగుతున్న 2.7 లక్షల కోట్ల రూపాయల బ్యాంకింగ్ లావాదేవీల్లో 80 శాతం నగదు రూపంలోనే జరుగుతోంది. నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు మారాలనే అవశ్యకతకు ఇది ఒక సవాలుగా ఉన్నది. ఆర్థిక వ్యవస్థలోని భారీ నగదును ఉపసంహారించడానికి సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు, డిజిటల్ చెల్లింపులకు అవసరమైన మౌలిక సదుపాయల ఏర్పాటు సవాలుగా మారింది.

### నగదు రహితం నుంచి స్వల్ప నగదుకు

నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు ఆద్యులు అనుకూలంగా వాదించే వారు వాస్తవాలను గ్రహించినట్లు తెలుస్తోంది. ఊహల్లో విహరిస్తున్న వారికి యదార్థం గోచరిస్తున్నది. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ లాభాలు, నష్టాలకు అతీతంగా అది భవిష్యత్తులో నిజమవుతుందా లేదా అన్నది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని నాయకులు నగదు రహితం కన్న స్వల్ప నగదు వ్యవస్థే తమ ప్రాధాన్యమని ప్లేటు ఫిరాయిస్తున్నారు. సరైన మౌళిక సదుపాయాలు, భద్రత వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వున్నందున, పెద్ద నోట్లను రద్దు చేసిన మాదిరిగా నగదు రహిత ఆర్థిక వ్యవస్థను వేగంగా అమలుచేస్తే సామాన్య ప్రజల ప్రయోజనాలు దెబ్బ తింటాయన్నది వాస్తవం.

**ముగింపు:** నగదు సహిత ఆర్థిక వ్యవస్థలో అనేక ఆర్థిక పరమైన దోషాలున్నాయి. అయితే, ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించ డానికి నగదు రహిత ఆర్థిక వ్యవస్థ సంజీవని మాత్రం కాదు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు మారవలసిందే కానీ, ఈ ప్రక్రియ ఆలోచనా యుతంగా, ప్రణాళికా బద్ధంగా, క్రమంగా జరగాలి. మౌళిక సదుపాయాల కల్పన, లావాదేవీల ఖర్చులు సమ్మిళిత ఆర్థిక వృద్ధి సైబర్ భద్రత తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. దేశానికి నగదు రహిత ఆర్థిక వ్యవస్థగా కంటే ముందుగా స్వల్ప ఆర్థిక వ్యవస్థ ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకోవాలి. ■

భారతీయ రిజర్వ్ బ్యాంక్ అనుబంధ సంస్థ, "భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోటు ముద్రణా ప్రైవేట్ లిమిటెడ్, BRBNMPL సంస్థ తన పూర్తి శక్తి యుక్తులనువయోగిస్తే, సాలుకు 16 బిలియన్ల కరెన్సీ నోట్లను ముద్రించగలదు. ఐదు వందల, వెయ్యి నోట్ల రద్దు ప్రకటన తరువాత, ఈ సంస్థ 22 బిలియన్ నోట్లను ఉపసంహరించింది. వీటిలో, 15.7 బిలి యన్లు ఐదు వందల నోట్లు, మిగిలిన 6.3 బిలియన్ల నోట్లు వెయ్యిరూపాయలవి. ■

# స్వల్ప నగదుతో జీవన సౌలభ్యం...




**నగదు ఉచితంగా లభ్యమవుతుందనే అభిప్రాయం సరికాదు. కరెన్సీకి కాగితం, ముద్రణ ఖర్చు ఏడాదికి ఇరవై వేల కోట్ల రూపాయలు అవుతుందనే వాస్తవం ఎవరైనా గ్రహిస్తున్నారా? అలాగే కరెన్సీ తయారీకి లక్షల గంటల సమయం పడుతుంది. వివిధ చోట్లకు కరెన్సీ చేరవేత కూడా వ్యయ ప్రయాసలతో కూడుకున్నదే. డిజిటల్ చెల్లింపులు నగదు లావాదేవీలకు సమాంతరమే గాని ప్రత్యామ్నాయం కాదని ప్రభుత్వం పదే పదే చెబుతోంది.**

నూట పాతిక కోట్ల జనాభా కలిగిన భారత్ తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థ దిశగా బుడి బుడి అడుగులు వేయడం మొదలెట్టింది. ఇది నిజంగా శుభ పరిణామం.అయితే ఈ బుడి బుడి అడుగులు వడి వడి అడుగులుగా మారడం చిన్న విషయం కాదు ..ఇది ఒక బృహత్తరమైన లక్ష్యం. అంతకు మించి ఎంతో క్లిష్టమైంది కూడా.

భారత ప్రజల మనస్తత్వం ఎంతో విభిన్నమైనది.. సమస్యలను, అంశాలను లోతుగా అధ్యయనం చేయకుండానే నిర్ధారణకు వచ్చేస్తుంటారు. ఊరికే ఉద్రేక పడతారు. నిన్నటికి నిన్న పెద్ద నోట్ల రద్దు విషయంలో వారి వైఖరి గమనార్హం.ఇది చరిత్రాత్మక నిర్ణయమని ఆనందపడిపోయిన వారు వారం రోజులు బ్యాంకుల వద్ద క్యూలో నిలబడేసరికి తెగ ఆవేశపడి పోయి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. అటువంటిది తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థను వీరు ఎంత తొందరగా అన్వయింప చేసుకోగలుగుతారనేది అంచనా వేయడం కష్టం.

**నల్లధనానికి విరుగుడు..**

ఇప్పుడు భారతదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు నల్లధనం. దేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న నల్లధనాన్ని నియంత్రించే ప్రయత్నంగానే నగదు రహిత లావాదేవీలకు ప్రభుత్వం ఉపక్రమించింది. వాస్తవానికి నగదు వాటా తగ్గించి, చెల్లింపులన్నీ బ్యాంకుల ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించేందుకు కొంతకాలంగా ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఫలితంగా ఎలక్ట్రానిక్ చెల్లింపులు పెరిగాయి. కానీ సమాజంలో నగదు ప్రవాహం మాత్రం తగ్గలేదు.

పలు సంపన్న, అభివృద్ధి చెందిన దేశాల్లో నగదు రహిత లావాదేవీలు ఇప్పటికే పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. బెల్జియంలో 95%, ఫ్రాన్స్‌లో, 93%, కెనడాలో 91% బ్రిటన్, స్వీడన్‌ల్లో 90%, నార్వేలో 89% నెదర్లాండ్స్‌లో 85%, ఆస్ట్రేలియాలో 80%, జర్మనీలో 76%, అమెరికాలో 72%, దక్షిణకొరియాలో 70% వరకు నగదురహిత లావాదేవీలు జరుగుతున్నాయి. ఆఫ్రికా ఖండంలోని అతి నిరుపేద దేశం సోమాలిల్యాండ్ కూడా నగదు వినియోగానికి దూరంగా ఉండడం విశేషం. స్వీడన్, నార్వే, డెన్మార్క్, కెన్యా, కెనడా, దక్షిణకొరియా మొదలైన దేశాలు తక్కువ నగదు ఆర్థికవ్యవస్థ కలిగిన దేశాలుగా సంపూర్ణ ఫలితాలు సాధించాయి. కెన్యాలో మొబైల్

**జీడిగుంట నాగేశ్వరరావు,** సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.
E-mail: jnrao13@gamil.com

చెల్లింపులు భారీగా జరుగుతుంటే నార్వేలో డిజిటల్ చెల్లింపులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మొత్తంగా ప్రపంచం చెల్లింపులకు ప్రధాన కేంద్రబిందువుగా స్మార్ట్ ఫోన్‌లను అన్వయింప చేసుకుంటోంది. ఎలక్ట్రానిక్ లావాదేవీలకు సహేతుక పన్ను రేట్లు, నగదు లావాదేవీలకు జరిమానాలతో డిజిటల్ వైపు మార్పు శీఘ్రతరమవుతోంది.

**భారత్‌లోనే ఎక్కువ...**

కాగా, ప్రపంచంలో ఏ ఆర్థిక వ్యవస్థ కూడా పూర్తి నగదు రహితం కాదు. అన్నీ తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థలే. అయితే మన ఆర్థిక వ్యవస్థలో ఇంతవరకు నగదు చెలామణి భారీగా ఉంది. 2015 ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ నివేదిక ప్రకారం వినియోగదారుల నగదు లావాదేవీలు 98% ఉన్నాయి. భారత్‌లో రిటైల్ చెల్లింపులకు నగదే మూలాధారంగా ఉంది. మొత్తం లావాదేవీలలో కేవలం నాలుగు శాతం మాత్రమే డిజిటల్ రూపంలో జరుగుతుండగా మిగిలిన అన్ని లావాదేవీలు నగదు లేదా చెక్కుల రూపంలోనే జరుగుతున్నాయి. గరిష్ట దేశీయోత్పత్తిలో నలభై శాతం సమకూరుస్తున్న తొంభై శాతం పరిశ్రమలు, సంస్థలు నగదు లావాదేవీలే జరుపుతున్నాయి.

**ప్రత్యామ్నాయం కాదు..**

పెద్ద నోట్ల రద్దు అనంతర ప్రక్రియలో తక్కువ నగదు, నగదు రహిత లావాదేవీల ప్రోత్సాహానికి చేపట్టిన చర్యలతో నగదు వినియోగం బాగా తగ్గేందుకు అవకాశాలు మెరుగు పడవచ్చు. ప్రజలు అవసరం మేరకు నగదు దగ్గర ఉంచుకుని - సాధ్యమైన చోటల్లా కార్డులతోను, ఎలక్ట్రానిక్ పద్ధతిలోను చెల్లింపులకు అలవాటు పడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. తద్వారా నగదు నల్లధనంగాను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగపడేదిగాను మారకూడదన్నది ఇందులో మరో సదుద్దేశం. ఆర్థిక వ్యవస్థ లో డిజిటల్ చెల్లింపులు నగదు లావాదేవీలకు ప్రత్యామ్నాయమని, ఇందువల్ల అసలు చేతిలో డబ్బు అనేది లేకుండా ప్రతిదానికి కార్డులు మాత్రమే వాడాల్సి ఉంటుందనే అభిప్రాయం ఉంది. నగదు ఉచితంగా లభ్యమవుతుందనే అభిప్రాయం సరికాదు. కరెన్సీకి కాగితం, ముద్రణ ఖర్చు ఏడాదికి ఇరవై వేల కోట్ల రూపాయలు అవుతుందనే వాస్తవం ఎవరైనా గ్రహిస్తున్నారా? అలాగే కరెన్సీ తయారీకి లక్షల గంటల సమయం పడుతుంది. వివిధ చోట్లకు కరెన్సీ చేరవేత కూడా వ్యయ ప్రయాసలతో కూడుకున్నదే. డిజిటల్ చెల్లింపులు నగదు లావాదేవీలకు సమాంతరమే గాని ప్రత్యామ్నాయం కాదని ప్రభుత్వం పదే పదే చెబుతోంది.

**సవాళ్ళు..**

భారత్‌లో వంద కోట్ల మంది మొబైల్ ఫోన్ వాడుతున్నారు. అయితే వీరిలో ఐదు వంతుల మంది మాత్రమే స్మార్ట్ ఫోన్లు కలిగివున్నారు. మిగిలిన వారు ఒక మోస్తరు లేదా తక్కువ ఆధునిక ఫోన్లతో నడిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఇంతమందిని మొబైల్ ఫోన్లతో డిజిటల్ చెల్లింపుల దిశగా నడిపించడం పెద్ద సవాలే. ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోన్లు కలిగి ఉండడం ఒక సమస్య అయితే వాటి ఆపరేషన్ కు నిరంతర ఇంటర్నెట్ సదుపాయం కల్పన మరో సమస్య. అక్షరాస్యతే పూర్తిగా సాధించని పరిస్థితిలో ఆర్థిక అక్షరాస్యత కలిగించడం మరో పెను సవాల్.. జన్ ధన్ యోజన ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించినప్పటికీ వాటిలో చాలా ఖాతాలు నిర్వహణలో లేవు. అందరికీ బ్యాంకు ఖాతాలు లేకుండా నగదు రహితం లేదా తక్కువ నగదు లావాదేవీలు సాధ్యం కాదు. చిన్న వ్యాపారులు ఎక్కువ ఉన్న భారత్‌లో ఎలక్ట్రానిక్ చెల్లింపుల మౌలిక సదుపాయాలపై పెద్దమొత్తాన్ని వెచ్చించడానికి వారికీ వనరులు సరిపోవు. కొన్ని సందర్భాలలో వినియోగదారుల వైఖరి కూడా ఈ ప్రక్రియకు అవరోధం కావచ్చు. కార్డు చెల్లింపులయితే బేరసారాలకు వీలుండదు కాబట్టి నేరుగా నగదు తో కాస్త తక్కువకి వస్తువు పొందాలనుకుంటారు. పైగా కార్డు చెల్లింపులపై అదనపు పన్నులు కట్టేందుకు సిద్ధపడేవారు తక్కువ..ప్రైవేట్ కంపెనీల డిజిటల్ వాలెట్లను బ్యాంకు అకౌంట్లకు అనుసంధానించే వీలు లేకపోవడం ఈ ప్రక్రియ ముందుకు వెళ్ళడానికి మరో అడ్డంకి ..

**ప్రభుత్వ కార్యాచరణ**

తక్కువ నగదు వ్యవస్థను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు కొన్ని చర్యలు చేపట్టాయి.

**పేమెంట్ బ్యాంకులకు లైసెన్స్ మంజూరు**

- మొబైల్ వాలెట్‌లకు ప్రోత్సాహం..వీటి ద్వారా డబ్బు పంపేందుకు, బిల్లులు చెల్లించేందుకు, మొబైల్ రీఛార్జికి, సినిమా టికెట్లు బుక్ చేసుకోవడానికి, బహుమతులు పంపడానికి వీలు. వీటిద్వారా నిబంధనలకు లోబడి లక్ష రూపాయల వరకు కూడా లావాదేవీలు జరిపే అవకాశం..
- ఎఫ్.డి.ఐ. నిబంధనలను సడలించడం ద్వారా ఈ-కామర్స్‌కు ప్రోత్సాహం..
- ఎలక్ట్రానిక్స్ లావాదేవీలు సులభంగా, వేగంగా జరిగేందుకు యు.పి.ఐ. ఏర్పాటు..

**ఇంకా చేయాల్సింది..**

దేశంలో 104 కోట్ల డెబిట్, క్రెడిట్ కార్డులు వాడకంలో ఉన్నాయి. దాదాపు 90 శాతం డెబిట్ కార్డు లావాదేవీలు ఏ.టి.ఎం.ల వద్ద జరుగుతుండగా పది పన్నెండు శాతం లావాదేవీలు మాత్రమే పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) టెర్మినల్స్ వద్ద జరుగుతున్నాయి. అయితే దేశంలో ప్రస్తుతం ఏ.టి.ఎం.లు, పి.ఓ.ఎస్. లు మన భారీ జనాభాకు తగినన్ని

లేవు. కేవలం సుమారు రెండు లక్షల ఏ.టి.ఎం.లు, పన్నెండు లక్షల పి.ఓ.ఎస్.లు మాత్రమే సేవలందిస్తున్నాయి. తక్కువ నగదు లావాదేవీల కోసం వీటి సంఖ్యను భారీగా పెంచాల్సి ఉంది.

అత్యధిక శాతం మందికి నగదు రహిత చెల్లింపులపై అవగాహనే లేదు. అయితే, ఈ ధోరణి క్రమంగా సానుకూల మలుపు తీసుకుంటోంది. భారత ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ ఆర్థిక సమ్మిళిత వృద్ధి చర్యలు సత్ఫలితాల దిశగా సాగుతున్నాయి. 2011లో 35 శాతం ఉన్న బ్యాంకు ఖాతాలు 2014లో 53 శాతానికి పెరగడమే ఈ సానుకూలతకు ప్రత్యక్ష సంకేతం. దాదాపు 55 షెడ్యూల్డ్ బ్యాంకులు ఇంతవరకు 44 కోట్ల 10 లక్షల డెబిట్ కార్డులు జారీ చేశాయి. 2014 అక్టోబర్ వరకు రెండు కోట్ల క్రెడిట్ కార్డులు ఇచ్చాయి. 2011-12 లో 120 కోట్ల మేర ఉన్న ఎలక్ట్రానిక్ లావాదేవీలు 2012-13లో 170 కోట్లకు పెరిగాయి. కాగా, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు కలిగినవారు 21 కోట్ల మంది ఉన్నారనేది ఒక అంచనా. పోనీ మరికాస్త ఎక్కువ మందే ఉన్నారనుకున్నా తక్కువ నగదు దిశగా మళ్లడానికి ఇంకా ఖాతాలు తీసుకోవలసిన వారు కోట్లలోనే ఉన్నారు. వీరందరిచేత బ్యాంకు ఖాతాలు తెరిపించడానికి ఉద్యమ స్థాయి ప్రయత్నం అవసరం.

మొబైల్ వినియోగం దేశంలో బాగానే పెరిగింది కాని మొబైల్ వినియోగించే వాళ్ళంతా ఏకంగా మొబైల్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు జరిపే పరిజ్ఞానం లేదు. నిజానికి కాస్తో కూస్తో ఇంగ్లీషు పరిజ్ఞానం ఉంటే తప్ప, ఆర్థిక లావాదేవీలు మొబైల్ ద్వారా జరపడం సాధ్యపడదు. నగదు రహిత లావాదేవీలకు ఇంటర్నెట్ సౌకర్యం అత్యంత కీలకమైనది. ఇంటర్నెట్ అన్ని వేళలా, అన్ని ప్రాంతాల్లో ఉండాలి. దానికి తోడు అంతర్జాలం తగినంత వేగంగానూ ఉండాలి. భారతదేశంలో సగటు వేగం మూడు నుంచి నాలుగు శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. అసలు కరెంటు సౌకర్యం లేని గ్రామాలు మన దేశంలో అనేకం ఉన్నాయి. తొలి నుంచి కార్డుల ద్వారా లావాదేవీలకు అలవాటు పడ్డవారికి ఈ పరిస్థితి అంతగా ఇబ్బంది అనిపించక పోవడం. పేద ప్రజలు ఇప్పుడే కొత్తగా దీని గురించి తెలుసుకోవాల్సి రావడం వల్ల కొంతమేర ఇబ్బంది ఉండవచ్చు.

వాస్తవానికి నగదు సహిత లావాదేవీలను తగ్గించడానికి, భారతీయులు సిద్ధంగానే ఉన్నారు. అయితే దేశంలో స్మార్ట్ ఫోన్ల వినియోగం చాలా తక్కువగా ఉన్నప్పుడు ఎలక్ట్రానిక్ పేమెంట్స్ ఎలా సాధ్యపడుతాయన్న ప్రశ్న వ్యక్తమవుతుంది. స్మార్ట్ ఫోన్లు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి. చదువురాని వారు సైతం వినియోగించుకునేలా. సాధారణ మొబైల్ ఫోన్ల ద్వారానే పేమెంట్స్ జరిపించే వెసులుబాటును కల్పించాలి. ఈ ప్రక్రియను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలి. కార్డు చెల్లింపులపై చార్జీలను రద్దుచేయాలి. లేదా తగ్గించాలి.

నగదు రహిత లావాదేవీలకు అలవాటు పడేందుకు దేశవ్యాప్తంగా చాలామంది చిరువ్యాపారులు స్వైపింగ్ మెషీన్ల కొనుగోలుకు సిద్ధపడుతున్నారు. నోట్ల రద్దుతో.. రాబోయే రోజుల్లో దేశంలో నగదు లావాదేవీలు 78శాతం మేర తగ్గనున్నట్లు ఆర్బీఐ చెబుతోంది. ప్రస్తుతం అది 20శాతంగా కొనసాగుతోంది. ఏదేమైనా త్వరలోనే భారత్ నగదు రహిత దేశంగా,తక్కువ నగదు మాత్రమే ఉపయోగించే దేశంగా ఆవిర్భవిస్తుందనే ఆశించాలి. తక్కువ లగేజ్‌తో సుఖ ప్రయాణం మాదిరిగానే తక్కువ నగదుతో జీవన సౌలభ్యాన్ని ప్రజలు తప్పక గుర్తిస్తారు. ■

మీకు తెలుసా?


## నగదు అధీకృత మారకపు విలువ

ఏ దేశానికైనా చట్టప్రకారం ఆమోదించిన నగదు విలువను ఆధీకృత చెల్లింపు మారకంగా అంగీకరించాలి. సాధారణంగా నగదు యొక్క చలామణీలోనున్న అన్ని విలువలూ చట్టప్రకారం చెల్లుబాటు అయేవే. ఈ విలువల నోట్లు, నాణేల విలువ ప్రతిదేశానికీ వేరువేరుగా ఉంటాయి. మళ్ళీ ఈ నగదు కూడ రెండు రకాలు.

**పరిమిత మారకపు విలువ:** ఈ విలువలో కొంతమేర చెల్లింపులు చేయవచ్చు. ఒకస్థాయిని మించి ఈ విధమైన చెల్లింపులను రుణదాత అంగీకరించకపోవచ్చు. ఉదాహరణకు చిల్లర నాణేలు. అలా నిరాకరిస్తే, ఎటువంటి చట్టపరమైన చర్యలనూ తీసుకోలేము.

**అపరిమిత మారకపు విలువ:** ఈ రూపంలోని ధనాన్ని, మొత్తం రుణ విముక్తికై వినియోగించవచ్చు. ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. ఎవరైనా ఇలాంటి నగదును తీసుకోడానికి నిరాకరిస్తే, వారిపై చట్టపరమైన చర్యలను తీసుకోవచ్చు. అందుకే దీనిని 'చట్టపరమైన మారకం విలువ అంటారు' అంటే ఎంతవిలువైన ఇలాంటి నోట్లను ఇస్తారో అంతవిలువమేరకు రుణవిముక్తి జరిగినట్లే! కాగితపు కరెన్సీ ఎప్పుడూ, దానికి ప్రభుత్వం ఆపాదించిన విలువ మేరకే చలామణీ అవుతుంది. అందుకే ఆయా నోట్లమీద I PROMISE TO PAY THE BEARER THE SUM OF RUPEES… ONLY అని ఉంటుంది. ఇవికాక, చట్టబద్ధంకాని మారకపు విలువ కూడ ఉంటుంది. అంటే, చెక్కులు, డ్రాఫ్టులు, హుండీలు వంటివన్నమాట! వీటిని తెలుగులో అన్యాక్రాంతయోగ్యతాపత్రాలు అనీ, ఆంగ్లంలో NEGOTIABLE INSTRUMENTS అని అంటారు. ■

## భారతీయ న్యాయస్థానాలపై విశేష ప్రచురణ.




భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం దేశ న్యాయస్థానాలపై ఒక పుస్తకాన్ని ప్రచురించింది. దేశంలో న్యాయస్థానాలు ఎలా మొదలయ్యాయి, ఎలా అభివృద్ధి చెందాయి అనే దానికి సోదాహరణంగా వివరించిన ఈ పుస్తకాన్ని **"COFFEE TABLE BOOK"** గా దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్. ఠాకూర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశానికి కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమూల్యంగా భద్రపరచుకోదగిన అనేక ఫోటోలు ఈ పుస్తకంలో ఉన్నాయి. "భారతీయ న్యాయస్థానాలు, గతం-వర్తమానం" అనే అంశంపై దేశవ్యాప్తంగా లబ్దప్రతిష్టులైన అనేకమంది న్యాయమూర్తులు, న్యాయవాదులు తమ అనుభవాలనూ, వ్యాఖ్యానాలనూ ఇందులో అందించారు.

Publishing date 1st February 2017, Posting on 2-3 February 2017
Yojana (Telugu) February 2017 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17




Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314